ఆంధ్రసచిత్రవార

పత్రిక



8-7-66

35 పైసలు



మీ 'మంచి'ని 'మూగ' గా
దోచుకున్న 'తేనెమనసులు'
తారలతో గుమ్మడి సూర్యకాంతం
కలిసి నటించిన
బాబూమూవీస్
కన్నెమనసులు
దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు నిర్మాత: సి. సుందరం సంగీతం: మహదేవన్
శ్రీ ఫిలింస్ విడుదల
NVKR

ఉత్తరాలు

సమ్మిశ్రణం సమంజసం

'వింతతెలుగు' దాని జవాబు 'పాతక్రొత్తల మేలు కలయిక' చదివేక మన భాష ఆంధ్రభాషా? తెలుగు భాషా? అను అనుమానం నాలో తలెత్తింది. అంతేకాదు మనభాషలో వేరేభాషల పదసమ్మేళనం జరుగకుండినచో, అద్దానిని ఆంధ్రు లాదరించ కున్నచో, అలనాటి 'గిరీశం ది గ్రేట్' మొదలు నేటి కథానికల్లోని 'సెప్‌మెంటు' 'థ్యాంక్యూ'లవరకు మనభాషలో సంఘటితమయ్యేవి కావేమో! శ్రీశ్రీ పంచపదులు, ఆరుద్ర కూనలమ్మలు మనవాఙ్మయములో సముచిత స్థానాన్ని సంపాదించుకొనగలిగేవి గావేమో! శుద్ధ గ్రాంథిక భాషను సూటిగా వ్రాయక, వివిధ ప్రాంతాల వ్యావహారిక భాషలలో నవలలు వ్రాసినపుడు దానిని మన ప్రజ హర్షించలేదా? శ్రీశ్రీ 'మహాప్రస్థానాన్ని' పఠితలు మన్నించలేదా? ఇవన్నీ మనభాష ప్రగతికి నిదర్శనములా? కల్మషమునకు దృష్టాంతములా?

మనదేశములోని వివిధ భాషలు, సంస్కృతులు వలెనే మన భాషగూడా వైవిధ్యము కల్గినయున్నది. విశాఖలో వారిభాషకు, గుంటూరువాక్కుకు, తెలంగాణ తెలుగుకు, నెల్లూరు నుడికారమునకుగల సామ్యాసామ్యములను పరికించినచో యీ వైవిధ్యము తేటతెల్లము కాగలదు. వివిధ భాషలవారు, వివిధ ఖండములవారుకలసిమెలసి పనిచేయు యీ దినములలో వారిభాష వీరు, వీరిభాషవారు "కలుపుకొనుట" ఎంతమాత్రము అసమంజసముకాదు. ఒకశతాబ్దము క్రిందటి ఆంధ్రుల భాషకు నేటి భాషకు ఎంతోభేదమున్నది అది వివిధ భాషలు మన భాషను కలుషితం చేయుటవలననే అనువారికి నాజవాబు— శతాబ్ది క్రితము మనవారి ఆచార వ్యవహారములు, ఆహార్యవ్యాపారములు అలాగేనున్నవా? అవిమారలేదా? ఆమార్పు ఎంత సమంజసమైనదో ఉత్కృష్టమైనదో మనమెరుంగమా? అటులనే ఆయామార్పుల కనుగుణ్యముగా భాషగూడ మారినది. ఆమార్పులు సంఘ కల్మషమును కడిగివైచినటులే భాషకూడ యీ మార్పులతో క్రొంగొత్త అందముల సంతరించుకొన్నది.

రావుగారు వ్రాసినట్లు "ఏభాషైనా, ఎప్పుడైతే పైభాష లన్నిటినుండి పొట్టుపదాల్ని గ్రహిస్తుందో, అప్పుడే ఆభాష వృద్ధిలోకి వస్తుంది" ఉదా. ఇంగ్లీషుభాష "ఆంగ్ల భాష ప్రాబల్యము తెలియని చదువరి లేడనినా అభిప్రాయం. ఆంగ్లేయులు ఏయేదేశములలో తమప్రాబల్యము కల్గియుండినారో ఆయాభాషలలోని కొన్నిపదములు తమభాషలో కలుపుకున్నారు. తెలుగుభాషలోని 'పందికొక్కు' ఆంగ్లములో 'బాండికూట్' ఐనదని మనకు తెలియదా? వీటన్నిటివలన వారి భాషనూత్న శోభతో వెలుగుచున్నదే కాని, సంకుచితమై నీరసించిపోలేదు. ఇదేవిధముగ మనభాషగూడ సంస్కృత, ఆంగ్ల, భాషలలోని పదములను మాత్రమేగాక ఉర్దూ, తమిళం, ఒరియా, కన్నడంలోని పదములను గూడ తనలో యిముడ్చుకొనుచున్నది ఆంగ్లభాషలో వారి నిఘంటుకారులు క్రొత్త పదములను వెంటనే డిక్షనరీలలో చేర్చి, వాటిని ఉపయోగములోనికి తెచ్చుచున్నారు. ఆంగ్లభాషలో చాంబర్సు డిక్షనరీ వంటి ప్రమాణ గ్రంథాలున్నవి. కాని, మన భాషలో క్రొత్తగా చేర్చిన పదములను నిఘంటువులలోచేర్చి వాటిని ఉపయోగములోనికి తెచ్చుచున్నారా? క్రొత్త పదములు వాటి యర్థములు సూచించు సరియగు నిఘంటువు ఉన్నదా? కావున, భాషాభివృద్ధికి దోహదముచేయు 'ఆంధ్రనిఘంటు' రాజముల అవసర మెంతేని కలదు

కొన్ని భావములను నొక్కి వక్కాణించుటలో రచయిత తనకు మనసుకు తట్టిన పదమునువాడినపుడు ప్రకటించ గల భావసౌందర్యము, తన ధారావాహికమైన భావమును బంధించుకొని, తగిన పదముల కోసం వెదకుకొని వ్రాసినపుడు ప్రకటించు భావమునకును గల తారతమ్యమును సహృదయు లర్థము చేసికొనగలరు

గేయకవిత్వము, భావకవిత్వము, మన భాషను గాయపరచినవా? బాధపెట్టినవా? వానివలన మన భాష క్రొత్తసోయగం పొందలేదా? నేటి యువలోకం భావకవిత్వంతో భాసిల్లాలని భావించుచున్నారు. ప్రతి ఆంధ్రుడు తన భావాన్ని వాక్యరూపంలో ఉంచి దానిని పాఠకులకు పంచియివ్వాలని ఉవ్విళ్లూరడం ఆధునిక కవిత్వము వలనగాదా? భావకవిత్వంతో ఆధునిక భాషలో సెలయేరులా ఉరకలు వేయుచు ముందుకు పోగల భాషను మరల తిరోగమింప జేయబూనడం, క్లిష్టతరం చేయ ప్రయత్నించడం ప్రబంధ భాషకై పరిశ్రమింప జేయనుపక్రమించడం కాలగమనానికి ఎదురీదుట కాదా?

అందువలన వివిధ భాషలలోని యింపైన సొంపైన పదములను జాతీయములను మనము సంగ్రహించుట వలన మనభాష విశాలమైన పరిధిలో, నినూత్న ఉత్తేజముతో, విరాజిల్ల గలదనుటలో ఏమాత్రము సందేహము లేదు

'విశ్వేశ్వర్', కర్నూలు

వ్యాసాలు

13—5—66 సంచికలో ప్రచురించిన "డాక్టర్"గారి ప్రతివిమర్శ చదివి ఆయనకు విమర్శలపై సద్భావంలేదని తెలుసుకుంటిని, హిందీ, ఇంగ్లీషు, బెంగాలీ, అస్సామీసు భాషలలో ఇంతవరకు నాకు ఇలాంటి ప్రతి విమర్శ చూచే అవకాశం కలుగలేదు. పాఠకుల విమర్శలకు తత్సంబంధిత గ్రంథకర్తలు సరైన సమాధానమివ్వడమో లేక వారిరచనల్లో ఆవిమర్శలను ఆధారం చేసుకుని తమంతట తామే మరికొన్ని పంక్తులనుకలిపి మౌలిక రచనలను సవరణ చేసిపాఠకుల సందేహనివారణ చేయుటమో జరుగుతుంది. గాని వారట, వీరట, అదట,ఇదట అని హేళనచేసే వాక్యాలు వ్రాయరు నాలాంటి అల్పజ్ఞులకు జ్ఞానకిరణములు ప్రసాదించి

మీరు శ్రద్ధ వహించరా?



శ్రద్ధవహించే వారు మరియు శ్రద్ధవహించని వారు వున్నారు. శ్రద్ధవహించే వారికి చర్మమును పరిశుభ్రంగాను దుర్గంధ-రహితంగాను వుంచుకొనుటకు సింథాల్ సాధనము కంటె మించిన సాధనము ఇంకొకటి లేదు అని తెలియును. ప్రతి వారున్నూ శ్రద్ధవహించితే ప్రపంచం జీవించుటకు అతి చక్కని స్థానమై యుండును

సింథాల్ సబ్బు మరియు సింథాల్ టాయిలెట్ పౌడర్ రెండును జి-11 * (హెక్సాక్లోరోఫేన్)తో కూడినవి అత్యంత చక్కని జనులు చక్కగా నుండుటకు తోడ్పడుచున్నారు

* గైగీ ఎ జి ఎస్. ఎ ట్రేడ్ మార్కు

సబ్బులోను మరియు కొన్ని ఇ యుక్తికలం యుండును ఉపయోగించే నిమిత్తం సంపూర్ణ దుర్గంధరహితం కొరకు మీ కోసమే ప్రత్యేకముగా తయారుచేసిన సింథాల్ శోధనను మీరే ఉపయోగించుకోండి మా శాస్త్రీయ వైజ్ఞానిక వివరములు జి-11 ఏమిటి ? అనే ఉచిత చిత్ర చిన్న పుస్తకము కోసం గోద్రెజ్, బొంబాయి 12కు నేడే వ్రాయండి



చాలా కాలము-నిలువుండే, పొదుపైన సింథాల్

ఉత్తరాలు

నప్పుడే విజ్ఞులైన డాక్టర్ గారి వ్యాసాలు సాఫల్యము పొందుతాయనుటకు వెనకంజ వేయ నాకేమి కారణం కనిపించదు. సామాన్య ప్రజలనుద్దేశించి వ్రాసిన వ్యాసాలు అసామాన్యులను కొన్ని సందేహాలలో దింపగా వాటి సమాధానము కోరుకొనుట యుక్తి యుక్తమే. ఇందులో నేరమూ లేదు. అసంగంతమూ కాదు.

డాక్టర్‌గారు ఎలాగైతే సప్తసముద్రాలు కవుల వూహాలలోనివే గాని వాస్తవంగా భూమిమీదివి కావనుకోవడంలో పొరపాటేమిటో తెలుసుకోలేకపోయారో అలాగే, నేనుకూడా సదరు వ్యాసంలో కవి సమయాలు ఎక్కడైనా సాగరాల సందర్భంలో సుర సాగరాదిని సంకేతమాత్రానికైనా పేర్కొనక పోవడం వల్ల, అవి భూమిమీద వనుకోవడంలో పొరపాటేమిటో తెలుసుకోలేక పోయాను. ఇంతకూ డాక్టరుగారు తమ గాథలలో మధ్య, ఆధునిక యుగాలవిజ్ఞానం పైనే చర్చించారు. అందుకు వారి వ్యాసాలను ఆధునిక దృష్టిలో చూడడం సహజమే. ఆకారణాన వారు"అప్పటికి ఎదురుగా కనబడ్డ సముద్రాలు ఎక్కడివి?" అని వేసే ప్రశ్నార్థకము సమంజసము గాలేదని తెలుప సాహసించు చున్నాను. మళ్లీ "ఆ వూహాగానాలు ఆధునిక విజ్ఞానంలో పట్టవు" అనే వాక్యం కూడా అసమంజసముగానే యున్నది. కారణం ఆధునిక విజ్ఞానంలో ప్రతి చరణాన్ని ప్రప్రథమంగా డ్రాయింగులోనూ, వూహాచిత్రాలలోనూ మార్పు జేసి సదరు వస్తువు తయారైన పిమ్మట ఎలావుంటుందో ముందుగానే వూహించుకుంటారు. దీనికి ఉదాహరణ ఈమధ్య జరుపబడే అంతరిక్షయానాలు, యాత్రలున్నూ. మానవుడు చంద్రునిపై కాలిడక ముందే ఆ ఉపగ్రహంపై ప్రథమ మానవునకు ఏయే పరిస్థితులను ఎదుర్కొన వల్సొస్తుందో ఆపరిస్థితులను ఎలా అధిగమించవలెనో అప్పుడే రిసెర్చి ప్రారంభమయింది. అనగా విజ్ఞానానికి ప్రథమ సోపానం వూహాయేయన్నమాట. అలాంటప్పుడు విజ్ఞానానికీ వూహాలకూ సంబంధవిచ్ఛేదం చేయడం తర్కయుక్తంగా లేదు. ఇప్పటికైనా డాక్టర్‌గారు తమ అభిమతాన్ని తెలియబరుస్తారని కోరుతున్నాను.

కె. ఆనందరావు (దులియాజాన్)

* * *

"చెమట ఎందుకు పోస్తుంది?" అన్న వ్యాసాన్ని చదివిన ఒకానొకబుజ్జి "ఇళ్లు చల్లబరుచుకునే రెఫ్రిజిరేటర్లు ఎక్కడదొరుకుతాయోతెలిపితే సంతోషిస్తాను" అన్నారు ఆమెను సంతోషపెట్టడం నాకూ ఇష్టమేకాని, ఈవిషయంలో అశక్తుణ్ణి. ఏమంటే, ఆమె కోరినటువంటి రెఫ్రిజిరేటర్లు ఎక్కడదొరుకుతాయో నాకూ తెలియదు అటువంటివి వున్నాయని ఆవ్యాసంలో నేను వ్రాసిన జ్ఞాపకం లేదుమరి. అయితే ఒక్కమాట గట్టిగా చెప్పగలను చల్లబరిచే సాధనాలన్నీ (ఎయిర్‌కండిషనర్లు అయినా, ఎయిర్ కూలర్లు అయినా, రెఫ్రిజిరేటర్లు అయినా) ఒకేసిద్ధాంతాన్ని ఆధారం చేసుకుని పని చేస్తున్నాయి. అదే ఆవిరి అవడం ద్వారా చల్లబడడం. ఇదేపద్ధతి ఉష్ణ రక్తజీవులలోనూ కనుపిస్తోంది.

"రెఫ్రిజిరేటరు తలుపు తెరచి ఉంచుతే గది చల్లబడుతుందా?' అని కొందరికి సందేహం చల్లబడదు ఏమంటే రెఫ్రిజిరేటరు చేసేదల్లా లోపలి వేడిమిని బయటకు తొయ్యడం మాత్రమే. దీనికి 100 శాతం సామర్థ్యం (ఎఫిషెన్సీ) లేదు. కనుక, రెఫ్రిజిరేటరు తలుపు తెరిచిఉంచుతే గది వేడెక్కుతుంది.

మహీధర నళినీమోహన్ (ఢిల్లీ)

బాలసాహితి

20—5—66 పత్రికలో మహీధర్ నళినీ మోహన్ గారు "ఆరునెలలు కాదు, ఆరేళ్లుగడువు కావాలన్నా ఇవ్వడానికి నాకు అభ్యంతరం లేదు". అని వ్రాశారు. కాని అది తప్పు అని నేను తలంచుచున్నాను.

పక్కింటి ఆసామి వందరూపాయలు అప్పుగా అవి (ఆ అప్పు) తీర్చడానికి ఆరునెలలు గడువు కోరెను

అటువంటప్పుడు మధుశ్రీగారు వానిని (ఆరు నెలల గడువును) రెండవకోరిక అనుట తప్పుగా భావించుచున్నాను.

జి ఎస్ శివవ్ (రాజేంద్రనగర్)

సి ని మా

6—5—66 సంచికలో ప్రారంభించబడిన "పన్నిటివీధుల్లో, కన్నీటి జల్లులు" వ్యాసం సినిమా ప్రపంచంలో నూతన నటీనటులుగా కావాలనేవారికి మెదడుకు మేతగా బాగుంది. ఈ వ్యాసం మమ్మును బాగా ఆకర్షించింది.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 8—7—'66
పరాభవనామ సం॥ ఆషాఢ మాసం బ॥ పంచమి
సంపుటము : 58 సంచిక : 45
స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

క్రొత్తరేట్ల ననుసరించి 14—1—1966 మొదలు ఆంధ్రసచిత్ర వారపత్రిక చందా వివరాలు.

భారతదేశం

	పోస్టుద్వారా రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతర దేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	26.00
అర్ధ సంవత్సర చందా	13.00

రచయితలకు మనవి

మా కార్యాలయం చేరే ప్రతిరచనతోనూ దానిరచయితగాని, రచయిత్రిగాని అది తమ స్వంతరచనేననీ, దేనికీ అనుకరణ కాదనీ హామీ వ్రాసి పంపాలి. ఇటువంటి హామీలేని రచనలను ప్రచురణకి స్వీకరించలేము.

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక

మన లో మాట

'నిరుద్యోగపర్వం' రచయిత శ్రీ లేళ్లపల్లి వేంకటలక్ష్మీనారాయణ ప్రస్తుతం బెంగుళూరులోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సయిన్స్'లో 'రిసర్చి స్కాలర్'గా ఉంటున్నారు. ఈ శీర్షిక నాలుగు, అయిదువారాలకన్నా రాదు. అయిపోయేప్పటికి కనీసం కొందరు చదువరులకయినా 'నిరుద్యోగ పర్వం' ముగియవచ్చునని ఆశిస్తున్నాము...

* * *


'సమాజంలో గ్రామసేవిక ఎదుర్కొనే సమస్యలు' వ్యాసం నేడు మన దేశంలోని రాజకీయ, సాంఘిక సంస్థలలో అతిముఖ్యంగా తయారయిన ఒక విషయానికి సంబంధించినది. గ్రంథ సమీక్షకులుగా 'రవి'గారి పేరు పాఠకులకి తెలిసినదే...

* * *

సినిమాలకి కథలు రాయాలనుకునేవారికి శ్రీ సుకర్తాకర్ ఒక చిట్కా చెప్పారు. దానిని ఈ సంచిక సినిమా పేజీలలో చదువుకోవచ్చు...

విషయానుక్రమణిక

ముఖచిత్రం : 'సంగీతలక్ష్మి'లో జమున.



మీరిద్దరూ కలిసి పని చేస్తా రని ఆశిస్తాను
సంజీవరెడ్డి ముఠా
ఐక్యత
సంజీవయ్య ముఠా
రూపాయి విలువ తగ్గింపు
నాలుగవ ప్రణాళిక
సుస్వాగతం పెకింగ్ కు రండి!
భుట్టో
భారత దేశంలో నానాటికీ ఏనుగులు పెరిగిపోతున్నాయట—వార్త
తీవ్రతరమైనవి
రాష్ట్రాల తగాదాలు
నిర్బంధాలు
కుల విభేదాలు
బ్రహ్మాండమైన ప్రణాళికలు
లంచగొండి తనం
ముఠా తత్వాలు
నల్ల ధనం
నిర్వహణలో దుబారా

న్యూఢిల్లీ లేఖ — శ్రీకృష్ణ

ప్రభుత్వరంగంలోని లోటుపాట్లు: ప్రధాని సూచనలు

భారత పాకిస్తాన్‌లకు అమెరికా ఆర్థిక సహాయం ఈ వారంలో పునఃప్రారంభమైంది ఈ సహాయం తిరిగి ప్రారంభం అయిన సందర్భంలోనే భారతదేశంలో రూపాయి విలువ తగ్గటం, పాకిస్తాన్ మంత్రివర్గం నుంచి భుట్టో నిష్క్రమించటం సంభవించటం కేవలం కాకతాళీయమే అయినా భుట్టో నిష్క్రమణ వల్ల రెండు దేశాల మధ్య ఉన్న కలతలు పోయి దగ్గరవటమూ, ఉపఖండంలో ప్రశాంతత నెలకొనటమూ జరుగుతాయన్నది మాత్రం అనుమానాస్పద విషయంగానే కన్పిస్తున్నది రెండుదేశాలు తగాదా లాడగలవన్నదీ నిజమే కానీ రెండు దేశాలు ఏకాభిప్రాయంతో శాంతియుత సంబంధాలను పెంపొందింపజేసుకోగలవన్నదీ వాస్తవమే తాష్కెంట్ ఒప్పందం రెండుదేశాలు బలాలను వెనక్కు తీసుకోడానికి, శాంతిసాధనకు సహకరించింది కానీ భారత్ పాక్‌ల మధ్య స్నేహాన్ని సూచించే అభివృద్ధి మాత్రం మృగ్యంగానే ఉంది దీనికి కారణం నౌకాయానం, సరకులు, వ్యాపారాలకు సంబంధించిన నిర్ణయాలు భారతదేశానికి సంబంధించేట్లుగానే రూపొందించడం కావచ్చు ఇక పోతే పాకిస్తాన్ వ్యవహారం అమెరికాకి బాగా తెలుసు పాకిస్తాన్‌కు సంబంధించినంతవరకూ భారత పాకిస్తాన్‌ల సంబంధాలను బాగుపరచడానికి కాశ్మీర్ సమస్యా పరిష్కారమే సరైన ప్రయత్నం కాశ్మీర్ సమస్యా పరిష్కారానికిపూర్వం భారత పాకిస్తాన్‌ల సంబంధాలు చక్కబడితే ఆ సమస్య పరిష్కారం అడుగున పడిపోతుందని రావల్పిండి అభిప్రాయం

భారతదేశానికి సంబంధించినంతవరకూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధానిగానీ, ప్రభుత్వంగానీ ఆ సమస్య పరిష్కారాన్ని గురించి ఆలోచించడం ప్రమాదకరమైన విషయమే అవుతుంది — అలా చేయుటం పాకిస్తాన్‌ని సంతృప్తి పరచినా కూడా ఇంకో విధంగా చెప్పాలంటే ఉపఖండంలో శాంతి—అధ్యక్షుడు లిండన్ జాన్సన్ 'క్రీడాహయం'—సమస్యగానే మిగిలిపోతుంది తాష్కెంట్ ఒప్పందం వల్ల వెనుకకు తీసుకోబడిన సాయుధబలాలు ఏ క్షణంలోనైనా తిరిగి విజృంభించవచ్చు. పాకిస్తాన్ కాబినెట్ నుంచి భుట్టో నిష్క్రమణ చైనా—పాక్ సంబంధాలపై ఎలా పని చేసిందీ వచ్చేవారం విశదం అవుతుంది.

మరో వైపు రూపాయి విలువ తగ్గింపు భారతదేశం మధ్యా, రూపాయిద్రవ్యమానంగా ఉన్న యితర కమ్యూనిస్టు రాజ్యాల మధ్యా చిక్కులను తెచ్చిపెట్టింది ఏది ఏమైనా ఈ సహాయంవల్ల దీర్ఘకాలిక ఫలితాలు లభించాలి భారతదేశం పాకిస్తాన్ కంటే ఎక్కువ ప్రమాదానికి లోనవుతున్నది పాకిస్తాన్ అమెరికా సైనిక కూటమిలో చేరిన రాజ్యం. అంతే కాకుండా మరికొన్ని రక్షణ వ్యవస్థలలో కూడా దానికి సభ్యత్వం ఉంది గత భారత పాకిస్తాన్ తగాదాలలో దానికి ముస్లిమ్ రాజ్యాల సానుభూతి లభించింది. తాను తక్కువైపోతానేమో అన్న భావం వల్లనో, లేక కావాలనో భారతదేశం తాను నిర్వహించగల పాత్రను కూడా అంతర్జాతీయ వ్యవస్థలో నిర్వహించలేకపోయింది. అదే భారతదేశాన్ని బలహీనం చేసింది ఇంతకు పూర్వం తగిన జాగ్రత్తలు తీసుకోకుండా రూపాయి విలువ తగ్గించడం జరగలేదు కాబట్టి పాకిస్తాన్ కాశ్మీర్ విషయంలో చేస్తున్న పోటీని తగ్గించేందుకు భారతదేశం తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

మరో రెండు ప్రశ్నలలాగే ఉండిపోయినయి. మొట్టమొదట అమెరికా, బ్రిటన్‌ల నుంచి లభించే సహాయం ఉపఖండంలోని శాంతిభద్రతలకు ముడిపెట్టబడి ఉంది. పాకిస్తాన్ కావాలనుకుంటే వాటిని భంగపరచగలదు వీటిని బట్టి తామరాకు మీద నీటి బొట్టులాంటి విదేశీ సహాయాన్ని నమ్ముకుని భారీఎత్తున నాలుగవ ప్రణాళికను రూపొందించటం శ్రేయస్కరంకాదు. ఆసహాయంకూడా సంవత్సరానికి యింత అని నిర్ణయించబడి ఉండడం విస్మరించడానికి వీలులేని ఓ హెచ్చరిక లాంటిది.

భారత ప్రభుత్వం దేశంలోనూ, విదేశాల్లోనూ రూపాయి విలువ తగ్గింపు విషయంపై ఓ 'తెల్లకాగితాన్ని' ప్రచురించింది. విలువ తగ్గింపు ఇండోనిషియాలో విపరీత పరిణామాలతో ఎలా అంతమైందో కూడా అందులో సూచింపబడింది. సైనిక సంబంధమైన ఖర్చు ఎక్కువ అవటంవల్లా, ఉత్పత్తికి సంబంధించని యితర వ్యయాల మూలంగా ఇండొనీషియా 'రుపయా' విలువ తగ్గిపోయిందని వాదన. ఇటీవలి రుపయా విలువ తగ్గింపువల్ల ద్రవ్యోల్బణం ఏర్పడటం తప్పని సరైంది. క్రిందటి డిశంబరులో ఒక అమెరికన్ డాలర్‌కు మారకం రేటు 10,000 రుపయాలు అయింది.

సైనిక సంబంధమైన వ్యయాన్ని గురించి చెప్తూ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి అది తన శక్తికి మించిన పని అని చెప్పటం సబబుగానే ఉంది. చైనా ఒపక్క బెదిరిస్తూ ఉంది. మరో వైపు పాకిస్తాన్ తన సైనిక సంబంధమైన వ్యయాన్ని 40 శాతం పెంచింది. అలాంటి ఈ సమయంలో అసలే రూపాయి విలువ తగ్గింపుతో తిరిగిపోయిన రక్షణవ్యయాన్ని భారతదేశం ఇంకా తగ్గించలేదు. 1949లో రూపాయి విలువ తగ్గింపును గురించి యింతకుముందు ప్రస్తావించటం జరిగింది. అప్పటి ఆర్థికమంత్రి, కీర్తిశేషులైన డాక్టర్ జాన్ మత్తయ్ భారతదేశం తన తాహతుని మించి వ్యవహరిస్తున్నదనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అప్పటి వరకూ ఉత్పత్తికి సంబంధించిన వ్యయంపై ఆంక్షలు అంటూ ఏమీలేవు. పైగా ప్రజాధనాన్ని దుబారా చేయడానికి ఏర్పడిన ప్రతి అవకాశమూ వినియోగించుకోబడింది. ఇక ద్రవ్యోల్బణానికి సంబంధించినంతవరకూ 1965—66 లో భారతదేశంలో 400 కోట్ల రూపాయల 'కృతక ధనం' ఉంది.

- ఇండోనేషియా పరిస్థితి రాకుండా భారతదేశం ఏమి జాగ్రత్తలు తీసుకున్నదన్నదే ఇక్కడ ప్రశ్న. ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసేందుకు ఖర్చును తగ్గించినట్లుగానీ, రాష్ట్రాలు నిలవలను మించిన మొత్తాలను తీసుకోడంపై ఆంక్షలను విధించినట్లుగానీ యింతవరకూ దాఖలా ఏమీ కన్పించడంలేదు. వాస్తవంగా కూడా ఆర్థిక రంగంలో, ధన విధానంలో క్రమశిక్షణను గురించిన వివరాలను ప్రభుత్వం బయటికి పొక్కనీలేదు. అలా బయటపెట్టడం అన్నదే రూపాయి విలువ తగ్గింపు జరిగిన ఈ సందర్భంలో అవసరమైన చర్య.

* * *

న్యూఢిల్లీలేఖ

ప్రధాని చేసిన రెండు సూచనలనూ ప్రత్యేకంగా యిక్కడ చర్చించడం అవసరం. కొన్ని పరిశ్రమలకు సంబంధించినంతవరకు ప్రైవేటు పెట్టుబడులపై ఉన్న నిర్బంధాలను ప్రభుత్వం సడలించింది. ముఖ్యంగా రసాయనిక ఎరువుల పరిశ్రమ విషయంలో ఈ సడలింపు జరిగింది దానికి కొన్ని కారణాలున్నాయి.

రసాయనిక ఎరువుల పరిశ్రమలోకి ప్రయివేటు పెట్టుబడిని ఆహ్వానించింది ప్రభుత్వం. ఆ విషయంలో ప్రభుత్వం ఎన్నో నిర్ణయాలు చేసింది. అవి పెట్టుబడి, నిర్వహణ, ధరల కంట్రోలు విషయంలో సడలింపు, ముడిసరకుల దిగుమతిలో ప్రాముఖ్యత, ఋణ సౌకర్యాలు, సీడింగ్ కార్యక్రమం మొదలైన వాటికి సంబంధించినవి. కర్మాగారాల స్థాపనకు కూడా స్థలాన్ని ప్రభుత్వమే నిర్ణయించింది. ఈకొత్త విధానం తీవ్రమైన విమర్శకు గురైంది. దాన్నే కొందరు భారతదేశాన్ని అమ్మివేయటం అని కూడా అన్నారు కానీ యింతవరకూ దేశంలోని ప్రయివేటు పెట్టుబడిదారుల నుంచిగానీ, విదేశీ ప్రయివేటు పెట్టుబడిదారుల నుంచిగానీ అలాంటి కర్మాగారాల స్థాపనకు అభ్యర్థనలు ఏమీ రాలేదు.

భారతదేశంలో రూపాయి విలువ తగ్గింపుకు ప్రపంచబ్యాంక్, అమెరికాలు కారణభూతాలు. అమెరికా వ్యాపారస్తులు తమ లాభాలను కొంతవరకూ తగ్గించుకుంటామని అన్నారు. రూపాయి విలువ తగ్గింపుకు పూర్వం ఆర్మర్ కంపెనీ బిర్లాస్‌కి సహకారాన్ని అందించేప్పుడు కూడా ఈ విలువ విషయం సమస్యగా తయారైంది.

ఇక్కడ ఒక విషయం చెప్పటం అవసరం. కేబినెట్ సెక్రటరీ శ్రీ ధర్మవీర మొదట అనుకున్న ప్రకారం ఎరువుల సంఘానికి నాయకత్వం వహించి అమెరికా, కెనడా, జపాన్‌లు వెళ్లలేదు. ఆయన పంజాబ్ గవర్నర్‌గా నియమింపబడ్డారు. వ్యవసాయ కార్యదర్శిగా ఉన్న శ్రీ శ్రీనివాసన్ ఈ సంఘానికి నాయకత్వం వహిస్తారు.

"ప్రభుత్వరంగాన్ని లాభదాయకంగా, ఉండేలా ఎలా రూపొందించాలి" అన్న విషయంపై చర్చను ప్రారంభిస్తూ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి "ప్రభుత్వరంగంలోని సంస్థలు లాభాలు తీసుకురావడం, సక్రమంగా పని చేయటం, అభివృద్ధిని చూపించడం అన్న ఆఖరి పరీక్షలో ఉత్తీర్ణతను పొందింతేనే వాటికి అర్థం ఉంటుంది." అన్నారు అవి సక్రమంగా పని చేయడానికి ఆమె కొన్ని సూచనలను కూడా చేశారు. కానీ ఈ చర్చలో ఉన్న పెద్దమనుష్యులు ప్రభుత్వరంగంలో ఉన్న చెడుగు తొలగించగలరా అన్నదే ప్రశ్న. ఇంకో విషయం ఏమంటే లాభాలు సంపాదించాలన్న నియమాన్ని ప్రవేశపెట్టింది మూడు సంవత్సరాల క్రితమే పండిత కె. డి. మాలవీయా లాంటి వారు దాన్ని తీవ్రంగావిమర్శించారు.

పథకాన్ని రూపొందించడంలోనూ, స్థల నిర్ణయం విషయంలోనూ అవకతవకలను కూడా ప్రధాని సూచించారు. స్థలాన్ని నిర్ణయించటం రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని జరుగుతున్నది కానీ ఆ పరిశ్రమ ఆర్థికంగా ఆ స్థలంలో పురోభివృద్ధిని సాధిస్తుందా అని మాత్రంకాదు. కానీ రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని చూస్తే అస్సాంలోని నూనె శుద్ధికర్మాగారం కలకత్తాలో ఉండాల్సింది నన్మతి నూనె శుద్ధికర్మాగారం ఆర్థికంగా అభివృద్ధిని చూపకపోవడంవల్ల దాని విస్తరణ పథకాలను ప్రభుత్వం రద్దు చేసింది. మళ్లీ యిప్పుడు కలకత్తాను, బరౌనీని కలుపుతూ ఓ పైపులైన్ వేయబడింది ప్రభుత్వరంగంలోని చాలా సంస్థలు యిలాంటి పెద్ద పెట్టుబడుల వల్లా, యితర ఖర్చులతోనూ సతమతమవుతున్నాయి.

*　　*　　*

బొంబాయిలో 'సోయాబీన్ మిల్క్ ప్లాంట్' భారత్—అమెరికా ప్రాజెక్టు. దాన్ని ప్రభుత్వం చాలా జాగ్రత్తగా పరిశీలిస్తున్నది. బొంబాయిలోని జీవన్ లాల్ భారతదేశానికి చెందిన పార్టీ. ఆనంద్‌లోని కైరా కోఆపరేటివ్ యూనియన్. సోయా చిక్కుడు పంజాబ్, హిమాచలప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లోని కొండ ప్రాంతాలలో పండించడానికి ఆసక్తిని కనబరుస్తున్నది అయితే యితర పంటలకు అయేంత ఖర్చు దీనికి కాదని చెప్పటం జరిగింది. మిగతా ధాన్యాలతో కలిపి దీన్ని పండించవచ్చు.

పాలు, యితర ఆహార పానీయాలుగా ఉపయోగించే బలవర్ధకమైన పాల సంబంధమైన పొడి తయారు చేయాలని బొంబాయి పథకం ఉద్దేశ్యం. 10 లక్షల రూపాయల విలువగల సరంజామా, రాయల్టీలు ఈ ప్రాజెక్టుకు విదేశీ మారకం రూపేణా ఖర్చు అవుతుంది. ●

'ఆంధ్రసచిత్ర వారపత్రిక'లో ప్రచురణకు ఇండియన్ ఇంక్ తో వేసిన కార్టూనులు మాత్రమే పంపాలి. సాధారణంగా 4''×2'', 4''×4'' చిత్రాలు పత్రికలో పడుతూ ఉంటాయి. సం॥



గడప ముందు కారు వచ్చి ఆగిన శబ్దం విని, చేతిలో అల్లుతున్న లేసుతో అలాగే వీధిద్వారం దగ్గరికి వెళ్లి చూసింది సీత. కారు తమది కాదు. ఎదిరింటి వారిది. కారు లోంచి ఆ ఇంటాయనా, భార్యా కొడుకూ దిగి ఇంట్లోకి వెళ్లిపోయేరు సీత ఉస్సు రంటూ లోపలికి వచ్చింది. ఆమెకి క్షణ క్షణానికి ఆత్రుతా విసుగూ ఎక్కువవ్వు తున్నాయి.

'ఛా! ఏమిటి బాబూ ఈయన? వట్టి జిడ్డు మనిషి. నిర్మల రైలు దిగే వుంటుంది సుమా! ఏవో మాటలు పెట్టి దాన్ని అక్కడే ఆపేసి వుంటారు. కాకపోతే, కారు మీద రావడానికి ఇంతసేపా? అసలు తనే స్టేషన్‌కి వెళ్దామనుకుంది. పీకల మీద కత్తిలాగా ఆ డెలివరీ కేసొకటి దాపురించి నిముషాల్లో తెముల్చుకోవల్సిన పని గంటల తరబడి అయింది. ఆయన అడిగేరు కూడాను "వస్తావా నిర్మలని తీసుకువద్దాం" అని. 'హాస్పటల్లో చచ్చి చచ్చి వచ్చేను. వొంట్లో పిసరంత వోపికలేదు మీరే వెళ్లి తీసుకు రండి దాన్ని" అంది స్నానం అదీ కానిచ్చి నడుం వాల్చి లేచేసరికి ఇంత టయిమయింది. బొత్తిగా ఇంత ఆలస్యమవుతుందా, రావ డానికి?

సీత లేసుని మంచం మీద పడేసింది. వీధి తలుపులు చేరవేసి వంట గదిలోకి వెళ్లబోతుంటే గుమ్మంలో పెద్ద శబ్దం చేస్తూ వచ్చి ఆగింది కారు. కారు దిగి సీత భర్త ప్రభాకర్, కూతురు నిర్మల ఇంట్లోకి వచ్చేరు. ప్రభాకర్ పెదాల మీద చిరునవ్వు చూడగానే సీతకి అంచల మీద కోపం వచ్చేసింది.

"చాల్లెండి. నవ్వేరు. మూడు గంట లయింది. చూసి చూసి కళ్లు నెప్పులు పుడుతున్నాయి తొవలో టైము సరిపో యుందా లేదా కబుర్లకి?" ప్రభాకర్ గట్టిగా నవ్వేడు. "కబుర్లు చెప్పుకుందికి టయిమెక్కడుందే వెర్రిదానా. ఆ రైలు ఎన్నింటికి వచ్చిందో స్టేషన్‌లో ఎంతసేపు పడిగాపులు కాశానో నీ కూతుర్నడుగు" అన్నాడు బట్టలు మార్చుకుంటూ.

భోజనాల దగ్గర తను అడిగిన ఒకటి రెండు మాటలకి జవాబు చెప్పక తలవంచుకు అన్నం తింటున్న కూతుర్ని చూసి సీత తెల్లబోయింది. వేళ్లతో అన్నం మెతుకుల్ని కెలుకుతుంది,

"ఏమిటే ఆ పరాకూ?" అంది.

నిర్మల ఉలిక్కిపడి తలెత్తి తల్లి వేపు చూసి గబగబా అన్నం ముద్దలు మింగింది. పొలమారి వుక్కిరిబిక్కిరై నీళ్ళు గటగటా తాగి

"ఏమిటమ్మా, అంటున్నావూ?" అంది.

సీత భర్త వేపు చూసింది "చూశారా దీని వాలకం?"

"కారులోనూ అదే వరస రైలు దిగిం దగ్గర్నుంచీ మూతి ముడుచుకునే వుంది" అన్నాడు ప్రభాకర్

"బావుంది" అంతకంటే సీతకేమనాలో తోచలేదు. ఆమె కేదో భయం పుట్టింది నిడదవోలులోనే బి ఏ చదువుతానని పట్టు బట్టిన నిర్మల ఈ రెండేళ్ళలోనూ అక్క జేసీ ఎంకె తగిలించుకోలేదు కద? అలాగ యితే అడపాదడపా శలవుల కొచ్చినపుడు బాగానే వుంది. ఇలా లేదు పరాగ్గా వరే కాస్సేపు నారుకుని అడుగుతే చెప్పకేం చేస్తుంది అనుకుంది.

సీత కూతురి గదిలోకి వెళ్ళేసరికి నిర్మల కిటికీ దగ్గర మో చెయ్యి మీద గడ్డం ఆన్చుకుని వంగి నించుంది. ఏదో ఆలోచిస్తున్నదల్లా తల్లిని చూసి తత్తర పడింది. సీత కూతురిని చూసీ చూడనట్టు వెళ్ళి మంచం మీద కూర్చుని అడిగింది

"ఏమే పరీక్ష బాగా రాసేవా?"

"ఊ"

"క్లాసు వస్తుందా?"

"రావచ్చు"

సీత ఇంక ఉగ్గపట్టలేకపోయింది గబ గబా వెళ్ళి కూతురి మొహాన్ని తన వేపు తిప్పుకుని గదమాయించినట్టే అడిగింది. "ఏమిటే నిర్మలా ఆ పరాధానాలు? వచ్చిం దగ్గర్నుంచీ చూస్తున్నాను హాస్టల్లో ఎవరితోనైనా విరోధపడ్డావా? కాలేజీలో, ఏమైనా గొడవలు జరిగేయ?"

చాలాసేపు గడిచేక నిర్మల నోరు విప్పింది, "పాపగారు ఎంత పని చేసేరో చూసే వమ్మా" అంటూ.

"పాపగారా!"

"ఆవిడే, మీ చిన్ననాటి స్నేహితురాలు. రెండేళ్ళ క్రితం మనం నిడదవోలు వెళ్ళి నపుడు ఆహా! ఓహో! అంటూ, సరవాలేదు. మీ పిల్లని హాస్టల్లో వుంచడమెందుకు. మా ఇంట్లోనే వుండనీ మనవేం కొత్త వాళ్ళమా? అందా అప్పుడు నేనావిడ మాట కాదని హాస్టల్లో చేరడమే మంచిదయిం దనుకో. ఏదో మీ ఫ్రెండే కదా అన్న చనువు కొద్దీ పది పన్నెండు సార్లు వాళ్ళింటికి వెళ్ళేను ఆవిడ బండారం కాస్తా బైట పడిపోయింది."

"ఏం. ఏమందేమిటి?" సీత కుతూ హలంగా అడిగింది.

"మొదట్లో వెళ్ళిన ఒకటిరెండు సార్లూ ఆప్యాయంగానే ఆహ్వానించిందిలే. నా తిండీ, ఆరోగ్యం ఎలా వున్నాయో అడిగి తెలుసు కునేది. 'గ్రహచారం బావుండక మీ అమ్మా నేనూ కులం తప్పి పుట్టేముగాని లేకుంటే దాన్ని ఆడక్కుండానే నా ఇంట్లో విస్తరి వేసి వడ్డించేదాన్ని నీకు. నాకా మాత్రం హక్కులేదూ.' అనేది నవ్వుతూ 'పోనీ ఆ వూసు వదిలేయి. హాస్టల్లో పదిమంది మధ్యా గుద్దుకోవడమేం ఖర్మ. ఇంత ఇల్లుంది ఇక్కడుంటే నాకు తోడుగా కూడా వుంటా వంటే నీకు పైత్యం చేసింది' అని విచా రించేది మరోసారి వెళ్ళేసరికి ఇంత అభి మానమూ ఏమయిపోయిందో అనుమానంగా చూడ్డం ఆరంభించింది ఆవిడ ముద్దుల తనయుడున్నాడు చూశావ్, ఆ ఆనందబాబు నుంచే వచ్చిందీ గొడవంతానూ" అంది నిర్మల చివరి మాట చెబుతుంటే నిర్మల కళ్ళు నీటితో నిండిపోయాయి.

కూతురి కన్నీరు చూడగానే సీత గుం డెలు టకటక కొట్టుకున్నాయి.

"ఆ అబ్బాయేం చేశాడే" అంది యధా లాపంగా

"ఏం చెయ్యక్కర్లేదు. పడాయి మగ వాడు పక్కన నుంచుంటే చాలు, లోకం ఆడిపోసుకోవటానికి. చదువు సంగతెలా వున్నా ప్రతీ పార్కులోనూ, సినిమా హాల్సు లోనూ మేమేనట. ఒకరోజు 'అమ్మాయీ జాగర్తగా చదువుతున్నావా?" అంది. మరో నాడు 'ఈమధ్య బొత్తిగా మా వాడిల్లు పట్టడంలేదు ఇద్దరూ ఒకటే క్లాసుట గదూ వాడిని కాస్త మందలించు' అంది చివరికోనాడు "ఏమిటమ్మాయీ నిన్న మీ రిద్దరూ కాలేజీ నుంచటే ఎటో వెళ్ళేరుట మన పక్కింటి కమల మీ క్లాసమ్మాయే చెప్పిందిలే మీ అమ్మకి ఉత్తరం రాయ మన్నావేమిటి?" అనేసింది. ఇంతకంటే వేరే తిట్టి, కొట్టి ఏడిపించక్కర్లేదమ్మా మనిషిని చాలు నేరకపోయి వెళ్ళేనా వూరు ఇక్కడ కాలేజీ లేనట్టు. బుద్ధి వచ్చిందిలే."

మాటాపి తన వేపే నిలువు గుడ్లే సుకుని చూస్తున్న తల్లిని తెల్లబోయి, చూసింది నిర్మల.

"ఏమిటమ్మా అలా చూస్తున్నావు?" అంది.

"ఏంలేదు. సర్వసాధారణంగా మీ ఈడు పిల్లలికి బుద్ధి వచ్చినంత పని జరిగితేగాని బుద్ధిరాదులే. అందుకని చూస్తున్నాను. నువ్వామాట అన్నావంటే ఏదో అయిందనిపి స్తోంది నాకు"

తల్లి అలా అనగానే నిర్మల కళ్ళు ఎర్ర బడిపోయేయి. సన్నగా రాగం ఆరంభిం చింది కూతురు తనకంటే పౌరుషం కలదని తెలిసినా సీత కూతురిని రెచ్చగొట్టకుండా ఉండలేకపోయింది ఈ దెబ్బతో నిర్మల మనసులోంచి ఆ నిజం ఏదో వూడిపడక తప్పదని సీత ధైర్యం ఇలాటి విషయాల్లో జాప్యం చేసిన కొద్దీ భయంకరమైన పరిణా మాలు ఏర్పడతాయన్నది సీత సిద్ధాంతం. ఉత్తప్పుడు నిర్మల తనకి ముద్దు కూతురు గాని, ఒక నేరస్తురాలిగా తనకి తోచినపుడు కూతురు— కడుపున పుట్టిన బిడ్డ—ఈ బాంధవ్యాలు శిక్షార్హతకి అడ్డురాకూడదని ఆమె అనుకుంది అందుకే గొంతు పెద్దది చేసి అంది "నిప్పులేందే పొగ వస్తుందిటే, నిర్మలా నలుగురూ మిమ్మల్ని అనుకున్నా రంటే, వుత్తినే ఆమాట పుట్టించడానికి వాళ్ళకే మవసరం? జాగర్తగా చూస్తుండ మని నిన్ను నేను అప్పగించి వచ్చేను కాబట్టి, ఇద్దరి తరపునా పెద్దది అక్కడుంది కాబట్టి మందలించింది పిల్లలు కళ్ళుమూసుకు ప్రవ ర్తిస్తుంటే"

నిర్మల తల్లి మీద మండిపడింది. "మేమ క్కడ కళ్ళు మూసుకు ఉన్నామో, ఎలా వున్నామో నువ్వు చూసేవా అమ్మా?" అనేసి ఒసారి ఆవురుమని కళ్ళు తుడిచేసు కుని ఎక్కిళ్ళు పడుతూనే సణిగింది. "ఆ పాపగారికి స్నేహితురాలిని అనిపించుకున్నా వులే నన్ను చూస్తే మీ ఇద్దరికీ ఎలాగో వుంది ఆనందబాబు లాంటి వాడితో కలిసి కళ్ళు మూసుకు గోతిలో దిగిపోయేంత ప్రేమ వ్యవహారం నడిపేవన్న వాళ్ళ కసలు బుద్ధిలేదు డబ్బూ అందం వుంది గనక దర్జాగా కనిపిస్తాడు తెలివుందేమో చదువు కొంటున్నాడు ఒక సరసం తెలీదు విరసం చేతకాదు ఆ తల్లి నిలబడు అంటే నిలబడ తాడు. కూర్చో అంటే కూర్చుంటాడు. అన్నీ తెలిసి మీరు నన్ను ఏడిపిస్తున్నారు....

సీత మనసులో నిశ్చయం చేసుకున్నంత గట్టిగా కూతుర్ని ఏడిపించ లేకపోయింది. "నేనన్నది లదికాదు నిర్మలా. ఇలా చూడు.

వింతయినా అతను మగాడు. నువ్వు ఆడపిల్లవి. మనసులు కలవడానికి కారణాలేమిటి? అనుభవపూర్వకంగా చెబుతున్నాను. ధన ఋణ ధృవాలు కలిస్తే విద్యుత్తు పుట్టక మానదు. అది మనల్ని కాల్చినంత దాకా పరిస్థితిని తెచ్చుకోకపోవడంలోనే ఉంది తెలివి '' అంది నెమ్మదిగా.

మర్నాడు నిర్మల ఎనిమిది గంటలయినా పక్కమీంచి లేవలేదు అప్పటికి నాలుగు సార్లు లేపి విసిగిపోయిన సీత డిస్పెన్సరీకి వెళ్ళడానికి టయిమవుతోందని త్వరత్వరగా తెమిలింది. వెళ్ళేముందు కూతురి గదిలోకి మరోసారి వెళ్ళింది

నిర్మల ఇంకా కళ్ళు విప్పలేదు. కనుబొమలు ఉండి ఉండి ముడుచుకుంటు, న్నాయి. పెదాలు విచ్చుకొంటూ ముడుచుకొంటూ అస్పష్టంగా చలిస్తున్నాయి దగ్గరగా వొంగి చూసింది సీత గదిలోకి ప్రభాకర్ వచ్చేడు.

“ఏమిటలా చూస్తున్నావు? అమ్మాయికి వంట్లో బాగోలేదా?” అన్నాడు. సీత అతడు అడిగిన దానికి జవాబు చెప్పకుండా “నాలుగురోజులు మీరు ఒక్కరే డిస్పెన్సరీని చూసుకోలేరా?” అంది.

“ఏం, ఎందుకూ?”

ప్రభాకర్ కంగారుగా అడిగేడు. తమ స్వంత డిస్పెన్సరీని సీత పక్కన లేకుండా ఒక్కహూ మానేజి చెయ్యలేనని అతని

నన్ను నమ్మవా?

భయం. ప్రవాహంలా వచ్చిపడే ఆ పేషెంట్లని తనకంటే సీతే హాపిగ్గా చూస్తుంది. పక్కన వుండి నామమాత్రంగా విధి నిర్వర్తించుకుని వచ్చేయడం ప్రభాకర్కి అలవాటు. అందుకే సీత వూరు వెళతానంటుందేమో అని “ఈ లీవుకి కారణం చెప్పు” అన్నాడు అతని దిగులేమిటో తెలుసుకున్న సీత నవ్వింది

“ఇదుగో, ఇదో పెద్ద ట్రబుల్ కేసయి పోయింది నాకు” అంది నిర్మలని చూపించి. “దీనికి క్యూర్ ఏమిటో తెలుసుకుందికి నిడదవోలు వెళ్ళిరావడం తప్పనిసరి నాకు”

భార్య మాటలు ప్రభాకర్కి బోధపడలేదు. నిర్మల తనకి చెప్పినదంతా సీత భర్తకి విడమర్చి చెప్పి “మన నిర్మల పౌరుషవంతురాలు కాదని నేననటంలేదు గాని, ఈ గొడవ ఆ వూళ్లో నలుగురి నోళ్లలో పడకముందు, మనవల్ల పాపావాళ్ళా ట్రబులయినట్టయితే, ఇది కొంప మునిగే వ్యవహారం కానివ్వకూడదని నా అభిప్రాయం అవసరమయితే పాపని బతిమాలి ఈ ఇద్దర్నీ శుభలేఖల్లో ఎక్కించేద్దాం. ఈ విషయంలో మా పెద్దవాళ్ళు మీపెద్దవాళ్ల ప్రమేయం అలావుంచి, వినండి. కారణంగానో, అకారణంగానో ఒక చెడు పేరు వస్తే వాళ్ల కుటుంబాల్లో మగపిల్లాడికయినా ఆడపిల్లకయినా పిల్లల్ని

వ్వటానికి వెనకాస్తారు. నా కూతురు వల్ల పాప కిలాంటి మాట రావటం నాకు చాలా బాధ అనిపిస్తుంది. వెళ్ళిరానా మరి?”

భార్య మనసుని తరచిచూడని అవివేకి కాదు ప్రభాకర్ అతడు తల వూపడం సీత రైలెక్కడం జరిగేయి సీతని చూస్తూనే ఎటోపోయిన ప్రాణం వచ్చినట్టు పిలవుతుంది పాప ఎప్పుడూను. స్నేహితురాలి చేతులూ చెంపలూ తడిమింది ఆప్యాయంగా.

“ఏమిటి విశేషం? తగినంత కారణం లేకుండా ఈ గాలి ఇటు మళ్ళదు ఎప్పుడూను నన్ను చూద్దామనిపించే వచ్చేవా?”

“అబ్బబ్బా! కట్టుకున్న మొగుడి వల్ల కూడా నేనిన్ని దెప్పులు తినను సుమీ! ఏ జన్మలోనో నీ చేత పుస్తెలు కట్టించుకునే వుంటాను రాక్షసుడి లాంటి మొగుడివి అప్పుడు”

ఇద్దరూ ఫకాలుమని నవ్వుకున్నారు. “సరేగాని మీఅమ్మాయి తిన్నగా, చేరిందా?”

చేరిందన్నట్టు సీత తలూపి “అంత ఘాటుగా మాట్లాడుతున్నావేమమ్మా” అంది కూపీ లాగడానికి. అక్కణ్ణుంచీ తన కూతురి మీద నేరాలు చెప్తుకు వస్తుంది. పాప అనుకున్న సీత, పాపేమీ రేత్తక పోవడంతో ఆశ్చర్యపోయింది. ఉండపట్టక సీత అడిగేసింది.


“నిర్మలని నువ్వేదో అన్నావుట ఇంటికొచ్చిందగ్గర్నుంచీ అది ఏడుస్తూనే వుంది. మా పాప నీ మనసు నొచ్చినంత కానిమాట ఏమంటుందే అని నేను మందలించేను కూడా. చెప్పొద్దూ, ఈ పని మీదే నీ దగ్గరికి వచ్చేను. ఇలాంటి విషయాల్లో...” అంటుండగానే “ఆ పోదూ. నీ కూతురిది మరీ బడాయి. అది ఏడవ్వలనంత నేనేమీ అనలేదే.” అని వూరుకుంది పాప.

తరవాత సీత అక్కడున్న ఇరవైనాలుగ్గంటల్లోనూ ఆ ప్రసక్తే తీసుకురావడానికి వీల్లేకపోయింది. ఎప్పటికప్పుడే నేర్పుగా మాట మార్చేసేది పాప. మొత్తం మీద సీత తలలో లేచిన సందేహం సందేహంగానే వుండిపోయింది. పాప చాలా గడుసు దీరిపోయిందనుకుంది తను అనుకున్నంత హంగామా పాప చెయ్యనందుకు సీతకి ఓ వేపు సంతోషం కలిగింది. కూతురి అభిమానపు మనసుని అభినందించకుండా వుండలేకపోయింది మరో నాలుగ్గంటలికి కాకినాడ బయలుదేరుతుండగా పాప ఇంటికి ఒక

(46 వ పేజీ చూడండి)



“ఒళ్ళో పీటలేదు పొమ్మన్నారు!— వాళ్ళకి తెలీకుండా పీట పట్టుకొచ్చేసా!!”


అందరూ తప్పు నాదే అన్నారు
కుటుంబములో అందరూ నా ఉద్యోగము పోవడానికి తప్పు నాదే అన్నారు. కాని అస్తమానమూ ఎంతో అలసటగా యీదురోమని ఉండే నేను మాత్రము ఏమి చేయగలను?
మా లలిత నన్ను హార్లిక్స్ త్రాగమంది. హార్లిక్స్ నాకు పూర్వపు శక్తి ఉత్సాహములను తిరిగి కలిగిస్తుందని అంది
Horlicks
అమె అన్నది నిజమే! హార్లిక్స్ త్రాగిన కొన్ని వారాల్లోనే నా అలసట పోయింది. నా క్రొత్త ఉద్యోగములో ఉత్సాహముతో పనిచేస్తాను!
Horlicks
THE IDEAL FOOD DRINK FOR ALL AGES
పూర్తిగా పోషణలేని కారణముగా నిరుత్సాహముగా ఉంటే డాక్టర్లు హార్లిక్స్‌ను సిఫార్సు చేస్తారు. పూర్తి మీగడ గల పాలు తోడు గోధుమపిండి, మాల్టెడ్ బార్లీల పోషకవంతమైన సారముతో హార్లిక్స్ రుచిగా ఉంటుంది, తప్పకుండా పనిచేస్తుంది!
హార్లిక్స్
అదనపు శక్తిని కలిగించును!
WTHL 3494

వర్ణచిత్రం



చిత్రపు హనుమంతరావ్

"మనసు అద్దం లాంటిదిరా. మనసూ, అద్దమూ ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండాలిరా..."

అయిదేళ్ల క్రితం ఒక సందర్భంలో కృష్ణమూర్తిగారు రంగన్న తాతతో అన్న మాటలవి.

హౌరా మద్రాసు లైను మీద ఉన్న రైల్వేస్టేషను అది. రాత్రివేళ రాను రాను చీకటి మరింత చిక్కనవుతున్నది. ఫస్టు క్లాసు వెయిటింగు రూములో అద్దం ముందు నిలబడ్డ రంగన్న తాతకు ఒకనాడు కృష్ణమూర్తిగారు అన్నమాటలు జ్ఞప్తికి వచ్చినాయి. అద్దం దుమ్ముపట్టి ఉంది. అద్దంలో తన ప్రతిబింబం మసక మసగ్గా కన్పిస్తున్నది 'ఈరేసూ, అప్పలసామీ ఏంచేస్తున్నారు ఎదవలు వచ్చి తొంగుంటరా?...' రంగన్న తాత విసుక్కున్నాడు. దుమ్ము పట్టిన అద్దాన్ని చూసినప్పుడల్లా కృష్ణమూర్తిగారి విగ్రహం వాడికళ్ల ముందు మెదుల్తుంది. జాలీ, దయా, దాక్షిణ్యాలతో కూడిన ఆయన స్వరం విన్పించినట్లవుతుంది. ఆయన మంచితనం గుర్తుకు వస్తుంది.

రంగన్న తాత తడిగుడ్డతో అద్దాన్ని తుడిచాడు. తృప్తిగా తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ కొద్దిక్షణాలు నిలబడిపోయాడు. తలపాగ..ముడతలు పడ్డ నుదురు లోపలకు పోయిన కళ్లు..ముడతలు పడ్డ కనురెప్పలు.. ఎముకలు కన్పిస్తున్న దవడలు తెల్లబడ్డ గెడ్డమూ, మీసాల మధ్య పెదాలు విడినప్పుడు కన్పించే గారకట్టిన పళ్లు ఇత్తడి ఫ్రేము కళ్లజోడు...ఎర్రకోటు. అంత వరకే కన్పిస్తున్నది. 'ఏడనున్నారో దర్మప్రబువులు..' గొణుక్కున్నాడు రంగన్న తాత.

ఆ వెయిటింగు రూములో ఉన్నవి. గది మధ్యలో 'రవుండ్ టేబిల్'...దాని చుట్టూ ఆరు మామూలు పేము కుర్చీలు... గోడ వారగా రెండు పేము పడక కుర్చీలు..గది కొకమూల 'మిర్రర్ టేబిల్' పైనుండి వ్రేళ్లాడుతూ ఒకలైట్, రెండు పంకాలు.. గుమ్మందగ్గర తను కూర్చునే స్టూలు.

రంగన్న తాత 'మిర్రర్ టేబిల్' కూడా తుడిచాడు. ఆ తర్వాత కుర్చీలు..ఆతర్వాత 'రవుండ్ టేబిల్', గచ్చునేల చీపురుతో తుడిచాక తడిగుడ్డ పెట్టి తుడిచాడు. గుమ్మం దగ్గరకు వచ్చి స్టూలు మీద కూర్చుని లోపలకు చూశాడు. నేల తళతళ్లాడుతోంది. అద్దం మెరుస్తోంది. కుర్చీలూ బల్లలూ శుభ్రంగా ఉన్నాయి. తృప్తి

కలిగింది. దృష్టి ప్లాటుఫారం మీదకు వెళ్లింది.

ప్లాటుఫారం మెర్క్యురీ దీపాల వెలుగులో కళకళ్లాడుతోంది. పెళ్లికి వచ్చిన అతిథుల్లా హడావుడిగా తిరుగుతున్నారు జనం. జనసమ్మర్దం రానురాను హెచ్చుతున్నది. ప్రయాణీకుల సామాన్లు ప్లాటుఫారం మీద అక్కడక్కడ చిందర వందరగా పడి ఉన్నాయి దృష్టి కాలేజీ విద్యార్థులపై పడింది నలుగురైదుగురు విద్యార్థులు రంగన్న తాతకు బాగా ముఖపరిచయస్థులు. ఎందువల్లనంటే మెయిలు వచ్చే వేళకు వాళ్లు ప్లాటుఫారం మీద సిద్ధం 'ఏళ పట్టున–బడికి ఎడతారో లేదో? ఈ శ్రద్ధ సదువు మీదుంటే బాగుపడతారు గందా?' అనుకుంటాడు రంగన్న తాత వాళ్లను చూసి వాళ్లు మెయిలు రావడమే తరువాయి ఒకొక్క కంపార్టుమెంటు కిటికీ ల్లోంచి దృష్టిని పోనిచ్చి లోపలున్న మనుషుల్ని చూస్తూ ముందుకు వెడతారు ఎవరైనా అమ్మాయి ఒంటరిగా రైలు ఎక్కినా, దిగినా ఆమె వాళ్ల సహాయం అర్థించకుండానే సామాన్లు మోసేస్తారు ఆమె చిరునవ్వు నవ్వితే కరిగిపోతారు. 'థేంక్సు' అంటే మెలికలు తిరిగిపోతారు 'ఏటో ఆ ఎర్రి ఏసాలు..' అన్పిస్తుంది రంగన్న తాతకు.

'టీ' బండిని చూడ్డంతో 'టీ' తాగాలన్న కోరిక పుట్టింది రంగన్న తాతకు. జేబులో ఉన్న చిల్లర లెక్కపెట్టుకున్నాడు. వందొమ్మిది పైసాలున్నాయి వెళ్లి ఒక బిస్కెట్టు తిని, టీ త్రాగాడు. ఆరు పైసలిచ్చి మూడు చుట్టలు కొన్నాడు. వెయిటింగు రూము దగ్గరకు వచ్చి స్టూలుపై కూర్చుని లోపలకు చూశాడు ఎవ్వరూ లేరు చుట్ట కొసను కొరికి ఉమ్మేస్తూ 'ఇదేటి సెపుమా ఇయ్యాళ మెయిలొచ్చే ఏళవుతున్నా ఎవరూ రానేదు?' అనుకున్నాడు పళ్ల మధ్య చుట్ట కొసనునొక్కిపెట్టి ముట్టించాడు గుప్పు గుప్పున రెండు దమ్ములు లాగి పొగను వదిలాడు 'ఏటో కాని టీ తాగి ఓ సుట్ట ముక్క తగిలిత్తే తేలిగ్గుంటది సొరగంలో ఉన్నట్టన్పిస్తది. ఏటో ఆటి మహిమ కూడు తినకపోయినా పర్లేదుకాని, టీ తాగకపోయినా, సుట్టముక్క కాల్చకపోయినా పిచ్చెత్తినట్లన్పిస్తది.' చంద్రి గుర్తుకు వచ్చింది 'ఏటయ్యా సుట్టముక్క కూతంత తగ్గించవు గంద తెగ దగ్గుతున్నవ్' అనేది జీయితమే కాలిపోనాదిగందే...బతుకే తెల్లారిపోనాదిగందే...ఎవరి కోసం బతకాలే? ...

పాతికేళ్ల యువకుడు లెదరు సూటు కేసు చేతో పట్టుకుని హడావుడిగా వెయిటింగు రూములోకి ప్రవేశించాడు సెంటు వాసన గుప్పుమంది. రంగన్న తాత లేచి నిలబడ్డాడు ఆరడుగుల సన్నని విగ్రహం, చామన ఛాయ కాస్త చిన్నకళ్లు పొడుగైన ముక్కు దొప్ప చెవులు నొక్కుల జుత్తు పక్కపాపిడి తీసి పైకి దువ్వాడు నుదుటి మీద ఒక పాయ జుత్తు పడుతోంది నల్లని టెర్లిన్ పంట్లాం, పొడుగు చేతుల తెల్లని టెర్లిన్ చొక్కా 'టక్' చేసుకున్నాడు చొక్కాచేతులు పైకి రెండు మడతలు మడిచాడు. ఎడంచేతికి రోలెక్సు వాచీ తళతళ్లాడుతున్న నల్లని 'ఎంబాసిడర్' షూ 'డబ్బున్నోళ్ల పిల్లడు' అనుకున్నాడు రంగన్న తాత అతను సూటు కేసు 'రవుండ్ టేబిల్' మీద పెట్టి, పడక కుర్చీలో వెనుకకు జార్లపడి కూర్చున్నాడు కాళ్లు కుర్చీ చేతుల మీద పెట్టుకుని

రంగన్న తాత చుట్ట పారేసి, 'మిర్రర్ టేబిల్' మీద ఉన్న రిజిష్టరు చేత పట్టుకుని అతని వైపు వచ్చాడు కుంటుకుంటూ వస్తున్న రంగన్న తాతను చూసి 'పాపం పూర్ ఫెలో.' అనుకున్నాడతను 'లయ్యేళ మనసే కుంటిదయింది గందా'అనుకున్నాడు రంగన్న తాత అతడి చూపుల్ని గమనించి

"బాబూ తవరిది ఒకటో కలాసు టిక్కెట్టే గదండీ "

"ఏం టిక్కెట్టు చూస్తావా?"

"మాటోరుకి అడిగేను బాబూ తవరి పేరూ, తక్కిన ఇవరాలూ రాయండి "

రంగన్న తాత రిజిష్టరు అతని ముందుంచాడు అతను జేబులు వెతుక్కుంటూంటే పెన్సిలు చేతికిచ్చాడు అతను వివరాలు వ్రాశాడు అతని పేరు ఎ మోహనరావు వెడుతున్నది మద్రాసు టిక్కెట్టు నెంబరు

రంగన్న తాత రిజిష్టరు మూసి, దాన్లో పెన్సిలుంచి 'మిర్రర్ టేబిల్' మీదపెట్టి గుమ్మం దగ్గరకు వెళ్లి స్టూలుపై కూర్చున్నాడు

మోహనరావు లేచి నిలబడి వళ్లు విరుచుకున్నాడు 'హిప్ పాకెట్' గుండీ తీసి లోపల ఉన్న డబ్బు తీసి లెక్కపెట్టాడు అయిదు పచ్చనోట్లు తిరిగి యథాస్థానంలో ఉంచి గుండీ పెట్టాడు. జేబులోంచి పర్సు తీశాడు ఒక అరలో ఉన్న రెండు టిక్కెట్లు తీసి చూసి లోపల పెట్టేశాడు రెండో అరలో ఉన్న డబ్బుతీసి లెక్కపెట్టాడు. ఆరు పది రూపాయల నోట్లు ఒక రెండు రూపాయల నోటు. కొద్దిగా చిల్లర. రెండు రూపాయల నోటు చొక్కా జేబులో పెట్టుకుని, తక్కిన డబ్బంతా పర్సులో పెట్టేసి జేబులో పెట్టుకున్నాడు పర్సు. రంగన్న తాత అతడిని గమనిస్తూనే ఉన్నాడు 'ఏటో ఈ కాలం కుర్రోళ్లు జేబుల్లో డబ్బెట్టుకుని తిరుగుతారు..' ఏదో అందామనుకుని నోరు తెరిచాడు. అదే సమయాన మోహనరావు వాడి వైపు అదోలా చూస్తూ అన్నాడు

"ఏమిటలా చూస్తున్నావ్? "

ఆ మాటలు రంగన్న తాత చెవులకు చేదుగా ధ్వనించాయి అతడి చూపులు దొంగాడి వైపు తోటి మానవుడు చూసే చూపుల్లా ఉన్నాయి. 'దొంగాడిలా అలా చూస్తున్నావేమిటి?..' అంటున్నట్లు అన్పించింది రంగన్న తాతకు. 'సీ పాడులోకం.. తనేదో జాగరత్త సెబుదారనుకుంటే ఎలా సూసేడు? ఏటన్నాడు? తను డబ్బు కోసం ఆసపడే మనిసికాదని తెల్దు ఈ కుర్రోడికి.' అనుకున్నాడు రంగన్న తాత.

రంగన్న తాత కాక మరో ఇద్దరు కాపలాదార్లు ఉన్నారు ఆ వెయిటింగు రూముకి. వాళ్ల పేర్లు వీరేసు, అప్పలస్వామి ఎనిమిదేసి గంటల కొకసారి డ్యూటీ మారుతుంది సర్వసాధారణంగా రంగన్న తాతకు 'నైట్ డ్యూటీ'యే పడుతుంది వీరేసు, అప్పలస్వామి 'డ్యూటీ' పగలే పడేటట్లు చూసుకుంటారు ప్రయాణీకులు 'బక్షీసు' ఇవ్వకపోతే అడిగి మరీ వసూలు చేస్తారు. థర్డుక్లాసు ప్రయాణీకులు 'బక్షీసు' ఇస్తే లోపల ఉండనిస్తారు ధనార్జన కోసం వాళ్లు పడే తాపత్రయం చూస్తే రంగన్న తాతకు నవ్వు వస్తుంది మాట వరుసకి 'ఎంత్రటా డబ్బు కోసం ఆ కక్కూరితి ' అని రంగన్న తాత అంటే 'నీ కేంత్రటా రంగన్న తాతా ఒంటి పచ్చివి అలా ఇలా కుసురా డబ్బు కూడెట్టినా ఎవురు తినాల్రా? ' లంటారు 'ఆళ్ల మాటలు నిజెం డబ్బు తనేం సేసుకుంటాడు? కడుపుకి గడిసెందుకు ఒచ్చే జీతం సాలదూ? ' 'సెందిరి అన్నాయం సేసి ఎళ్లిపోనాది' వాడి హృదయం ఆక్రోసించింది కళ్లల్లో నీళ్లు ఉబికి చెంపల వెంట గెడ్డంలోకి జారినాయి.

మోహనరావు జేబులోంచి సిగరెట్టు కేసు, అగ్గిపెట్టె బయటకు తీశాడు కేసు తెరచి చూస్తే దాన్లో సిగరెట్లు లేవు! రంగన్న తాత వైపు చూస్తూ అన్నాడు.

"ఇదిగో చూడు...ఒకసారిలా వస్తావా?"

రంగన్న తాత ఆలోచనలకు అంతరాయం కలిగింది. కళ్ళు తుడుచుకుని మోహన రావు దగ్గరకు వచ్చాడు. రెండు రూపాయల నోటు వాడి చేతికిస్తూ అన్నాడు

"ఒక 'గోల్డుఫ్లేకు' సిగరెట్టు ప్యాకెట్టు తెచ్చిపెడతావా?."

'తేను' అందామను కుంటూనే యాంత్రి కంగా నోటు అందుకుని బయటకు వెళ్ళాడు రంగన్న తాత

మోహనరావు అద్దం దగ్గరకు వచ్చి ప్రతిబింబాన్ని చూసుకుంటూ నిలబడ్డాడు. ముఖం మీద కాస్త చెమట పట్టి ఉంది వెనుక వరండాలో ఉన్న 'వాష్ బేసిన్' దగ్గరకు వెళ్ళి మొహం కడుక్కుని వచ్చి సూటు కేసులోంచి 'టర్కి' తువ్వాలు తీసి తుడుచు కున్నాడు. పౌడరు కాస్త ముఖానికి రాసు కున్నాడు. సెంటు కాలరుకు మరికాస్త, పులుముకున్నాడు జుత్తు నీటుగా దువ్వు కున్నాడు. సెంటు వాసన గుప్పుమంది తన ప్రతిబింబాన్ని అద్దంలో మరోమారు చూసుకున్నాడు 'మోహనరావ్ చూడ ముచ్చటైన విగ్రహం రానీది' అన్నది, అతడి మనస్సు అద్దాన్ని చూస్తూంటే సుమిత్ర చెక్కిళ్ళు గుర్తుకి వచ్చినాయి చేత్తో అద్దాన్ని తడిమాడు నున్నగా ఉంది. సుమిత్ర చెక్కిళ్ళు ఇంతకన్నా నున్నగా ఉంటాయేమో? సుమిత్రతో పరిచయం ఆరునెలల ప్రాయానిది చాలా సార్లు చెక్కిళ్ళు తాకాలని, ముద్దు పెట్టు కోవాలని ప్రయత్నించినా పడనిచ్చింది కాదు

వర్ణచిత్రం

'పెళ్ళయ్యేక నా సర్వస్వం నీదే మోహన్' అంటుంది సుమిత్ర. ఆరునెలల క్రితం సుమిత్ర దగ్గర నుండి కొన్ని మైళ్ళ దూరంలో ఉన్న తను..సుమిత్రకు కొద్ది అడుగుల దూరంలోకి వచ్చేశాడు!. తను కంగారు పడకూడదు. ఆడదాని మనసు లత లాంటిది సున్నితంగా, సుతారంగా అల్లుకుంటూ రావాలి శాఖలు వేసి అల్లు కుపోయి పువ్వులు పూస్తుంది అప్పుడు దాన్ని విడదియ్య గల శక్తి ఎవ్వరికీ ఉండదు. పర్సు తీసి దాన్లోంచి సుమిత్ర 'బస్టు సైజు' ఫోటో బయటకు తీశాడు. వరీ క్షగా చూస్తూ నిలబడిపోయాడు. పసిడి ఛాయ కోలముఖం. విశాలమైన కళ్ళు. చిన్న నోరు. గులాబీ రేకుల్లా మృదువైన పెదాలు.. ఒత్తయిన తలకట్టు. సన్నని మెడ ఎత్తయిన రొమ్ములు మెడలో ఒంటి పేటగొలుసు .చెవులకు పాతకాలం దుద్దులు. సుమిత్ర మత్తును కలిగించే వస్తువు. చూస్తేనే చాలు మత్తు పుట్టుకొస్తుంది నరాలు బిగుసుకుంటాయి రక్తం వేడె క్కుతుంది మనసు, కళ్ళెంలేని గుర్రంలా పరుగులు పెడుతుంది

మోహనరావు వాచీ వైపు చూసు కున్నాడు. ఇంకా రాలేదేమిటి సుమిత్ర?. వస్తూ ఉంటుంది . ఈపాటికి ఇంటి దగ్గర బయలుదేరే ఉంటుంది ఇంకా చాలా టైముంది. సుమారు అరగంటకుకాని మెయిలు రాదు. ఆతర్వాత పావుగంట సేపు ఆగు తుంది. అంటే సుమిత్ర ముప్పావుగంట లోపుగా వస్తే చాలు. అన్ని సిద్ధంచేసి కూర్చున్నాడు తను. టిక్కెట్లు సిద్ధంగా ఉన్నాయి. తనమొహాన్ని మరోసారి అద్దంలో చూసుకున్నాడు. ఎంతో అందగాడుగా కన్పించాడు తనను చూడగానే సుమిత్రకు మత్తు పుట్టుకురావాలి! 'మోహన్' అంటూ వచ్చి మీద వాలిపోవాలి! అప్పుడు గాఢంగా— సుమిత్రా, తనూ ఏకమయి పోయేంత గాఢంగా కౌగలించుకోవాలి! గాఢంగా ముద్దు పెట్టుకోవాలి! అప్పుడు ప్రప్రథమంగా సుమిత్ర కౌగిలిలో ఉన్న సుఖం అనుభవం లోకి వస్తుంది సుమిత్ర పెదాలు వర్షించే అమృతధార రుచి తెలుస్తుంది

"బాబూ సిగరెట్లు"

మోహనరావు 'ఉలిక్కి'పడి ఫోటో; పర్సులో పెట్టేసి సిగరెట్టు ప్యాకెట్టూ; చిల్లరా అందుకున్నాడు రంగన్న తాత ఆ ఫోటో ఒక అమ్మాయిదని గుర్తించాడు. మోహనరావు సిగరెట్టు ముట్టించుకుని; గుమ్మం దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు రంగన్న తాత ఆ ప్రక్కనే ఉన్న స్టూలుపై కూర్చు న్నాడు

"ఏంటి బాబూ ఎవరైనా రావాలా?"

"అవును అవును మా వాళ్ళు రావాలి"


మోహనరావు తడబడ్డాడు

రంగన్నతాత మోహనరావు వైపు చూస్తూ 'మా వోళ్ళు' అనుకున్నాడు. మావోళ్ళంటే? వెంకన్న గుర్తుకు వచ్చాడు. 'ఏరేయి .ఎంకన్నా నిన్ను నేను సెమించినా దేవుడు సెమించడురా'

మోహనరావుకు రంగన్నతాత తన ప్రక్కన ఉండడం సుతరామూ ఇష్టంలేదు. అందువల్ల జేబులోంచి చిల్లర తీసి 'తల నొప్పిగా ఉంది కాఫీ తెచ్చి పెడతావా?' అన్నాడు రంగన్న తాత చిల్లర పుచ్చుకుని వెళ్ళాడు

మోహనరావు కళ్ళు సుమిత్ర కోసం ఆత్రుతతో వెదుకసాగినాయి ఎందుకు రాలేదో ఇంతవరకూ .నిశ్చయాన్ని , మార్చుకోలేదు కదా లేదు మార్చుకోదు తప్పకుండా వస్తుంది రైలు ఇంకా ఇరవై నిముషాలకు కానీ రాదు

సుమిత్ర లాంటి అమ్మాయిని లొంగ దీసుకోవడం చాలా కష్టమైన పని ధైర్యం, ఓర్పూ అవసరం కంగారు పడితే మొదటికే మోసం వస్తుంది అసలు మేలిమి బంగారం కద..తనను ఒక దారిన పెట్టడానికి నాలుగు



నెలలు పట్టింది సుమిత్ర తండ్రి రిటైరయిన హైస్కూలు టీచరు. ఒక్కగానొక కూతురు సుమిత్ర .బి. ఏ ప్యాసయింది. గరల్సు హైస్కూల్లో టీచరు వయస్సు సుమారు ఇరవై రెండేళ్లు సుమిత్ర తన కళ్లల్లో పడ్డప్పటి నుండే వెంటాడ్డం మానలేదు వల విసరడం తనకు చేత కాదూ? స్కూలు వదిలే వేళకు గేటు దగ్గర కాపలా పొద్దున స్కూలుకు వెళ్లే వేళకు ఇంటి సందు కొసన కాపలా ప్రేమ లేఖలు వ్రాశాడు. అందాన్ని వర్ణించాడు. ప్రేమ ఫలించకపోతే తన జీవితానికి ఇంక మిగిలేది విషాదమేనని కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు మొదట్లో సుమిత్ర తన పట్ల ఎంత ముభావంగా ప్రవర్తించింది ఎంతైనా సుమిత్ర ఆడది కాదూ?. ఆమెది ఆడ మనస్సు కాదూ? మొదట్లో సుమిత్ర కఠినంగా ప్రవర్తించినా ఆమె మనస్సు ఎంత మెత్తనిదో తెలియడానికి రెండు నెలలు పట్టింది

రంగన్నతాత కాఫీ తెచ్చాడు. మోహనరావు గ్లాసు అందుకుని కాఫీ త్రాగుతూ నిలబడ్డాడు. అతడి చూపులు మాత్రం గేటు వైపునే ఉన్నాయి

గతాన్ని నెమరు వేసుకుంటూ స్టూలు మీద కూర్చున్నాడు రంగన్నతాత

సైకిలు రిచ్చాలాగి బతికేవోడు తను సెందిరిని కని తనదారి సూసుకుంది ఇంటేది ఇంటేది కళ్లు మూసిందని ఏడుస్తావుంటే అందరూ ఏటన్నారు? మరో బొట్టిని కట్టబెట్టుకోమని సెప్పలేదూ? తను పెడసెవి నెట్టాడు ఆళ్ల మాటలు సెందిరి తన సొరస్వం దాన్ని సూస్తావుంటే ఇంటేది గుర్తుకొచ్చేది ఏంలోటు సేసాడు? ముద్దుసేసి పెంచనేదూ? అదే తన కళ్లు కప్పి తప్పు సేసింది గంద..

ఎంకన్న రిచ్చాలాగేవోడు ఆడి ఏసాలు తనకు తెలివూ? ఓ రోజు ఏంసేసాడు ఎదవ డబ్బున్నోళ్ల పిల్ల రిచ్చా ఎక్కితే తప్పు దారట్టించి సెయ్యట్టు కోనేదూ? ఆపిల్ల తెగిసిన ఏళ మంచిది కారేదో అటేంప్పు వచ్చింది దేహసుద్ధి సేసారు ఎదవకి బుద్ధొచ్చిందా? కుక్కతోక ఒంకరా లిద్దారంటే సాధ్దమా? తెగతాగి ఎదవ కేక లేస్తూ రెండో ఆట సినెమా ఒదిలేక గుడిసె కొచ్చేవోడు ఆడెలాంటోడో తెలిసినా, ఆడి ఊసు నాకెందుకో అనుకుంటే సివరకు తన గుండెల్లోనే మంటెట్టినాడు గంద

అయిదేళ్ల కితం టేషన్ మేట్టారు

కిట్టమూర్తి గోరు. దర్మ ప్రబువు.వాడుగ్గాతనే తీసుకొచ్చేవోడు టేషన్‌కు. తీసుకెళ్లేవోడు ఇంటికి..కూతంత దూరానికి పావలా డబ్బు లిచ్చేవోరు

ఓ రోజు రాతిరి ఎనకనించొచ్చి రిచ్చాని గుది ంది లారీ. 'అసలు దేవుడున్నాడా?' అన్పిస్తది ఆ డెయివరు తాగి నిసాలో ఉంటే పోలీసోడు ఏటన్నాడు? ఆడ్ని ఎనకేసుకొచ్చాడు తనను తిట్టేడు. రాంగ్ సెయిడున్నాడు 'ఆరను కొడతా వుంటే ఇనిపించ లేదా ఎదవా? సెవుటోడివా?' అన్నాడు. అనడు మరీ డెయివ రిచ్చినట్టు తనూ డబ్బిత్తే తన ఏంపు మాట్లాడేవోడు సీ. ఎదవలోకం. గడ్డి తింటారు గందా మన్సులు కానికోసం. 'డెయివరు ధర్మవా' అని తన కాలు ఇరిగింది తను కుంటోడయినాడు రిచ్చా తొక్కలేడు కూలిపని సేసుకుని బతుకుదారంతే బరువు లెత్తలేడు ముష్టెత్తుకుని బతకాలా? సెందిరి మాటేంటి. దాన్ని ఓ అయ్య సేతులో ఎట్టేంత వరకూ తనకు నిదరట్టదు తన కాలు ఇరిగిందని ఎంత గోలెట్టింది? డెయివర్ని ఎన్ని తిట్టింది? కిట్టమూర్తి గోరి దగ్గరి కెళ్లి మొరెట్టుకుంటే ఈ నౌకరీ ఏయించారు దర్మప్రబువులు ఎప్పుడైనా డబ్బు కోసం ఆస పడ్డాడా మహానుబావుడు ఆయనతో పనిచేసే వోళ్లు ఇళ్లు కట్టనేదూ? డబ్బే ప్రదానం ఆళ్లకు గడ్డి తిన మన్నా తింటారుగందా! సీ సీ

రంగన్నతాత నౌకరీలో చేరినరోజు కృష్ణమూర్తిగారు అన్నారు "ఒరేయి నీ పనల్లా ఈ గది కాపలా కాయడం గది తుడవడం, కుర్చీలూ బల్లలూ తుడవడం" ఆయనకు దృష్టి అద్దంవైపు మళ్లింది దాని దగ్గరకు వెళ్లి అద్దాన్ని వేలితో తుడిచి 'చూశావురా, అద్దం మీద ఎంత దుమ్ముందో మనస్సూ అద్దమూ ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండలిరా.' అన్నారు.

'సరయిన మాటన్నారు అయ్యగోరు' అనుకున్నాడు రంగన్నతాత

మోహనరావు లోపలకు వెళ్లి కుర్చీలో కూర్చున్నాడు. సుమిత్రకు తండ్రంటే తగని భయం. తగని అభిమానం తగని ప్రేమ .కూతురు ఒక్కపావు గంట ఆలస్యంగా ఇంటికి వెడితే కాలుగాలిన పిల్లిలా వరండాలో పచార్లు చేస్తాడు ఆ ముసలాయన. పార్కుకయితే వచ్చేదికాని ఒకటే కంగారు..'నాన్న ఎదురు చూస్తూంటారు

వర్ణచిత్రం

మోహన్. వెళ్లనా?' మరునాడు అనేది 'నాన్నగారు అడిగేరు మోహన్ ఆలశ్యమయిందేమని. స్కూల్లో పని ఉందని చెప్పాను..' మరో రోజు గుడికి వెళ్లినట్లు. మరో రోజు స్నేహితురాలి ఇంటికి వెళ్లినట్లు... అబద్ధాలు చెప్పించేంతగా తను సుమిత్ర చేత ప్రేమించబడ్డాడు!

ఫస్టు బెల్లయ్యింది. మోహనరావుకు ఆందోళన ఆరంభమయ్యింది గుమ్మం దగ్గరకు వెళ్లి నిలబడ్డాడు పావుగంటలో రైలు వచ్చేస్తుంది ఇంతవరకూ సుమిత్ర రాలేదు. ఎందుచేత? అనుమానం పొడసూపింది అంతలోకే ధైర్యాన్ని తెచ్చుకున్నాడు సుమిత్ర నిన్న ఏమంది? 'మోహన్ నిన్ను ప్రేమిస్తున్నాను .నన్ను అన్యాయం చెయ్యవు కదూ? నీతో ఎక్కడకు రమ్మన్నా వస్తాను..' తన మాటను కాదన గల శక్తిని సుమిత్ర కోల్పోయింది భగవంతుడు కూడా సుమిత్ర మనస్సు మార్చలేడు 'సుమిత్రా మద్రాసు వెళదాం ఊరు చూద్దాం తిరుపతి వెళ్లి పెళ్లి చేసుకుందాం' అంటే అరమోడ్పు కన్నులతో తనవైపు చూస్తూ 'నేనెంత అదృష్టవంతురాలిని మోహన్' అన్నది .. తనంటే తెలిగ్గా వచ్చేశాడు కాని సుమిత్ర రావడమంటే మాటలా? ముసలి తండ్రి చూపుల నుంచి దాటుకుని రావాలి చుట్టపక్కల వాళ్లు అనుమాన పడకుండా రావాలి ఆ ముసలాయన మరీనూ సుమిత్రను పడుకోనివ్వడు తను పడుకోడు వరండాలో మంచం వేసుకుని కూతురిని కాపలా కాస్తూ పడుకుంటాడు సుమిత్ర వచ్చే సమయానికి లేచి కూర్చున్నాడేమో? అంతలోకే తన ఆలోచనకు నవ్వుకున్నాడు నిన్న సాయంత్రం తన ప్రోగ్రాము గుర్తు చేసినప్పుడు 'నాన్నకు రాత్రుళ్లు సరీగా నిద్రపట్టదు నేను బయలుదేరే సమయానికి లేచి కూర్చుంటే ఎలా రావడం?' అన్నది సమిత్ర అప్పుడు రెండు 'స్లీపింగ్ టేబ్లెట్లు' కొనిచ్చి పాలల్లో కలిపేసి ఇమ్మని చెప్పాడు 'నాన్నా! నువ్వు మరీ నీరసంగా కన్పిస్తున్నావు కాసిని పాలుతాగు' అంటుంది గ్లాసులో పాలల్లో టేబ్లెట్లు పడేసి కలిపేసి ఇస్తుంది అవి త్రాగి ముసలాయన ఆవలిస్తాడు. కళ్లు మూతలు పడతాయి మత్తుగా నిద్ర పట్టేస్తుంది రేపు బారెడు పొద్దెక్కేక మెలకువ వస్తుంది సుమిత్ర కోసం వెదుకుతాడు. గుండెలు బాదుకుంటాడు. అప్పటికి తనూ సుమిత్రా మద్రాసులో హోటల్లో డబుల్ రూములో..

మోహనరావును చూస్తూంటే రంగన్న తాత కళ్లముందు వెంకన్న విగ్రహమే మెదులుతోంది.

'సెందిరి సుక్కలాగుంటది.' అనుకునే వోరు సుట్టు పక్కలోళ్లు 'నీ బొట్టి కోసం ఎవడోపూజె సేస్తున్నాడు మావా.... అనేది పక్క గుడిసె లచ్చిమి ఆళ్ల మాటలిని సంబరపడే వోడు తను. ఎంకన్న కళ్లు దాని మీద పడానికి కారణం దాని అందమే గంద. మత్తు మందిచ్చినాడా? మాయు సేసినాడా? .కూతంత ఆలిస్సెంగా ఎడితే 'ఏటయ్యా..ఇంత ఆలిస్సెం.' అనే సెందిరి తనతో సెప్పకుండా, సెయ్యకుండా ఎంత పని సేసింది? తన సారస్వమూ అదే ననుకున్నాడే? ముద్దుసేసి పెంచాడే.

ఆ రోజు టేషనుకాడ నుండి ఇంటికెడితే సెందిరి అగుపడలేదు ఎంకన్న మాయువయ్యేడు ఎంత ముద్దు సేసాడు దానికి ఏకట్టమైనా కలుగుతుందని నలుగురూ సెప్పినా మారు మను వాడలేదే. కిట్టమూర్తి గోరితో సెబితే ఆయనేటన్నారు? 'ఆళ్లోత్తే ఇద్దరికీ ముడెట్టెయ్యరా' తన కడుపున సెడపుట్టిందనుకున్నాడు... లెగిసి పోయేకంటే సత్తేమేలనుకున్నాడు. . అయ్యగోరి మాటలిన్నాక కోపం సల్లారినాది. ఇంటిది గుర్తుకొచ్చింది సెందిరి, కోసం ఎదురు సూసేడు.

నాల్నెల్ల తరువాతొచ్చింది. అది సెందిరేనా? ముద్దబంతి పువ్వు నాగుండే సెందిరి ఎలాగయిపోనాది? సుక్కలాగుండే సెందిరి ఎలాగయిపోనాది? ఇయ్యాలో రేపో అన్నాట్టుంది దాన్ని సూస్తావుంటే ఏడుపొగింది కాదు కొట్టనేదు. తిట్టనేదు . 'ఆడేడే?' అంటే తెగేడిసింది గుండె బాదుకుంది 'ఏటోయినాడో తెలియదయ్యా' అంది.

ఓ రోజు కూడుతిని కక్కుకుంటే ఏటో ననుకున్నాడు లచ్చిమి సెప్పింది 'నెల తప్పినాది మావా?' తను సింగమయినాడు సింత బరికుచ్చుకుని తెగబాది టేషనుకు వచ్చినాడు కిట్టమూర్తిగోరు ఏటన్నారు? 'కన్నకూతురిని నువ్వే సెమించకపోతే లోకం సెమిస్తదిరా?' కోపం సల్లారిపోయింది ఆరి మాటలు ఇన్నాక సేతులెలా వచ్చినయి సెందిరిని కొట్టడానికి? తను ఆలోచిస్తా వుంటే అయ్యగోరన్నారు .'మనస్సు అద్దం నాంటిదిరా..ఇరిగితే అతుక్కోదురా..

తను సేసిన తప్పు తెలిసింది..దగాటేల్యేక పరుగు పరుగున గుడిసె కెడితే ఎక్కడ సెందిరి?..సెందిరి పైకప్పుకి ఏల్లాడ.తా ఉంది..సెందిరి నిదరోతున్నాది. సెందిరి మరి లెగదు..సెందిరి మరి లప్పు సెయ్యదు. సెందిరీ నన్ను సెమింసు.. సెందిరీ నన్ను సెమించు .ఏటనుకుని లాభం 'ఈ పూట, కూడు సరిగా తిన్లేదయ్యా మరీ సిక్కు తున్నవయ్యా..కూతంత బేగిరం వలొస్తాం డయ్యా..ఏటయ్యా సుట్టముక్క కొంతంత తగ్గించవు గంద..దగ్గుతున్నవ్.' అనే సెంది రేది?...అయ్యా గోరేటన్నారు? .. 'మనసు అద్దం నాంటిదిరా ' సెందిరి మనసు ఇరిగి పోయింది. తనే ఇరగకొట్టేడు. తన మనసే కుంటిదయినాదా? గుండెలదిరేలా ఏడిస్తే వస్తాదా? ఆ ఎంకన్నగాడి వల్లే గందా ఆడికేం మారాజులా పూలరంగడిలా ఉండుం టడు .దేవుడేడో? పాపీసీరాయుపూ అన్లేదో పెద్దోళ్ళు?.

అయ్యగోరూ ఎల్లిపోనారు ఒదినీ అయి ఎళ్ళి పోయేరోజా తను సంటోడిలా ఏడి సాడు ఎడనున్నారో అయ్యగోరు?

సెకండు బెల్లయ్యింది మోహనరావు ముఖంలో రంగులు క్షణక్షణానికీ మారు తున్నాయి మనస్సు ఆశ, నిరాశల మధ్య వూగిసలాడుతున్నది సుమిత్ర ఇంకా రలేదు హృదయం సుమిత్ర వస్తుందని చెబు తున్నది. టిక్కెట్లు కొన్నాడు మద్రసులో హోటల్లో 'డబుల్' రూము రిజర్వు చెయ్య మని టెలిగ్రాము ఇచ్చాడు సుమిత్రతో స్వర్గంలో విహరించాలని ఎన్నెన్ని కలలు కన్నాడు?..ఛీ .ఛీ ఆడదాన్ని నమ్మమని ఎవరు చెప్పారు? గుమ్మంలోకి వచ్చి నిలబడ్డాడు

ఆకసంలో నల్లని మబ్బులు చేరి ఉం తటా అల్లుకున్నాయి లోకంలో విషాదాన్ని చూసి 'భరించలేక' అన్నట్లు కన్నీటి చుక్కల్ని విడులుస్తున్నాయి . ప్లాటుఫారం పైన ఉన్న రేకులు దభదభమని శబ్దం చేస్తున్నాయి.

'వానొస్తం ఒస్తున్నాది ' గొణుక్కు న్నాడు రంగన్నతాత. మోహనరావుకు ఉన్న కొద్దిపాటి ఆశ సడలింది వెధవ వర్షం సరిగ్గా ఇప్పుడే రావాలా?. రైలు ఏ హడా వుడీ లేకుండా వచ్చి ఆగింది ఒక్కసారి ప్లాటుఫారం మీద రణగొణ ధ్వనులు మిన్ను ముట్టినాయి .చుట్టా బీడీ. సిగరెట్.. పాన్ పాన్ 'కాఫీ. టీ జీడిపప్ దిగేవాళ్లను దిగనివ్వకుండానే రైలు ఎక్కేస్తున్నారు జనం.. ఇవేమీ గమనించే స్థితిలో లేడు మోహనరావు .అతడి కళ్లు వెదుకుతున్న థర్లో సుమిత్ర కోసం. తరచి తరచి రైలు వైపు, గేటు వైపు వెర్రి చూపులు చూడ సాగాడు...

ఒక అమ్మాయి గేటులోంచి ప్లాటుఫారం మీదకు వచ్చింది. మోహనరావు హృద యం ఆనందంతో గెంతులు వేసింది మనస్సు ఆనంద తరంగాలలో తలమునక లవుతున్నది. 'సుమిత్రా డార్లింగ్' అను కున్నాడు పట్టరాని సంతోషంతో. చెయ్యి వూపుతూ నిలబడ్డాడు సుమిత్ర అతడివైపు వడివడిగా అడుగులు వేస్తూ వస్తోంది..


సుమిత్ర దగ్గరకు వచ్చేసింది ఆయాస పడుతోంది రొమ్ము లెగిరెగిరి పడుతున్నాయి కళ్లల్లో గంభీరత కొట్టవచ్చినట్లు కన్పి స్తోంది రంగన్నతాత ఆమెను చూసి తెల్ల బోయాడు పోస్టాఫీసు కాడ పెంకు టింటో ఉండే పంతులమ్మ ఆబాబు దేవుడు అయితేనేం తనలాంటి అయ్య!.

"ఏమిటి సుమిత్రా.. అంత 'డల్'గా ఉన్నావ్? " సమిత్ర మాట్లాడలేదు

రంగన్నతాత ప్లాటుఫారం వైపు చూస్తూ నిలబడ్డాడు మోహనరావు వెయి టింగు రూములోకి నడిచాడు. సుమిత్ర అతడిని అనుసరించింది. ఆమెను గుడ్లప్ప గించి చూస్తూ నిలబడ్డాడు మోహనరావు బట్టలుతడిసి శరీరానికి అతుక్కుపోయాయి. అవయవ సౌష్టవం, శరీరపు వంపులు మరింత స్పష్టంగా కన్పిస్తున్నాయి. నీటి బిందువులు ముంగురులలోంచి చెక్కిళ్ళ మీదకు జారి రొమ్ముల మీద పడు తున్నాయి. ముఖం మంచులో తడిసిన గులాబీ పువ్వులా ఉంది. ఆమెను చూస్తుంటే మోహనరావుకు రక్తం వేడెక్కుతున్నది. అణువణువూ సుమిత్ర పొందు కోసం తహ తహ లాడుతున్నది. కళ్లల్లో కోరికలు పడగలెత్తినాయి. .సుమిత్ర క్షణక్షణానికీ మరింత అందంగా కన్పిస్తున్నది. మోహన రావుకు అమాంతంగా ఆమెను కౌగలించు కుని ముద్దు పెట్టుకోవా లన్పించింది... అంతలోకే తెలివి తెచ్చుకుని, కోరికల్ని చంపు కున్నాడు తన కంగారు పడకూడదు.. కనీసం రైలు ఎక్కేంతవరకూ కంగారు పడకూడదు లేకపోతే మొదటికే మోసం రావచ్చు. తను కట్టుకున్న ఆశాసౌధాలు కుప్పగా కూలిపోవచ్చు కొద్దిక్షణాలు ఓపిక పట్టాలి తప్పదు. .

సుమిత్ర ఒక మధుపాత్ర. ఆ మధువును తృప్తి తీరేంతవరకూ నిషా దిగేంతవరకూ త్రాగుతూనే ఉండాలి

"అమ్మయ్య సుమిత్రా. నువ్వు వచ్చేశావు..



ఎంత సస్పెన్సులో పెట్టావు నన్ను మూడు గంట నుండి నువ్వు వస్తావో లేదోనని ఎంత ఆందోళన పడుతున్నాను.."

"నీతో మాట్లాడాలి మోహన్.."

"మాట్లాడుకోడానికి ఇకముందు నీకు కావాల్సినంత టైము ఉంటుంది.. రైలు ఎక్కాక నీ ఇష్టం నీ 'సూటుకేసు' ఏదీ?... ఆ చీరేమిటి? సర్లే."

"సూటుకేసు తేలేదు మోహన్.. దాని అవసరంలేదు." మోహనరావు నవ్వాడు.

"అవునవును 'సూటుకేసె'ందుకు?.. మద్రాసు వెళ్లాక నీకు కావాల్సినవి కొనుక్కుందువుగాని నీ మోహన్ నువ్వేది కోరితే అదివ్వగలడు సుమిత్రా పద. పద. రైలు కదులుతుంది"

మోహనరావు సూటుకేసు అందుకున్నాడు.

'మనం వెళ్లడంలేదు మోహన్.. నాన్నగారితో చెప్పేశాను మనం ప్రేమించుకున్నామనీ. పెళ్లి చేసుకుందామన్న నిశ్చయానికి వచ్చామనీ"

మోహనరావు సూటుకేసు నేల జారింది.. తడబడ్డాడు.

"ఎందుకు చెప్పావ్ ఎందుకు చెప్పావ్ సుమిత్రా..."

సుమిత్ర కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి... తలదించుకుని కొంగుతో తుడుచుకుంటూ అన్నది

"మోహన్. నాన్నగారి కళ్లు కప్పాలని ప్రయత్నించాను. ఆయన నన్ను ఎంతగా విశ్వసిస్తారో నీకు తెలియదు. కేవలం నా సుఖం కోసం తన సుఖాల్నీ, జీవితాన్ని త్యాగం చేశారు. ఇవాళ సాయంత్రం అన్నారు 'నేను ఎంతకాలమో బతక నన్పిస్తోంది నీ పెళ్లి చేసెయ్యాలని ఉంది నీ మనసులో ఎవరైనా ఉంటే చెప్పమ్మా' అని అప్పుడు ఆయన మంచితనం తెలిసింది .నా తొందర పాటుకు సిగ్గుపడ్డాను"

"........... ."

"మన ప్రేమను గురించి చెప్పినపుడు ఆయన కోపం తెచ్చుకోలేదు 'నీ సుఖమే నాక్కావాలి తల్లీ ఒకరికొకరు ఇష్టమయితే నాకేం కావాలి అతడ్ని తీసుకురా. మాట్లాడతాను.' అన్నారు నాన్నగారి మాటకు తిరుగుండదు మోహన్. ఆయన మన పెళ్లికి ఒప్పుకున్నట్లే.'

మోహనరావు గతుక్కుమన్నాడు. అంత

వర్ణచిత్రం

లోకే దిగజారిన ధైర్యాన్ని తెచ్చి పెట్టుకున్నాడు. సుమిత్ర రైలు ఎక్కేంతవరకూ మంచిగా నడుపుకు రావాలి..ఆ తర్వాత తన ఇష్టం .పెదాలు తడుపుకున్నాడు.

"సుమిత్రా మనం ప్రోగ్రాము వేసుకున్నాం...టిక్కెట్లు కొన్నాను.. మద్రాసులో హోటల్లో గది 'రిజర్వు' చెయ్యమని టెలిగ్రాము ఇచ్చాను. మద్రాసులో నాలుగు రోజులుండి ఊరు చూసి తిరుపతి వెడదాం.. పెళ్లి చేసుకుందాం.: మీ నాన్నగారు ఇష్టపడ్డారంటున్నావు కద.. ఆ బెంగాలేదు మనకు .."

"లేదు మోహన్ నన్ను విశ్వసించి పంపారు. నీతో వచ్చేస్తే ఆయన మనస్సు దెబ్బతింటుంది. అయన తట్టుకోలేరు. పద మోహన్. ."

"సుమిత్రా నన్ను విశ్వసించలేవా?.."

సుమిత్ర తలెత్తి ఆతడి వైపు చూసింది. ఆమె కన్నీటి కళ్లల్లో హాసరేఖ మెదిలింది.

"నువ్వెంత అమాయకుడివి మోహన్ నిన్ను విశ్వసించకపోతే ఇంతగా ప్రేమించగలనా? ఇలా ఒంటరిగా రాగలనా? నేనయితే విశ్వసిస్తాను నిన్ను. నాన్నగారెలా విశ్వసిస్తారు?. "


"అంతేనా సుమిత్రా నువ్వురావా?.."

"పద మోహన్..పెళ్లయ్యేక వెడదాం. నువ్వెక్కడకు రమ్మంటే అక్కడికి వస్తాను" సుమిత్ర ఆర్ద్రతాపూరితమైన స్వరంతో మోహనరావు కళ్లు ఎర్రబడినాయి కనుబొమలు ముడివడినాయి.

"నువ్వు ఇంత నాటక మాడతావని తెలీదు నీ ప్రేమ అనురాగం అంతా నటన "

"లేదు మోహన్..నిన్నెంతగా ప్రేమిస్తున్నానో ఎలా చెప్పను?."

సుమిత్ర వైపు చూశాడు మోహనరావు సుమిత్ర ఒక గులాబీ పువ్వు ఆ పువ్వును ఆఘ్రాణించి నలిపి పారెయ్యాలి శరీరం అనుభవం కోసం తొందరపడుతున్నది .



కళ్లలో కోరికలు బుసలు కొడుతున్నాయి.

అతడి వైపు చూసి బిత్తరపోయింది సుమిత్ర..

'ప్రేమ..పెళ్లి..' కసిగా అంటూ ఆమె చేతులు గట్టిగా పట్టుకుని ముందుకి లాక్కో ప్రయత్నించాడు 'వదులు వదులు' అని వేడుకున్నది సుమిత్ర. అతను వినలేదు సుమిత్ర పెనుగులాడింది. గాజులు బద్దలయి ముక్కలు నేలమీద పడినాయి. అతడికి ఆమె కళ్లల్లో ఆవేదన అర్థంకాదు.. ఆమె మాటలు వినిపించవు.. అతడికి కన్పిస్తున్నదల్లా గులాబీపువ్వు. దాన్ని నలిపి నలిపి పారెయ్యాలన్న కోరిక..

"రక్షించు దేవుడా "

పెనుగులాడి పెనుగులాడి శక్తిని కోల్పోయి లొంగిపోయే ముందు స్త్రీ చేసే ఆక్రందనమది.

రంగన్నతాత వెనుదిరిగి చూశాడు జరుగుతున్న అత్యాచారం అర్థమయ్యింది కుంటు కుంటూ వచ్చి తన బలమైన హస్తాల్తో మోహనరావు మెడ పట్టుకుని ముందుకు లాగేడు.

పులి పంజా నుండి తప్పించుకున్న లేడి పిల్లలా అదిరే గుండెలతో ఒక్కఅంగలో దూరంగా వెళ్లి నిలబడింది రెండు చేతులోటి మొహాన్ని కప్పుకుని ఏడుస్తున్నది సుమిత్ర..

"నువ్వా? .."

"ఆ పిల్ల మీద సెయ్యేసేవంటే జాగరత్త...."

"కుంటి వెధవా. "

మోహనరావు బలాన్నంతనూ కూడ దీసుకుని రంగన్న తాతను ఒక్కనెట్టు నెట్టాడు. రంగన్నతాత తూలి క్రింద పడ్డాడు. కళ్లజోడు దూరంగా గోడ దగ్గర పడింది. మోహనరావు సూటుకేసు పుచ్చుకుని వెళ్లి రైలెక్కాడు.

'ఏరేయి ఎంకన్నా నిన్ను నేను సెమించినా దేవుడు సెమించడురా.' రంగన్నతాత గొణుక్కున్నాడు

లైటు నిశ్చితంగా, నిశ్చలంగా వెలుగుతూనే వుంది . సుమిత్ర ఏడుస్తోంది హృదయ విదారకంగా. మబ్బులు కన్నీరు వర్షిస్తూనే ఉన్నాయి. రైలు కూత వేసింది

అర్థం బద్దలయ్యింది. . ●

వారఫలం

8-7-1966 శుక్రవారం మొదలు
14-7-1966 గురువారం వరకు.

మేషం : వృత్తి వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి. ఈ వారం ఆర్థికంగా బాగానే ఉన్నా యేదో ఒక కారణంవలన మానసికాందోళన కలుగతుంది ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం ప్రారంభంలో సాహసముతో కూడిన వ్యవహారాల్లో జోక్యం చేసికోవడం తగదు. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణించగలదు.

వృషభం : ఈవారం ప్రారంభంలో అన్ని వ్యవహారాలు అనుకూలంగానే ఉంటాయిగాని తరువాత చికాకులు యేర్పడతాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. రాజకీయవ్యవహారల్లో ప్రతిపక్షాలు బలహీనపడతాయి. అవసరానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికివస్తుంది ప్రయాణాలు కొంచెం శ్రమమీద ఫలిస్తాయి.

మిథునం : ఇప్పుడు మీరు జరిపే వ్యవహారాల వల్ల కేవలం తాత్కాలికమైన లాభమే కాకుండా మున్ముందు కూడా తగిన ఉపయోగం ఉంటుంది. భాగస్వాములతో కలిపిచేసే వ్యాపారాల్లో నూతనావకాశాలు లభిస్తాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. ఉద్యోగంలో మిత్రులకుసహాయం చేయగలరు. ఉష్ణ సంబంధమైన అనారోగ్యం చేయువచ్చును.

కర్కాటకం : వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండానే నెరవేరుతాయి కొన్ని వ్యవహారాల్లో అధిక వ్యయం జరగడంవలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు కొంతవరకు లాభించగలవు. కోర్టు వ్యవహారాల్లో కొత్త సమస్యలు తలయెత్తవచ్చును సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది.

సింహం : వృత్తిలో మీఆలోచనలు మీకేకాకుండా మీ మిత్రులకు కూడా లాభదాయకంగా ఉంటాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాల్లో యిదివరకు ఏర్పడిన చికాకులు తొలగిపోతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతిపక్షాలవాదం బలహీన పడగలదు ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు. మిత్రులకు సహాయం చేస్తారు.

కన్య: భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలకంటె మీరు స్వంతంగాచేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది వారం ప్రారంభంలో సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది, కొన్ని వ్యవహారాల్లో మీకంటె పెద్దవారుకూడా మీ సహకారాన్ని కోరవలసివస్తుంది. ప్రయాణాలు ఫలించగలవు.

తుల : భవిష్యత్తులో మీకు ఉపయోగించగల వ్యవహారాల్లో చొరవ చూపించవలసిన సమయం. వ్యాపారంలో ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. ఎవరితోను మాట పట్టింపులకు దిగడం మంచిదికాదు ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు వస్తాయి. వృత్తిలో కొత్తవారి పోటీని ఎదుర్కోవలసి వస్తుంది.

వృశ్చికం : పూర్తిగా నెరవేరేవరకు యే వ్యవహారాన్ని నమ్మడానికి అవకాశంలేదు. వృత్తి రీత్యా చేసే ప్రయాణాలు కొంచెంశ్రమమీద నెరవేరుతాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు కొంతవరకు లాభించగలవు ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మి వ్యవహరించడం తగదు. ఆరోగ్యం బాగా ఉండదు.

ధనుస్సు . వృత్తి వ్యాపారాల్లో ఆదాయంకంటే హెచ్చుపుడి అధికంగా ఉంటుంది. కొన్ని వ్యవహారాల్లో మీరు మొగమాటాలకు లొంగిపోవడంవలన అనవసరమైన శ్రమకు గురి కాగలరు. ప్రయాణాల్లో మీ తాలూకు వస్తువులు పోవచ్చును ఉద్యోగంలో శ్రమమీద అనుకూలత లభిస్తుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.


మకరం : కొన్ని వ్యవహారాల్లో మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. వృత్తిలో సాటివారి పోటీని ఎదుర్కొని అనుకూలతను సాధించగలరు రావలసిన డబ్బుమీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడం తగదు. ప్రయాణాలు ప్రయోజనకరంగా ఉంటాయి. బంధువుల వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు రాణించక పోవచ్చును

కుంభం : ఇప్పుడు మీరుచేసే ప్రయత్నాలు కొన్ని వ్యర్థమైపోయినట్లు కన్పిస్తాయిగాని వాటి ఫలితాన్ని మీరు మున్ముందు తప్పకుండా పొందగలరు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు కొంచెం శ్రమమీద నెరవేరుతాయి. ఉద్యోగంలో మీ పరిస్థితి బాగా ఉంటుంది.

మీనం : మీ స్వంత పనులు సులువుగా నెరవేరతాయిగాని యితరల నిమిత్తం శ్రమ పొందవలసి వస్తుంది వృత్తిలో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందకపోవడంవలన యిబ్బంది కలుగుతుంది. ఉద్యోగంలో మెప్పుకురాని కార్యభారాన్ని వహించవలసి వస్తుంది.

—మహేష్ ●





సీరియల్ :

ఆమ్రపాలి

మూలం. రామచంద్ర ఠాకూర్

అనువాదం ఆకెళ్ల సీతారామం

జరిగిన కథ

ఆమ్రపాలి అందచందాలను గురించి విన్న మగధరాజు బింబిసారుడు ఆమె వెలాగైనా తన దాన్ని చేసుకోవాలనే ఉద్దేశ్యంతో సంజయుడు, మరికొంతమందితో కలసి వైశాలీ నగరంలో పుత్తళికల సూత్రధారుడుగా ప్రవేశిస్తాడు రేవా ఆదేశానుసారం పాలి భవనంలో ప్రవేశిస్తాడు పుత్తళికల సూత్రధారుని వేషంలో ఉన్న బింబిసారుడు. ఆ కర్షకుడగు పుత్తళికల సూత్రధారునిపై పాలి దృష్టిపడుతుంది.

6

సూత్రధారుడు నమస్కరించాడు. అతని వంగడంతో కూడా ఒకవిధమైన మైకం ఉంది. అతని వెనక ఏడుగురు పురుషులున్నారు. వాళ్ళు బొమ్మలాట చూపించడానికి వచ్చారు.

ఈ ఆట రేవా స్వయముగా చూచుటకో లేక పాలికి చూపుటకో అను విషయం వివరూ తెలిసికోలేకపోయారు. రేవా బుద్ధికి ఈ బొమ్మలాటను ఆడించేవారు ఎందుకు తట్టినారో అన్నది కూడా ఎవడూ ఎరగడు. కాని ఈ బొమ్మలాటను రేవా మెచ్చుకున్న దనటానికి మాత్రం సందేహంలేదు.

అవివాహితగా ఉండడంకంటె బోసినోటి వృద్ధుణ్నైనా వివాహమాడడం ఎంతో మంచిది – ఇదే ఆ ఆట సారాంశం. ఈ ఆటను పాలికి చూపాలని రేవా దృఢంగా నిశ్చయించుకొంది. ఆట ప్రారంభమైంది. ప్రేక్షకులు గుమిగూడారు. చతురుడైన సూత్రధారుడు చిన్నదైన పెళ్లికూతురు— వృద్ధుడైన పెళ్లికొడుకునకూ జరిగే సంభాషణల్ని ఎంతో చమత్కారంగా ఎదుట పెడుతున్నాడు. అది చూచిన వాళ్ళు పొట్ట పగిలేలాగ నవ్వుతున్నారు వృద్ధపతి పశు వృత్తి, చిన్ని భార్యను సంతోష పెట్ట డానికి చేసే ప్రయత్నాలన్నా, గౌరవింపని ప్రేక్షకుల్ని అలా చేయవద్దని వ్యంగ్యంగా చెప్తున్నట్టు తెలుస్తోంది.

పాలి దృష్టి సూత్రధారుడివైపుంది సూత్రధారుడి కళ్ళు ఆమె హృదయంలో ఏదో లోతైన రహస్యమయమైన మూలాలను మేల్కొలిపి తమవైపు ఆకర్షించుకుంటు న్నాయి. ఎన్నో ఏండ్లు గడచాక మిక్కిలి దగ్గర బంధువెవరో లభించినట్టు పాలికి అనిపించింది. అయినా, అతనికి చూడాలని కోరికలేనట్టూ పాలికి తోచింది పాలి దృష్టి మాటిమాటికీ ఆవైపు పోతోంది.

నాట్యం ముగిసింది ఈలోపుగా పాలి కోపం అతి కోమలమైన స్థితికి మారి పోయింది నాటక మింతసేపున్నా, ఆ గౌరవ నీయుడైన సూత్రధారుడు పాలివైపు ఒక సారి చూడలేదు. ఆమె మాత్రం మూర్ఖురాలివలె అతణ్ని రెప్పవాల్పకుండా చూస్తోంది. పాలి స్వాభిమానమూ, సౌందర్య మదమూ మళ్ళీ మేలుకున్నాయి.

నాటకం సమాప్తం కాగానే మహానాముడు సూత్రధారుణ్ని పిలిపించి అతనికి బహుమా నం ఇచ్చాడు. ఆనందుడు సూత్రధారుణ్ని కోపంతో చూస్తున్నాడు. తక్కువ కాల మైనా సూత్రధారుడు మహానాముణ్ని, దుఃఖాల నుండి దూరం చేసి హాస్య పుంజా నికి కొనిపోగలిగాడు బహుమానం ఇచ్చే టప్పుడు మహానాముడు సూత్రధారుని వైపు కొంత యోచిస్తూ చూశాడు అతని కళ్ళు కొంచెం ఆకర్షింపబడ్డాయి. కాని సూత్రధారుని ముఖంలోని చిరునవ్వులో కొంచెమైనా మార్పు కలుగలేదు సూత్ర ధారుని వెనక నిలబడిన అతని అనుచరులు అదరిపడ్డారు. నోరు తెరచుకొని వాళ్ళు మహానాముణ్ని చూడసాగారు తాము గుర్తింపబడ్డామేమో అని వారికి సందేహం కలిగింది. మహానాముడు బిగ్గరగా నవ్వాడు. అతని అనుచరులకు భయంతో కూడిన శంక కలిగింది. ప్రాణాలు ఎగిరి నోట్లో వచ్చినట్టు అయింది

'ఇప్పుడే మగధకు పోతే బింబిసారుడు ఇలాగే కన్పిస్తాడు' అని మహానాముడన్నాడు. అనుచరుల కళ్ళు అంధకారపూరితా లయ్యాయి కాని సూత్రధారుని నోట్లో చిరునవ్వు అట్లే వుంది అతడన్నాడు—

'బింబిసారుడే అనుకోండి.'

అనుచరులకు ఎవడో చెంప మీద కొట్టి నట్లయింది వాళ్ళు కర్రబొమ్మల్లాగ నిలబడ్డారు మహానాముడు మళ్ళా పకపక నవ్వాడు

'బింబిసారు డిక్కడా? ఏడు సంవత్సరా లకిపూర్వం నేను బింబిసారుణ్ని చూచాను. అతను గడ్డాలా, మీసాలూ పెంచుకుంటే నీలాగే ఉంటాడు'

ఈ సారి సూత్రధారుడు నవ్వాడు. అతని సహాయక బృందం కూడా పుత్తళికల్లాగ మెల్లగా నవ్వసాగారు వాళ్ల ఆందోళనకు కారణం ఎవరికైనా తెలుసునేమో అన్న భయంచేత వాళ్ళు మరింత బిగ్గరగా నవ్వ సాగారు పాలి నవ్వింది. కాని కేవలం నవ్వు కోసమే ఇప్పటికీ ఆమె స్వాభిమానం మేల్కొనే ఉంది

సూత్రధారుడు మహానాముడికి నమస్క రించాడు ఆనందుని వైపు తిరిగి చేతులు జోడించాడు చివరికి పాలి యెదుటికి వచ్చి వందనం చేశాడు ఏమీ లెక్కచేయనట్లు పాలి కేవలం తల మాత్రం ఆడించింది. సూత్రధారుడు పోతాడని ఆమె నమ్మకం. కాని అతడు పోలేదు. ఉన్న చోటే నిలబడి ఉన్నాడు పాలికి అతని వైపు మళ్ళీ చూడ వలసి వచ్చింది సూత్రధారుని ముఖంలో కొంచెం చిరునవ్వు ఉంది. అకస్మాత్తుగా పాలి దృష్టి అతని చేతి మీద పడింది అతని చేతిలో ఒక చిన్న కర్రబొమ్మ ఉంది ఆ పుత్తళికే ఇప్పుడు నవవధువుగా ఉండి తన వృద్ధ పతిని విసిగించి ప్రేక్షకుల్ని కడుపుబ్బ నవ్వించింది

'నేను నిన్ను మోహించాను నన్ను కైకో' అని ఆపుత్తడి పలికింది అందరూ నవ్వారు పాలి నవ్వింది కాని మరుక్షణం లోనే ఆమె గాంభీర్యాన్నిపూని సూత్రధారుని వైపు చూచింది

'ఒక పరదేశి కానుక' అని సూత్ర ధారుడు సవినయంగా అన్నాడు. రకరకాల స్త్రీపురుషుల స్వరాలను కంఠం నుండి వెలు వరించే ఈ సూత్రధారుని యీ ధ్వని

యున్నింటి కంటే భిన్నంగా ఉంది. ఆ స్వర ములో ఎవ్వరూ ఉపేక్ష చేయజాలని ప్రభా వం ఉంది. పాలి ఒకక్షణం పాటు స్తంభించి పోయింది

'నిత్యమూ ప్రాతఃకాలంలో సూర్యుని ప్రథమ కిరణాలతోపాటు దీని వక్షం విడు తుంది ఇది తనలో ఉన్న గుప్త వస్తువును చూపిస్తుంది కాని ఒకసారి మూసివేసిన తరువాత మర్నాటి సూర్యదర్శనం కానిదే ఇది విడవదు' అని సూత్రధారుడు మౌనం వహించాడు. అతని ముఖంలో మొదటిలాగే చిరునవ్వుంది పాలి పుత్తడిని తీసుకొంది సూత్రధారుడూ అతని అనుచరులూ మళ్లీ నమస్కరించి వెళ్లసాగారు

ఈ విచిత్రమైన సూత్రధారుణ్ని పాలి చూస్తోంది అతని వినయంలో కూడా మైకం ఉంది అతడు వంగుతాడు కాని దానిలో ఆజ్ఞాభావం దాగి ఉంది

'ఇతడెవడై యుంటాడు?' పాలి ఇటూ అటూ చూచింది అప్పటి కందరూ చెదరి పోయూరు ఆమె సూత్రధారుణ్ని తన మన సులోంచి తొలగించడానికి యత్నించింది ఆమె మెల్లగా శయనాగారం వైపు సాగింది

* * *

నగరం విడిచి వృక్షాన్ని చేరిన తరువాత అందరి కంటె సంజయుడు మొదట క్రింద కూర్చున్నాడు బింబిసారు డెంతో సాహ సించాడు ఏమాత్రం సారబడినా, కంగారు పడినా ఈ మాగధీయులందరూ మహానా ముడి మహల్లో నుడిసి యుండే వాళ్లే

ఎంతో కష్టంతో అణచి ఉంచిన వ్యాకు లమూ, భయమూ, అశాంతీ ఒక్కసారి ప్రకటితమయ్యాయి నీతి కుశలుడైన సంజయుడూ, బ్రాహ్మణ మహారాజా బ్రహ్మ దత్తుడూ, రాయిలాగ నీరసుడైన బింబి సారుని అంగరక్షకుడు శబరుడూ వృక్షం క్రింద కూర్చుండి వడక సాగారు బింబిసారు డికి నవ్వు వచ్చింది అందరి కంటె ముంద సంజయుడు మాటలాడ్డానికి సాహసించాడు 'మహారాజా, ఇలా మాట్లాడ్డానికి మీకెలా తట్టింది?' 'పుత్తలికల్ని ఆడించేవాడు ప్రాణాలతో ఉన్న బొమ్మల ముందు తత్తర పడాలా? నెలకు రెండుసార్లు తప్పకుండా బొమ్మలాట ఆడాలని నాయనగారు నాతో అనేవారు దీనివల్ల మనస్సు జాగరూకతనూ ఓర్పునూ కలిగి ఉంటుంది నేడు నాకు ఈ మాటల మీద విశ్వాసం కలిగింది'

బ్రహ్మదత్తుడు ఉల్లాస మనస్కుడై, 'మహారాజా, బీదవారమైన మేము అకార ణంగా చంపబడతాం. మహారాజును చంపిం చితిమనే కళంకం ఏడు తరాల వరకూ ఉంటుందని మీరెరుగుదురా?'

'కాని నీ మొదటి తరాన్ని సృష్టించే వాళ్లు ఇక్కడే ఉండగా నువ్వెందుకు కంగారు పడి ప్రాణం పోగొట్టుకుంటావు?'

'మహారాజా, చంపబడతామని నేను ఊరికే అన్నాను నే నేమీ కంగారు పడడంలేదు' ఇలా అని తత్తరపాటు కనిపించకుండా



ఉండేలాగ అతడు ఇటూ అటూ చూశాడు అతని వెనక లిచ్ఛవీయుడెవడూ రాలేదు కాని అడవిలోని ప్రశాంతిని చూచి అనుభవజ్ఞుడైన బ్రహ్మదత్తుడు నిట్టూర్చి, 'మహా రాజా మనం మగధకు ఎప్పుడు వెడదాం?' అని అడిగాడు

'అంతేనా?' అని బింబిసారుడు నవ్వాడు. అతని హాస్యంలోని అర్థాన్ని గ్రహించి కం గారు పడుతున్నా బ్రహ్మదత్తు డన్నాడు— 'మమ్మల్ని ఒంటరిగా ఉండనీ మహారాజా మేము సంవత్సరమంతా ఇక్కడ ఉంటాం కాని మీతో ఉండడం అంటే ప్రతిదినం రాత్రి చావడం, పగలు బ్రతకడం అన్నమాట. కాబట్టి...' బ్రహ్మదత్తు డింకా చెప్పడానికి ముందే బింబిసారుడు మళ్లీ బిగ్గరగానవ్వాడు. బ్రహ్మదత్తుడు మళ్లీ అన్నాడు 'నిన్న మనం ఆ మోసగాళ్ల వెంట పోకుండా ఉంటే నేటి యీ జంజాటం కొంచెం కూడా వచ్చి యుండేదికాదు'

'ఓరి మూర్ఖుడా, అది దైవేచ్ఛ వాళ్ల గుప్త వచనాల్ని మనం ఆకస్మికంగా విన్నాం అదేమీ సాధారణ విషయంకాదు దానివల్ల మనం ఇక్కడికి సాహసించి రావడంవల్ల చాలావరకు మేలే కలిగింది'

దీనికి ప్రత్యుత్తరంగా బ్రహ్మదత్తుడు వెంటనే లేచి నిలబడాడు చేతులు జోడించి, కంఠంలో ఏదో అడ్డుకున్నట్టుగా కష్టంతో

అన్నాడు 'మీరు ఇప్పుడేం చేయ గోరు తున్నారు? ఇక్కడి నుండి ఎక్కడికి వెళ్ళాలని తలంపు?'

'రేపు ప్రాతఃకాలానికి పూర్వం ఆకదళీ వనం చేరాలి అవునా సంజయా?' అని ఇప్పటివరకూ మౌనంగా కూర్చున్న సంజ యుణ్ని చూచి బింబిసారుడన్నాడు దీనికి జవాబుగా సంజయుడు అతని వైపు రిత్త చూపులతో చూడసాగాడు 'మోసగాళ్ళు ఎక్కడ నుండి తలపడతారో అక్కడి నుండి మొదట మనం ఎదిరించాలి, అవునా?'

'కాని వాళ్ళు సుమారు ఏభై మంది, ఉన్నారు' చూపు మరలకుండానే సంజ యుడన్నాడు

'కృషి గ్రామానికి వెళ్లి ప్రాతఃకాలానికి ముందే మనుష్యుల్ని సహాయార్థం పిలవ లేం ప్రయత్నం చేసి చూద్దామా?' 'వద్దు, వద్దు' అని బింబిసారుడు శాంతంతో అన్నాడు. 'ఆనందుడూ పాలీ ఒంటరిగా రారు'

'మీకు నమ్మకముందా?'

'ఆ'

'కాని సమయం నమ్మతగిందిగా లేదు'

'కంగారు పడకు' అని బింబిసారుడన్నాడు

నిద్ర పోయేటప్పుడు సంజయుడు చెంత ఆగపోతున్న బ్రహ్మదత్తుని చెవిలో మెల్లగా అన్నాడు 'బ్రహ్మదత్తా, ప్రేమించేవాడికి భయాతర్కాల తలంపే ఉండదు. నీవు కంగారు పడితే పో నీ కోసం ఒక సాకు కనుక్కో బడింది'

'మహారాజును విడిచి నే నెన్నడైనా పావని చేసుకున్నానా? నన్ను పంద అనుకుంటు న్నావా? మహాచార్యుడైన వైజకుండక పండి తుని కుమారుణ్ణి నీవు.. నీవు ..'

'అవునవును.' అని సంజయుడు ఆవేశ పూరితుడై లేచే బ్రహ్మదత్తుణ్ణి అడ్డు కున్నాడు. బ్రహ్మదత్తుణ్ణి మళ్లీ నిద్ర పుచ్చడానికి సంజయుడికి ఒక జాముపూర్తిగా పట్టింది. అతడు కూడా నిరంతర శ్రమ వల్ల అలసిపోవడం చేత గాఢనిద్రలో మునిగాడు.

కాని బింబిసారునికి నిద్ర పట్టలేదు అతని ప్రతి రోమం నుండీ 'పాలి', 'పాలి' అనే ఝంకృతి వెలువడుతోంది అతడు పాలి మందిరానికి వెళ్ళాడు. అతడు పాలిని చూశాడు. పాలి అతణ్ణి జయించింది.

చిరకాలం నుండీ పురుషుడికి స్త్రీ హస్తాల్లో ఓడడమే వ్రాయబడి ఉంది. పరాజితుడు కానివాడు పురుషుడైనా కాకుండా ఉంటాడు, లేదా మహాత్ముడైనా అయి ఉంటాడు.

బింబిసారుడు మహాత్ముడు కాడు. ఒకే ఋజుమార్గాన్ని అవలంబించిన బ్రహ్మచారీ కాడు పదహారు కళలతో వికసించి ఉన్న అతని ప్రస్తుత యౌవనం జీవితంలోని పెక్కు సమస్యల్ని చూచి అనుభవాన్ని సంపా దించింది గడచిన అతని జీవితంలోని నిద్రా ణాలై ఉన్న సంఘటన లెన్నో పుత్తళికల రూపంలో అతని మనసు ఎదుటకు వచ్చి నాట్యమాడ సాగాయి సంఘటనలు వరసగా అంతరిక్షం నుండి వెలువడి అతని కళ్ళ ముందుకు వచ్చి మళ్లీ అక్కడే అదృశ్యమవు తున్నాయి గాంధార దేశపు రాజ్యకన్య ఒకతె అతని పొందు దుర్లభం అని తెలిసికొని అతణ్ణి చూడగానే ఆత్మహత్య కావించుకుంది కోసల, అపరాంత దేశాల రాజకన్యలు అతడు లేనిది అన్నపానాలు కొనమని నిశ్చయించి, వివశలై వేంాకర్ని పెళ్ళాడారు పురుషుల్ని మోసపుచ్చడానికి స్త్రీలు చేసే కుతంత్రాన్ని ఒకతె చేసింది మరణ, వశీకరణ మంత్రాలను అనేకసార్లు ప్రయోగించింది అప్సరలు సైతం సిగ్గు పడేటంతటి అందగత్తెల్ని ఆహ్వానించింది అయినా బింబిసారు డింత వరకూ స్వతంత్రంగా ఉండగలిగాడు నిజమే, ఒక్కొక్క సమయంలో ఒక సర్తకో, లేక శ్రీమంతులైన కన్యలో తమ ప్రియుల్ని విడిచి పిచ్చివారి లాగ అతని వెంటబడి క్రీడా స్థలానికి వస్తున్నారు బింబిసారుడు వాళ్లతో ఆనందించడానికి యత్నిస్తాడు. పలుసారులు అతడు పరవశుడూ అవుతాడు. కాని యిది అంతా కొంచెంసేపు మాత్రమే. రాత్రి గడపి పగలు చూడ్డానికి మాత్రమే

బింబిసారుడు రాజా రాజాకు రాణి అవ సరం. కాబట్టి అతనికి వివాహమూ అయింది కాని అతణ్ణి ఎవరూ జయించలేదు

పాలి అతణ్ణి జయించింది ఈ ఓటమి తరవాత అతని జీవితంలో అట్టి పరాజయం ఇంకొకటి సంభవిస్తుందా అన్నదే ప్రశ్న.

రాత్రి ఆఖరు జాము వరకూ అతడు ఎన్నోసార్లు పాలిని చూచినది మొదలు ఆమెకు పుత్తడిని బహూకరించిన సమ యం వరకూ గల ప్రతిక్షణాన్ని స్మరణకు తెచ్చుకున్నాడు పాలి అతని కల్పనాజగత్తులో ప్రవేశింప సాగగానే అతడు ఒక అపూర్వమైన వైకుంఠంలో భ్రమింప సాగాడు. 'ప్రస్ఫుట మైన ఆమె యౌవనం, వక్షం నుండి ఉపవస్త్రం రెండుమూడు సార్లు తొలగడం వల్ల దాన్ని మళ్లీ కప్పుకోడానికి ఉద్య మించినట్లు అగపడే ఆమె చేతులు, ముఖ చాలనం, మత్తుగొన్న వాడి చూపులు, ప్రేమ యొక్క చరమసీమ వరకూ చేర్చగల రస మయ సౌందర్యమూర్తి—ఇవన్నీ అతణ్ణి వివశుణ్ణి చేశాయి రాజా రాజధర్మం మర చాడు బుద్ధినీ, తెలివినీ పోగొట్టుకున్నాడు తెలివిమాలిన తరుణిని వలె సుధీరుని వలె మూర్ఖుడై, పిచ్చివాడై ప్రభాతాన్ని ఎదురు చూస్తూ కూర్చున్నాడు

ప్రభాతమయింది ప్రాతఃకాల మందలి ప్రథమ కిరణాలు పాలి కోమల దేహం మీద పడ్డాయి పాలి మేలుకొంది తన తొలిచూపు పడ్డ వస్తువును ఆమె విస్ఫారిత నేత్రాలతో చూడసాగింది సూర్యకిరణ స్పర్శ చేత పుత్తళిక హృదయం వ్రక్కలయింది పాలి దాని దగ్గరకు వెళ్లింది పుత్తడి హృదయ పటంలో ఒక భూర్జపత్రం మీద ఏదో వ్రాసి ఉన్నట్లు కన్పించింది పాలి దాన్ని మెల్లగా తీసి చదివింది ఆమె కెవ్వుమని అరచి రెం డవ కక్ష్యలోకి పారిపోయింది

ఆమె అకస్మాత్తుగా అరవడంవల్ల అం దరూ అదరిపడ్డారు వస్త్రధారణం చేస్తున్న ఆనందుడు పాలి తన శయన గృహం వైపు పరుగెత్తడం చూశాడు అతడు వెలుపలికి వచ్చాడు పాలి భూర్జ పత్రాన్ని అతనిచే కిచ్చింది ఆనందుడు కూడా దాన్ని పూర్తిగా చదివిన తరవాత అదరిపడి పాలివైపు చూడ సాగాడు భూర్జపత్రంలో ఇలా వ్రాసి ఉంది.

'వెంట మనుష్యుల్ని తీసికొని రా, అభయు డెదుర్కొంటాడు'

పాలీ ఆనందుడూ ఒకరినొకరు చూచు కోసాగారు పాలి సంకేతంతో తల ఊపింది. ఆమె చెప్పేదిది 'అభయుడి దగ్గర జాగ్ర త్తగా మెలగాలి లేకపోతే నీ పాలి దుర్మర ణాన్ని పొందుతుంది' కాని ఆమెకు నచ్చ చెప్పడానికి ఆనందున కవకాశంలేదు కార ణం, అతని ముఖంలో కఠోరమైన కోపపు రేఖలు పెల్లుబికాయి

'నే నిప్పుడే తయారై వస్తాను' అని పాలి అక్కడ నుండి వెళ్లసాగింది. ఆనం దుడు సోదరిని ఆపలేకపోయాడు

* * *

గహనవనాన్ని భేదించి సూర్యరశ్మి వృక్ష కోటరము లందూ, భూమి యందున్న కొండ బిలములందూ దాగుకోడానికి యత్నిస్తున్న

ట్లుంది. గూండ్ల వైపు పోతున్న పక్షి సంతానం కలవరం చేస్తూ ఎగురుతోంది వాని కలరవాన్ని భంగపరుస్తూ ఆనందుని రథం అత్యంత వేగంతో ఎగుడుదిగుడు కల వనంలో పోతూంది గుర్రముల నోటి నురుగు, ఆనందుని ఎర్రపడిన ముఖం, ఎండిన పెదాలు అతడు ఎంత వేగంతో ఎంత సేపటి నుండి ప్రయాణం చేస్తున్నదీ స్పష్టంగా చెప్తున్నాయి

పాలి వెంటే ఉంది రథాన్ని ఇటూ అటూ తిప్పుతున్న ఆనందుణ్ణి ఆమె శాంతంగా చూస్తోంది సోదరుడి వ్యాకులం ఆమె కెప్పుడూ ఆనందకారణం అవుతోంది అట్టి సమయంలో ఆమెకు భయానికి, బదులు వినోదం కలుగుతూంది ముఖాన్ని ఒక ప్రక్కకు తిప్పి, అరచేతిలో గడ్డం ఆనిచి, రెండవ చేతితో బాణం ఎగురవేస్తూ ఆమె గంభీర వదనంతో ఇలా అంది 'సర్వజిత మీద అధికారం సంపాదించడానికి మానవుడెప్పుడూ సిగ్గు పడతాడు'

'ఏమన్నావు?' అని శ్రమచేత ఉద్విగ్నుడైన ఆనందుడు ప్రశ్నించాడు

'ఏమీ లేదు, ఏమీ లేదు' అని పాలి ఎప్పటిలా గాంభీర్యంతో జవాబిచ్చింది కొంత ఆగి అతనికి కోపం తెప్పించడానికి ఆమె మళ్ళీ ఇలా అంది—

'ఆ రైతు చెప్పింది వింటే

'ఏ రైతు?' అని ఆనందుడు కోపంతో అడిగాడు

'నీకు దాహంగా ఉంటె, ఏ పాపం ఎరగని నాపై కోప పడతావెందుకు?' అని ముఖం పిడ్సది చేసి పాలి అంది ఆనందుడు కోపం అణచి, 'నాకు దాహంగా ఉందని ఎవరన్నారు?' అని అడిగాడు 'ఎవరూ కారు' అని పాలి జవాబిచ్చింది పెదవుల పైకి కృత్రిమమైన మందహాసాన్ని తెచ్చుకుని ఆమె అంది 'నీ పెదిమలు శుష్కించినట్లున్నాయి. కొంచెం కంపిస్తున్నాయి కూడా ఇప్పుడు కంపనం లేనట్లు చూపించకు

'కాబట్టి నీకు దాహమైనట్లు నాకు తోచింది. చూడు నాకు దాహం కాలేదు. ప్రొద్దు తప్పి రెండు జాముల వరకూ నడిచితే అంతగా దాహం వెయ్యదు ఎందుకు వేస్తుంది? రెండు జాములకుపూర్వం కన్పించిన రైతు చెప్పిన మార్గంలో పోయి ఉంటే భోజనం చేసి విశ్రాంతి కూడా తీసుకొని ఉండేవి ఇదీ నేనన్నది అయినా నాకు దాహం వెయ్యడంలేదు'

ఇప్పటికీ ఆనందుని కోపం అధికమైంది అతడు నవ్వాడు. నందీ గ్రామం ఇప్పటివరకూ చేరకుండడమే అతని కోపానికి నిజమైన కారణం భిల్లుల గ్రామసీమలో భయంకరమైన పోరాటం సంభవం కాబట్టి నందీగ్రామ పంచాయతీని ఎంత శీఘ్రంగా కలిస్తే అంత లాభం. కాని తొందరపాటు వల్లా, మార్గంలో కలిసిన అభయుడి సారథి చెప్పిన సలహా వల్లా తెలియకుండానే అతడు ఒక గహనవనంలో ప్రవేశించాడు కాబట్టి ఇప్పటివరకూ ముఖ్య మార్గానికి రాలేక పోయాడు ఆలస్యానికి తోడు మరింత ఆలస్యం కొద్దిరోజుల క్రితమే వర్షర్తువు ముగిసింది కాబట్టి ఎన్నో పురాతన మార్గాలతోటీ, పడిన చెట్లతోటీ అడవి కొత్తదానిలా కన్పిస్తోంది. రథం అకస్మాత్తుగా ఒక పుష్కరిణి దగ్గరకు వచ్చింది దాన్ని చూడగానే పాలి రథం నుండి దూకి ఆవైపుకు సాగింది. దప్పిగా ఉన్న ఆనందుడు కూడా వెళ్ళి పుష్కరిణి ఒడ్డున కూర్చున్నాడు

ఇంతలో కొరడా చప్పుడు వినబడింది సోదరీసోదరు లిద్దరూ అదిరిపడి రథం వైపు చూచారు. వాళ్ళు కొంచెం ఆలోచించేలోపలే రథం దూరంగా ఉన్న పొదలలోకి పోయి అదృశ్యమయింది ఎవడో అపరిచితుడు ఆ రథాన్ని వేగంగా తోలుకొని పోతున్నాడు నీళ్ళు త్రాగడం మాని ఆనందుడు ఆ రథ చోదకుడి ముఖం చూడడానికి శీఘ్రంగా దగ్గర ఉన్న గుట్ట ఎక్కసాగాడు కాని దాని శిఖరాన్ని చేరే లోపలే అతడు దొర్లుతూ క్రిందకు వచ్చిపడ్డాడు. పాలి కెవ్వుమంది ఎవడో ఆనందుని తల మీద అత్యంత వేగంతో ఒక బాణం వదలాడు అతడు ఎవడో తెలియ రాలేదు. అతడు తెలివి తప్పడానికి ముందే ఒక పెద్ద చెంపపెట్టును విన్నాడు. రణ వీరుడైన లిచ్ఛవీయుడికి కేక వేయడానికి కూడా అవకాశం లభించలేదు రెప్పపాటు కాలంలో మెరపు మెరసినట్లు పొదల నుండి మనుష్యులు వెలువడ్డారు ఆనందుణ్ణి కలిసికోడానికి అరుస్తూ పరుగెడుతున్న పాలి వైపు వాళ్ళు దుమికారు. కాని వాళ్ళు పాలిని స్పృశించడానికి ముందే మరో రథం అత్యంత వేగంతో పాలి దగ్గర నుండి వెళ్ళింది రథం పోతూండగానే రథచోదకుడు పాలిని రథం పైకిలాగి వేశాడు రథం వెంట కొందరు అశ్వారోహకులు పరుగెడుతూ వచ్చారు పొదలచాటు నుండి వచ్చినవాళ్ళు వాళ్ళ నడ్డగించారు. పాలి విస్మయం చేత మాట ఉడిగి ఉంది ఆమె ఎలాగో మాటలాడడానికి ముందే రథం ముఖ్యమార్గాన్ని విడిచి మలుపు మళ్ళి ఆనందుడు పడ్డ గుట్ట చెంతకు వచ్చి నిలిచింది రథ చోదకుడు గంతువేసి క్రిందికి దిగాడు. గాయపడ్డ ఆనందుణ్ణి మూపున వేసుకొని పరుగెడుతూ రథం మీదికి తెచ్చి రథాన్ని పోనిచ్చాడు. ఇదంతా ఎంతో వేగంగా జరిగిపోయింది. పాలి చకితురాలై చూస్తోంది. శత్రువుల బాణాలు తగలడానికి పూర్వమే రథం దూరంగా పోయింది. పాలి ఇప్పుడు విస్ఫారిత నేత్రాలతో చూస్తోంది. రథ చోదకుడు పుత్తళికల్ని ఆడించే సూత్రధారుడే. శత్రు బాణాలు రథానికి తగిలి క్రింద పడుతున్నాయి సారథి నిర్భయంగా రథాన్ని నడుపుతున్నాడు ఒడిలో నిద్రపోయిన సోదరుడి గాయం చూచి అరవడమూ లేక సారథి పరాక్రమానికి ఆనందించడమూ అని పాలి ఆలోచిస్తూనే ఉంది చాలా చిన్నవిషయం ఇది అయినా, పాలి ఈ అల్పమైన పరాక్రమానికి వశపడింది

మారువేషంలో ఉన్న సంజయ, బ్రహ్మదత్తులు అభయుడి రహస్య పరివారంతో పోరాడుతున్నారు. శత్రువులు అధికంగా ఉన్నారు రథం చాలాదూరం వెళ్ళిందని తలచి సంజయుడు తన సైనికుల్ని దాగుకొండని సంకేతం చేశాడు. అకారణంగా పరాక్రమానికి బలి అయ్యే సమయం కాదది. వాళ్ళు నేర్పుతో కొద్ది క్షణాల్లోనే శత్రు దృష్టిలోంచి అదృశ్యమయ్యారు. అభయుడి మనుష్యులు ఇద్దరిద్దరు చొప్పున జట్లుగా వ్యాపించారు అభయుని యెదుట నిలవడం మృత్యువు కంటె కూడా భయంకరం అని వాళ్ళెరుగుదురు

పాలి రథం పరుగిడుతోంది. ఇంతలో రెండు గుర్రాలు పరుగెడుతూ రథం దగ్గరకు రాసాగాయి బింబిసారుడు దూరం నుండి డెక్కల చప్పుడి విని వెనక్కిచూచి అరచాడు 'పాలీ, గుర్రాల కళ్ళెం పట్టుకో. నేను కొంచెం ఆ అతిథులకు స్వాగతమిస్తాను.'

పాలి కూడా ఆ అశ్వారోహకు లిద్దర్నీ చూస్తోంది ఆమె మందహాసంచేసి, 'చేతి పగ్గం ఇతరుల కివ్వవచ్చునా, పరదేశీ?'' అంది

బింబిసారుడు అదరిపడ్డాడు. ఇట్టి విషమ పరిస్థితిలో ఈ వనిత నిర్భయంగా, నిస్సంకోచంగా ఉండి వ్యంగ్యంగా మాట్లాడుతోంది

ఆనందుడు కళ్ళు తెరచాడు. గాయం తగిలిన ప్రదేశంలో పాలి చక్కగా కట్టు కట్టింది కాబట్టి అతని చేతులు ఖాళీగా ఉన్నాయి అతడు రథం నుండి ధనుర్బాణాలు ఎత్తి బింబిసారుడు ఏదో చెప్పడానికి ముందే దూరాన్ని వచ్చే ఆ అశ్వారోహకు లిద్దరి మీదా బాణాలు వదిలాడు. ఇద్దరూ అరచి భూమి మీద పడిపోయారు.

(సశేషం)

వైజ్ఞానిక గల్పాశాలి - 65

గొడ్డలితో కొట్ట వలసినది - గోటితో మీటడమా?

-డాక్టర్-



వెనకటికి ఒక చెట్టుమీద రెండు కాకులు గూడుకట్టి వసించేవట. చెట్టు మొదటి పుట్టలో పాము ఒకటిచేరి ఆ కాకులు లేనప్పుడు చెట్టుమీదికెక్కి గుడ్లు తినేసేదట దీనివల్ల జరిగే అపాయాన్ని నివారించడానికని చాలా చాలా ఆలోచించి, ఆడకాకి ఉపాయంవిని మగకాకి, రాకుమార్తె ప్రాసాద సమీపహ్రదములో స్నానము చెయ్యడానికి నగల్నితీసి ఒడ్డున పెట్టి నీటిలో దిగబోతూంటే, ఒకముత్యాల హారాన్ని కరుచుకు ఎగిరిపోయి, పరిచారికలకు కనబడేటట్లుగా ఆ హారాన్ని పుట్టలో పడేసిందట. పరిచారికలు పుట్టకి జడిశారూ, సేవకులు గునపాలతో తవ్వి పాము బయటికివస్తే చంపేశారు. పామునినేరుగా హతమార్చలేక ప్రతిలోమ (Indirect) పద్ధతిలో కాకులు దాన్ని రూపుమాపేయి

రాజకీయంగా ఈ పద్ధతిని ఎవరెవరు ఉపయోగించుకున్నారో తెలీదుగాని, శరీరముమీది కంతి (దుర్వ్రణము)ని రూపుమాపడానికి జాన్ హంటరు అనే శరీర ధర్మ (Physiology) శాస్త్రజ్ఞుడు ఉపయోగించాడు.

హంటరు శరీర నిర్మాణశాస్త్రమును (Anatomy) చక్కగా నేర్చుకున్నవాడు. ప్రతీ శస్త్రవైద్యుడికీ శరీరములో ఎక్కడెక్కడ ఏ యే రక్తనాళములూ, కండరములూ, నరాలూ ఉన్నాయో తెలియాలి. శరీరములో కంతిని శస్త్రముచేసి తీసే ముందు ఆ శస్త్రమువల్ల ఏ రక్తనాళాల తెగిపోవాలో వాటి నన్నిటినీ కట్టిబిగిస్తారు. దానికి రెండు వైపులానూ. కంతిని తీసివేసిన తర్వాత పెద్ద రక్తనాళాల్ని ఇటూ అటూ కొసలు చేర్చి కుట్టేస్తారూ చిన్న వాటి పని ఇంకొకవైపున ఉన్నవి నెరవేరుస్తాయి. హంటరు శరీర నిర్మాణానికీ, ఆ యాచోట్లవున్న భాగముల ధర్మానికీ వున్న సంబంధాలు శోధించాడు. ఎముకల పెరుగుదలకూ, దానికి దోహదకారులైన రక్తనాళాల పనికీ అవినాభావ సంబంధము ఎంతవరకూ? అని శోధించాడు. లేడి కొమ్ములు అన్ని శాఖలుగా పెరుగుతాయిగదా ఆ కొమ్ముల శాఖలలో ఒకదానికి రక్తము సప్లైచేసే నాళమును నారితో కట్టిబిగించేస్తే ఆ శాఖ పెరుగుదల ఎలాగవూరుతుందీ? అని శోధించడానికి అలాటి పెద్ద రక్తనాళాన్ని కట్టేశాడు. ఇలాగ అడవి మృగాలమీదా, పిట్టలమీదా, చేపలమీదా, కీటకములమీదా కూడా చేశాడు. అతని ఆశయము 'శరీర నిర్మాణములో మార్పు తెస్తే శరీరవృద్ధిలో ఏమి మార్పులు వస్తాయీ?' అన్నది తెలుసుకోడానికి. లేడి కొమ్ముశాఖకి నెత్తురు సప్లైచేసే పెద్దనాళము కట్టేసిన తరవాత చుట్టుపట్లవున్న చిన్న నాళాలు త్వర త్వరగా పెద్దవై ఆ పెద్దనాళము చేసిన పనిని సాగించాయి! ఎదిగేప్రాణి అవసరాలు తీరడమన్నదే ప్రధానము అన్నమాట; ఏ భాగము ఆ అవసరాన్ని తీర్చడానికి దక్షమూ' అన్నది అంత ప్రధానముకాదు.

ఇది కొత్త సంగతేగాని దీనివల్ల ఏమవుతుందీ అనిపిస్తుంది. హంటరు మేధస్సు ఈ సత్యాన్ని శస్త్ర వైద్యానికి చక్కగా అన్వయించింది ధమనులనే శుద్ధ రక్తనాళములు ఒక్కొక్కప్పుడు వాచి, పెరిగిపోయి, మరణానికి కారణమూ అవుతాయి. ఆరోజులలో ఆ రక్తనాళాన్ని కత్తిరించి పెరిగిన భాగాన్ని కోసి పారెయ్యడమూ ఆ నాళ నష్టమువల్ల రక్త సహాయము లేక కుళ్లిపోతుందేమోనన్న అవయవాన్ని ఖండించేయడమూ చేసేవారు శస్త్ర వైద్యులు రక్తనాళముతో, అందులోనూ ధమని (Artery) తో సంబంధించిన నష్టమిది కనుక రోగి తరచు మరణించడమే ఈ శస్త్రానికి ఫలితమయ్యేది లేడి కొమ్ములతో చేసిన ప్రయోగము నేర్పిన సత్యము ఉపయోగించి,హంటరు ఆ ధమనిని వాపుకి ముందు కట్టేశాడు. అప్పటి శస్త్రవైద్యులకు నమ్మకమేమిటీ ? అలాగ కట్టేస్తే, ఆ వ్రణానికి దిగువనున్న అవయవము ఈ కొంచెపు రక్త సహాయమూ లేక శుష్కించి కుళ్లిపోతుందనీ, సబబేమరీ, నెత్తురు సప్లై తగ్గిపోతే అవయవము కుళ్ళిపోదూ? హంటరు కనుక్కున్న విశేషజ్ఞానము అతని ఉపాయానికి దారి చేసింది. పెద్ద నాళము కట్టేయగానే చుట్టూవున్న చిన్న నాళాలుపెద్దవై వ్రణము దిగువ భాగానికి నెత్తురుసప్లై

చేశాయీ, వ్రణముచుట్టూవుండిన అతిపెరుగుదల శరీరములో క్రమంగా కలసి (Absorb అయి) హరించిపోయింది, వ్రణము మానిపోయింది. శస్త్రముచేసే కష్టమూ, బాధా కత్తి కోతనల్ల ప్రవేశించ వీలైన విషగుణాలూ ఏమీలేవు. ధమనిని కట్టేయడమే చికిత్స. గొడలితో నరుకుతూండే దానిని గోటితో మీటేడు హంటరు.


అయితే దీనికీ మొదట్లో చెప్పినకథకీ పోలికేమిటీ? అంటారు పాఠకులు. ధమనిని కట్టేయడము, కథలో ముత్యాలహారాన్ని పాము పుట్టలో పడెయ్యడము.రణమే పాము రాజ సేవకులు చిన్న ధమనులు. అవి రణాన్ని రూపు మాపడమూ దిగువ అవయానికి సాయపడడమూ చేశాయి

హంటరు శరీర ధర్మ విజ్ఞానముకోసము చేసిన ప్రయోగములు (Experiments) చాలా ఉన్నాయి కోడికాలి అదనపు వేలుని దాని నెత్తిమీది ఎఱ్ఱ శిఖరముతో అంటు కట్టాడు హంటరు. అది మామూలుగా కన్నా త్వరగా ఎదిగింది! ప్రాణుల ఆహారాన్ని మార్చి జీర్ణావయవాలు దానివల్ల ఎలాగ మారేయో గమనించాడు. అతని కొత్త విజ్ఞానము ఉపయుక్తమైన ఒక్క ఉదాహరణము పైన చెప్పినదిట్టిది. ●



"ఇవాళ రామా టాకీస్‌కి డ్యూటీ వేయించుకున్నాం గురూ?"
"ఈరోజు అక్కడ కొత్త పిక్చర్ రిలీజవుతోందోయ్!"

సీరియల్



సూర్యుడు చూస్తూండగానే పైకెగ ప్రాకుతున్నాడు నిరుద్యోగి కాలం మాదిరి పనీపాటా లేనివాళ్లు, పని దొరకని వాళ్లు నిద్ర నుంచి లేచే సమయం అది నిరుద్యోగు లందరూ నిద్రలో వుంటే సమయంలో బెజవాడ మహాపట్నంలో ఒక మారుమూల బజారు.... సమయం తొమ్మిది గంటలు.

పెంకుటింటి రోడ్డు మీది గదిలో చివరిసారిగా టై సర్దుకుంటూ అద్దం ముందు కూర్చుని వున్నాడో చిన్నవాడు. ఉద్యోగాభిలాషి, ఉద్యోగాన్వేషి ప్రస్తుతం నిరుద్యోగి.

చివరిసారిగా వెంకటేశుడి పటం ముందు నుంచుని మొక్కుకున్నాడు. 'ఈ యింటర్వ్యూలో ఉద్యోగంవస్తే నాంయీ 'దేవానందం' క్రాపు నీదే'నని ఎగ్రిమెంటిచ్చాడు. దువ్వే సమయంలోవూడి చొక్కా మీద పడిన రెండుమూడు వెంట్రుకల్ని తీసి అవతల పారేశాడు. గాలికి ఎగిరి అందులో రెండు మళ్లీ వెనక్కే వచ్చాయ్, తిరిగి వచ్చే 'ఎక్సాలెట్ జ్మెంటు'కూపన్ల మాదిరి. ఎగిరి వచ్చి వెంకటేశుడి పటం మీద వ్రాలాయి.

'అయ్యో, అపచారం' అనుకుని మళ్లీ 'సరే, ప్రస్తుతానికి ఆ రెండు వుంచుకో' అనుకుని మళ్లీ దండం పెట్టాడు.

కాఫీ యివాళ గదిలోకే వచ్చింది. దాని వెంట ఎవరో కూడా వున్నారు సరిగ్గా చూశాడు ఉష్మా. కళ్లు నలుపుకుని మళ్లీ చూశాడు. సందేహంలేదు. ఉష్మాయే. మేలిముసుగులో వున్న కొత్త పెళ్లికూతుర్లా వుంది. 'ఏం, గిరాకీ' అనుకున్నాడు మనస్సులో. ఎపుడూ వంట యింట్లోకి వెళ్లందే గాని రాని కాఫీ గదిలోకి వంటరిగా కాకుండా జంటగా వచ్చేసరికి ఆశ్చర్యపోయాడు రెండొందల జీతంతో సర్కారు ఉద్యోగం వచ్చినంత ఆశ్చర్యపడ్డాడు ఆశ్చర్యపడ్డానికి ఆట్టే టైం ఉందో లేదోనని చూశాడు తొమ్మిదిన్నరయింది. ఆటే టైం లేదను కున్నాడు ఆశ్చర్యపడ్డానికి 'రేపు పడ్దాంలే' అనుకున్నాడు

'. ఏం, రేపు కూడా ఏవన్నా ఇంటర్వ్యూ ఉందా' అంది ఉష్మా, యింటర్వ్యూ ఉన్నపుడే నేనొచ్చేది, యీ కాఫీ యిక్కడి కొచ్చేది అనే అర్థంలో.

'లేద'న్నాడు నిరుద్యోగి.

'అయితే నీకు రేపు ఆశ్చర్యపడేందుకు అవకాశంలేదు. ఆ పడేదేదో యివాళే పడు' అంది ఉష్మా.

'యింకో యింటర్వ్యూ వచ్చినపుడు పడ్తా'నని అనేసి తినేశాడు కాఫీ తాగి రోడ్డు మీదకొచ్చాడు టై సర్దుకుంటూ మాంఛి ఠీవిగా నడుస్తున్నాడు.. .

అదే సమయంలో ఆకాశమార్గాన పార్వతీ పరమేశ్వరులు విహారానికి బయల్దేరారు భూలోకాన్ని చూస్తున్న పార్వతికి ఒక గుడి ముందు నుంచుని ఎవరికీ కనిపించకుండా తెలిసీ తెలియకుండా దండం పెట్టే నిరుద్యోగి కనుపించాడు.

'నాథా! ఎవ్వరీ కుర్రవాడు? ఎందుకలా నిలబడీ నిలబడనట్లు నిలబడ్డాడు?' అంది పార్వతి.

'దేవీ! యితడో నిరుద్యోగి. ఉద్యోగార్థమై పోవువేళ దారియందున్న మనవాళ్ల (వాళ్ల దేవుళ్లు) నందరినీ స్మరించుకుంటున్నాడు. బజార్లలో ప్రారంభించేటప్పుడు చేసే పద్ధతి అది రెండు చేతులు మధ్యా జేబుగుడ్డ వుంచి గుండె దాకా చేతులెత్తి రెండుకళ్లూ ఒక సెకను మూస్తాడు అది బహిరంగంగా చేసే ప్రార్థన పెట్టే నమస్కారమూను.. యింట్లో సరిగానే పెడ్తాడు. బయటికి వస్తేనే, యిలాంటి దండాలు.'

'ఏవిటీతని ప్రార్థన, నాథా!'

'పార్వతీ, యితని చరిత్ర విన కుతూహలంబుగా నున్న యట్లున్నది నిజంబున కది యట్లే యుండును యీతడో శాపగ్రస్తుడు. పూర్వకర్మ ఫలంబునను స్వజాతికి సంభవించిన శాపంబు వలననూ యీతడీ అవస్థలో నున్నాడు'

'ఏమా శాపము, పరమేశ్వరా!'

'పార్వతీ! సావధానముగా వినుము'

పరమేశ్వరుడు పార్వతి కెరిగించిన వృత్తాంతము .

'యితడు—నిరుద్యోగ సంస్థ అని ఒకటుంది దాంట్లో సభ్యుడు ఈ సంస్థ శాఖలతోనూ, ఉపశాఖలతోనూ దేశవ్యాప్తంగా పనిచేస్తోంది చదువుకున్న వాళ్లందరూ, చదువులు చాలించగానే ముందుగా ఏ పనిలోనైనా చేరేముందు దీంట్లో తప్పకుండా చేరాలి ఎంతకాలమైనా పట్టింపులేదు. కనీసం కొన్నినెలల పాటైనా సభ్యత్వం పుచ్చుకోవాలి యీ సంస్థలోని వ్యక్తులు వారివారి శక్తియుక్తులను బట్టి త్వరత్వరగా బయటకు పోతూ వుంటారు.

ఈ నిరుద్యోగ సంస్థ పుట్టుపూర్వోత్తరాలు చెబుతాను విను

పూర్వం అంటే ఎపుడో అనుకునేవు. మొన్నిమధ్యే ప్రొద్దున్నే ఉద్యోగంలో కొచ్చిన మన సూర్యుడికి భూలోకం అంతా క్రొత్తగా కన్పించింది ఈ మార్పు అతను కొన్ని రోజాలుగా చూస్తున్నా అవాళ మరీ క్రొత్తగా కన్పించింది అవాళ శలవు పెట్టేసి యీ అరాచకం ఏవిటో తెలుసుకునే రాచకార్యం మీద బయల్దేరి వెళ్లిపోయాడు

భూలోకం అంతా తిరిగి తిరిగి ఒక నిర్ణయాని కొచ్చాడు. 'భూలోకంలో దేవుళ్లకు నా అన్నవాళ్లెవరూ లేరు. ఎవరో కొంతమంది వున్నా వాళ్లు చదువుకున్న తమ కొడుకులను చూసో, కోడళ్లను చూసో దేవుడు పేరెత్తేందుకే భయపడుతున్నారు. యిహ దేవుడికి భూలోకంలో నూకలుండేట్లు లేవు' సూర్యుడికి కోపం వచ్చింది సరాసరి బ్రహ్మలోకానికి వెళ్లిపోయాడు.

బ్రహ్మదేవుడు సరస్వతితో సరాగమాడుతున్నాడు అభ్యంతర మందిరంలో ద్వారం దగ్గరే నిలబడి 'లోపలికి రావచ్చునా'అన్నాడు సూర్యుడు.

'నిరభ్యంతరంగా' అని సమాధానం వచ్చింది. అభ్యంతర మందిరంలోంచి. సూర్యుడు లోపలికి పోతూనే

'భూలోకమంతా తారుమారైపోయింది. మీరేమో మీకు పట్టనట్లు కూర్చున్నారు తెల్లారి లేస్తే వాళ్ల మొఖాలు చూడాలి నేను చస్తున్నాను మధ్య' అని వాపోయాడు.

'అంత ఉపద్రవం ఏవొచ్చింది నాయనా. వివరంగా చెప్పు' అన్నాడు మందహాసం చేస్తూ బ్రహ్మ.

'ఇంకా ఏంరావాలి భూలోకంలో దేవుడంటే భయంభక్తీ పోతున్నాయ్. ప్రతివాడూ చదువుకుంటున్నాడు. వేదాలు కాదు. అవేవో చదువులు దాంతో దేవుణ్ణి విస్మరించి స్మరించడమే మానారు.''

'అయితే భూలోకవాసులు ఆస్తికులు కారా' అన్నాడు బ్రహ్మ విషయం గ్రహించి.

'కానేకాదు బ్రహ్మదేవా!' అన్నాడు.

డబ్బింగు స్పెల్లు మాట వినిపించే సరికి డబ్బింగ్ చిత్రాలు గుర్తొకొచ్చాయ్ బ్రహ్మకి. డబ్బింగ్ చిత్రాలు విశ్వామిత్ర సృష్టి బ్రహ్మ చేసిన ప్రతిసృష్టికి 'ప్రతిసృష్టి' చేస్తానని విశ్వామిత్రుడు ప్రతిజ్ఞ చేశాడు. తెలుసుగా.. అందుకని కాస్త మార్పు చేసి బ్రహ్మ చేసిన పన్లే తనూ చేస్తున్నాడు తోలుబొమ్మలకి నాటకాలు, హరికథలకి బుర్రకథలు సృష్టించాడు. చివరికి బ్రహ్మ 'సినిమాలు' సృష్టిస్తే కొన్నాళ్లేం సృష్టించాలో తెలియక చివరికి 'యిదిగో' అంటూ డబ్బింగు సినిమాలు సృష్టించాడు. 'హరీ, పిడుగా' అనుకున్నాడు బ్రహ్మ 'నీదేం బాగా లేదం'టే అదొచ్చి మళ్లీ తన్నే కొట్టుకునేట్టు 'నీ పిక్చరేగా' అంటాడేమోనని నోరు మూసుక్కూర్చున్నాడు బ్రహ్మ అయినా డబ్బింగ్ చిత్రాలు బ్రహ్మదేవుడి చిత్రాలకి పోటీ వస్తూనే వున్నాయ్ అందుకే పోటీ ప్రొడక్షు మీద వోకన్నుంచే ప్రొడ్యూసర్లా బ్రహ్మదేవుడు డబ్బింగ్‌చిత్రాల మీద ఓ కన్నుంచుతాడు అందుకనే.

నాస్తికులమే' అన్నారు. దీనికేదో మందు త్వరగా కనిపెట్టండి ప్రభూ'

బ్రహ్మ అమాంతం లేచాడు అన్యాయం జరిగిందని ఆగ్రహించే నిరుద్యోగి పోజులో మొదలుపెట్టాడు

'అన్యాయం, అక్రమం. యింత కావరమా యీ నరాధములకు? సరే, యీ నాస్తికత్వానికి కారణం ఈ చదువుకున్న నిర్భాగ్యులేగా. అమ్మాయిల్ని అనుక్షణం జపించే అబ్బాయిలకు, అబ్బాయిల్ని నిరంతరం జపించే అమ్మాయిలకు మన్నిస్మరించడమే భారంగా తోచిందా సరే వీళ్లందరకీ చదువురాకుండా శపిస్తాను. రోగం కుదురుతుంది.'

'అయ్యో, ఆ పని మాత్రం చెయ్యకండి.



'ఆ, సమయానికి గుర్తుచేశావ్. భూలోకంలో డబ్బింగ్ చిత్రాలెట్టా పోతున్నయ్' అనడిగాడు.

'వాటికేం ..బాగానే పోతున్నయ్.... సరే ఆ రామాయణం ఇపుడెందుకు? మన భాగోతం వినండి' అని మళ్లీ కొనసాగించాడు సూర్యుడు.

'ఇందాక మీ రడిగారు చూశారూ! వాళ్లంతా ఆస్తికులు కారా? అని అదే నాకూ అనుమానం వచ్చి పదిమంది నడిగాను. అడిగితే 'ఆ, ఆస్తులన్నీ అమ్మి చదువుకున్నాం. యిక వేం ఆస్తికులం ఏవిటి? అజ్ఞానులతో మరీ కష్టం. ఆ బరీ యీ బరీ యిస్తూంటారు అందుకని అలా శపించకండి' అని ప్రార్థించాడు సూర్యుడు.

బ్రహ్మ శాంతించాడు. 'సరే నీ సలహా ఏవిటి' అన్నాడు, దేనికి అప్లై చెయ్యమంటే దానికి అప్లయి చేస్తాననే నిరుద్యోగిలా సూర్యుడు ఆలోచించాడు అమోఘమైన అయిడియా వచ్చింది వెంటనే చెప్పాడు.

'అయ్యో, యిలా చెయ్యండి వీళ్ల రోగం రక్కున కుదుర్తుంది ... యీ చదువుకునే వాళ్ళకి చదువుకునే రోజుల్లో ప్రేమా

యణం లోపడి, చదువు మానేశాక సంసారంలో పడి మనల్ని మరుస్తున్నారు. అందుకని చదువు అవ్వంగానే సాఫీగా ఉద్యోగానికి లాక్కెళ్లే రోడ్డు మీద మనం ఓ చిన్న గొయ్యి తవ్వుదాం. చిన్నదేం లెండి! ఓ మాదిరి పెద్దదే తవ్వుదాం. ప్రతివాడూ ఎంత పెద్ద అంగవేసినా సరే దాంట్లో పడేట్లు పెద్దదిగానే తవ్వుదాం. ఆ గోతిలో పడి కిందపడి మీదపడి అట్టా బాధపడిన తర్వాత మనం గుర్తుకొస్తాం.. యీ నర జాతికి తెగులుంది. కష్టాలొస్తేగాని దేవుడు గుర్తుకు రాడు అట్లాగని వాళ్లే అంటారు కూడా అందుకని చదువుకున్న ప్రతివాడికీ వర్తించేట్టాక శాపం పారెయ్యండి. పాపం అనుకోకూడదు. చదివిన ప్రతివాడు ఉద్యోగం కోసం బాధ పడేట్టుగా నా కివ్వండొక వరం. అదే వాళ్ల పాలిటి శరం'

బ్రహ్మ చికాకుపడ్డాడు. చికాకు, చెప్పిన సలహా గురించికాదు సలహా నచ్చింది. చెప్పే విధానంలో డబ్బింగుచిత్రాల మాటల ధోరణి కనిపించింది. అందుకే చికాకుతో అన్నాడు 'ఎందుకట్లా డబ్బింగుచిత్రాల్లో మాదిరి ప్రాసకోసం ప్రయాస?...సరే నువ్వు చెప్పినట్లే చేస్తాను, కానీ ఒక అనుమానం . ఈ చదువుకున్న వాళ్లు చాలా తక్కువట కదా వాళ్లని మరామత్తు చేసినంత మాత్రాన మన 'భజన సమాజం' పెరుగుతుందా?'

'తప్పకుండాను. ఎందుకంటె ఈ నిరక్షరాస్యులు వున్నారే వాళ్లు ఏ పనిపాట చేసేప్పుడో ఎప్పుడో ఉసుపోక దేవుడు మీద ఓ పాట పదమో అందుకుంటారు. కానీ యీ చదువుకున్న వాళ్లట్లాకాదు సైకిలు మీద పోతూ కూడా ఏ ప్రేమ గీతమో పాడ్తారు గానీ చచ్చినా 'రామా! కృష్ణా' అనరు గదా......'

బ్రహ్మ ముఖంలో మార్పొచ్చింది సూర్యదేవుడు గ్రహించాడు. తప్పయిందనుకున్నాడు, వెంటనే గిద్దే ప్రయత్నంలో

'యింతటి వారు మిమ్మల్నే స్మరింరుచ యింకా 'కృష్ణారామా' ఏవిటి నా మొహం' అన్నాడు

బ్రహ్మ బ్రహ్మానందించాడు. 'సరే యీ జలం మంత్రించి యిస్తాను. రేపు నువ్వు చాంద్రాయణానికి వెళ్లేటప్పుడు భూమ్మీద చల్లు' అన్నాడు.

'అయితే నాకు శలవిప్పించండి మరి' అన్నాడు సూర్యుడు జలం తీసుకుని లేస్తూ.

నిరుద్యోగ పర్వం

'అక్కర్లేదు యీ పని నువ్వు దేవతల కోసం చేస్తున్నావు కాబట్టి శలవక్కర్లేదు. నువ్వీ పని మీద వున్నన్ని రోజులూ డ్యూటీలో కొచ్చినట్టే లెక్క' అన్నాడు బ్రహ్మ సూర్యుడు వెళ్లిపోయాడు.

..యిదీ కథ దేవుణ్ణిపూజించని పాపానికి వచ్చిన శాపఫలితమే యీ నిరుద్యోగోత్పత్తి. యీ దశలోకి వచ్చేసరికి ప్రతివాడికీ ఎల్లప్పుడూ లేక ఎప్పుడో ఒకప్పుడు దైవభక్తి కలగక మానదు యిందాక వాణ్ణి చూశావుగా రోడ్డు మీద కూడా దండం పెడ్తున్నాడు'

నిరుద్యోగి నిత్యకృత్యం

'ఇక ప్రతిరోజూ యీ నిరుద్యోగి నియమం తప్పకుండా చేసే పనులు చెబుతాను శ్రద్ధగా విను. నియమం తప్పకుండా అంటె టైం ప్రకారం అనుకునేవు. వరసగా ఏ పని తర్వాత ఏది చేస్తాడు అనే అర్థం నియమం తప్పకుండా అంటే. ఒక్కోప్పుడు టైం చాలా వెనకాముందూ అవ్వొచ్చు. అది పట్టింపుకాదు.

సూర్యుడే తమకీ అన్యాయం జరగటానికి కారణం అని తెలుసుకున్నారు కాలక్రమాన. బహుశః నారదుడు చెప్పాడేమో. ప్రతీకారం ఎలా తీర్చుకోవాలా అని ప్రతివిధమూ ఆలోచించారు. పరిపరి విధాల చింతించారు. చివరికో నిశ్చయాని కొచ్చారు. 'మనకి. ఇన్ని రోజులుగా ముఖపరిచయం వున్న వాళ్లకి మిత్రద్రోహం చేశాడు. కాబట్టి వాడి ముఖం మనం చూడకూడదు,' అని తీర్మానించాడు నిరుద్యోగశాఖ నిర్వాహణాధికారి యితగాడికి చాలా ఏళ్లుగా ఉద్యోగం లేదు యింటర్వ్యూల్తో తలనొప్పి పుట్టింది. బొప్పి కట్టిపోయింది చివరికి మొండికెత్తాడు. యిహ యింటర్వ్యూల ప్రశక్తి మానేశాడు ఉద్యోగాన్వేషణ మానేశాడు. అందుకని యితనికి బయటి ప్రపంచంతో పని లేదు. వస్తే గిస్తే సినిమాలకి బయటికొస్తాడు. అది రాత్రి కాబట్టి సూర్యుణ్ణి చూడక్కర్లేదు అందుకే అసలు సూర్యుణ్ణి చూడగూడదన్నాడు.

'మీరంతా దీన్ని ఏకగ్రీవంగా వప్పుకున్నట్లేనా' అన్న నాయకుడి ప్రశ్నకి ఒక గ్రీవం అందరి తరఫునా యిలా విన్నవించుకుంది 'అగ్రజా! మీరు శక్తివంతులు. సర్వావస్థల నిద్రావంతులు. ఉద్యోగరహితులు. ఉద్యోగావసరమున్ననూ దాని అగమనమునకు నిరీక్షించుట మానిన మీకు యీతని ముఖము చూడకుండుట కష్టము కాదేమో కాని మాబోంట్ల కెట్లుసాధ్యంబు? కడు నసాధ్యంబని అర్థము. కావున దీనిని క్షమ్మరింపమని ప్రార్థన ..యీ రోజు నుండి మన మందరమూ సూర్యోదయము చూడకుందుముగాక. .' అలాగే వప్పుకున్నారు.

'సరే. అలాగే కానివ్వండి. నేను మాత్రం సూర్యుడి ముఖం చూడను' అన్నాడు నాయకుడు.

ఆ రోజు నుంచీ వాళ్లంతా సూర్యోదయం చూడనుని వట్టేసుకున్నారు. అందుకని సూర్యుడు బారెడొచ్చాక లేవకుండా బాగా పొద్దెక్కాక లేస్తారు. మిగతావాళ్ల పనిపాట్లు కడ్డు రాకుండా ఒక మూలగా ముసలాళ్ల మంచానికో బారెడు దూరంలో వేస్తారు వీళ్ల మంచాన్ని. వీళ్లెప్పుడో పదికి తక్కువ కాకుండా పదిలంగా లేస్తారు. వేస్తూనే అద్దం ముందు కూర్చుని కాసేపు దువ్వుకుంటారు తలని. బ్రష్ పట్టుకుని వీధిలోకి వెడ్తారు. కాలేజీలకి ఆఫీసులకి పోయే అమ్మాయిలందర్నీ పంపించేస్తూ ముఖం కడుక్కుని కాఫీకి వంటింటికి పోతారు. కాఫీ తాగి స్నానం చేసి టిప్‌టాప్‌గా తయారై పేపరు డబ్బులు ఎందుకైనా వస్తయ్యాని అది కొనకుండా చూసేందుకు లైబ్రరీకి బయల్దేరుతారు. జేబులో వోతెల్ల కాగితం పెన్సిలు వేసుకుని. పేపరు తీసుకోంగానే చెయ్యి రెండో పేజీ తిప్పుతుంది. కళ్లు 'వాంటెడు' కాలమ్సు మీదికి పరుగెత్తుతాయ్. కళ్లు బారెడుచేసి చకోరపక్షిలా రెండో పేజీని ఆపాదమస్తకం చూస్తారు. అంతా అయ్యాక వో కన్ను 'మ్యాట్రిమోనియల్' వైపు కూడా వేస్తారు. ఎవడన్నా పిల్లనిచ్చి కట్నం క్రింద ఉద్యోగం యిప్పిస్తాడేమోనని. వీళ్లకి పాకిస్తాన్ ఎగ్రెషన్ విషయం పట్టదు. యింకేం వార్తలు అక్కర్లేదు. రెండో పేజీ—వాంటెడ్‌కాలం.

వీళ్లు లేచేది పది తర్వాత. లైబ్రరీకి వెళ్లేది పదకొండు తర్వాత కాబట్టి వీరి సహాయార్థం కొన్ని ప్రత్యేక గ్రంథాలయాలు స్థాపింపబడ్డాయి. వీటిల్లో ఉండేవి ఒక యింగ్లీషు పేపరు ఒక తెలుగు పేపరు. చిన్న రూంలో క్రిందపడేసి ఉంటయ్. లైబ్రేరియన్ ఉండడు. అటెండరు ఉండడు. పేపరుబోయ్ రెండు పేపర్లు పడేసి పోతాడు ఎప్పుడూ తెరిచే వుంటుంది. పాత పేపర్లన్నీ మర్రోజుకు మిగిలి కొత్తవాటితో కొట్లాడకుండా ఉంటానికి రక్షించే

నిరుద్యోగపర్వం

వాళ్ళెవరూ లేరు కాబట్టి మేమే పన్జేశాం. పెద్ద పెద్ద పట్టణాల్లో తిరిగే ఆవులకీ గేదెలకీ ఆకులలాటో పాటు కాగితాల్ని, భక్షించే నేర్పు ప్రసాదించాం.

యిలాంటి లైబ్రరీలకు వెళ్లి పన్నెండింటికి కొంపకి చేరుకుంటారు భోంచేసి ఏ పుస్తకమో చదువుతూ పడుకుంటారు. వీళ్ల మంచాలెపుడు ఎత్తరు. మంచం పక్కా అలానే వుంటాయి. యింట్లో వున్న ఎక్కువకాలం నిద్దరోతోనో, నిద్దరోతున్నట్టుగానో గడుపుతారు. నీటిలో వేసిన ఉప్పు రాయిలా రోజులు గడుస్తున్న కొద్దీ నిరుద్యోగికి విలువ తగ్గుతూంటుంది. మాటకీ అంతే మనిషికీ అంతే అందుకనే ఎవరేమనుకున్నా వినిపించుకోకుండా వుండేందుకు నిద్ర పద్ధతి అలవర్చుకుంటారు. దీనినే 'నిదురనీతి' అంటారు ఎవరేమన్నా ఏం పట్టించుకోరు. ముఖం పుస్తకంలోనో, కళ్లు రెప్పల్లోనో దాచుకుంటారు. నిద్దరవ్వంగానే సాయంకాలం తూర్పువేపుకు పోతారు సూర్యుణ్ణి చూడటం సాధ్యమైనంతవరకూ తగ్గిద్దామని.

పూర్వం వీళ్లతో చదువుకున్న వాళ్ళ ఆఫీసుల్నుంచి వస్తూ నవ్వుతారు అది వాళ్ళు విష్ చేస్తున్నవైనా నిరుద్యోగికి చచ్చినంత పనవుతుంది ఏడుస్తూ ఎదురు వవుతాడు. సాధ్యమైనంతవరకూ ఉద్యోగస్తుల నుంచి దూరంగానే వుంటూ వుంటారు. తోటి వాళ్లని ఏ పార్కులోనో కలుసుకుంటాడు అవాళ వచ్చిన 'వాంటెడు కాలమ్సు' గురించి మాట్లాడ్తాడు. పనిలో పనిగా పెరిగిపోతూన్న 'రికమెండేషన్ల' గురించి ఆవేశంగా మాట్లాడి మరీ వస్తాడు. సినిమాలకి ఫస్టు షోలకు కాకుండా సెకండు షోలకి పోతాడు సినిమాలు, హోటళ్ళ యీ విషయాల్లో నిరుద్యోగులకు కొన్ని నీతినియమాలున్నాయ్ అవతలి వాడు హోటలుకు గాని సినిమాకు గానీ వెళ్తున్నట్టు పసిగట్టిన యివతలి వాడు వాణ్ణి విడిచి వెళ్ళిపోవాలనేది వాటిల్లో మొదటి నియమం. యిక రెండోది ఒకవేళ అవతల వాడు యివతలి వాణ్ణి రమ్మంటే 'నీ డబ్బుల్తోనే సుమా' అనే అర్థం యింప్లైడ్‌గా వుందని గుర్తించుకోవాలి అందుకు తయారైతేనే బయల్దేరడం లేకపోతే ఆగిపోవాలి వెంటబడ కూడదు. ఈ రెండూ అతిక్రమించిన వాళ్ళు శిక్షార్హులు.

అలా రాచకార్యాలన్నీ ముగించుకుని రాత్రి పదింటికో ఎనిమిదింటికో యింటికి చేరుకుంటారు. భోజనంచేసి, సినిమా కెళ్లాలని బుద్ధి పుట్టక, బుద్ధి పుట్టి డబ్బు పుట్టక పోతే కళ్ళు మూసుకు పడుకుంటాడు. సినిమా కోరిక బలంగా వున్నపుడు ప్రక్కనున్న బామ్మ నుద్దేశిస్తూ

'బామ్మా, అపుడే పడుకున్నావుటే నిద్ర పట్టిందీ' అంటాడు.

'నిద్రా, నా బొందా అయినా నిద్రకాక నీకూ నాకూ పనే వుందిరా' అంటుంది

యీ ముసలాళ్లతో యిదే చిక్కు వేరే ఉద్దేశ్యం లేకపోయినా ఉన్న మాటని కుండ బద్దలు కొట్టినట్లు చెబుతారు. యివతలి వాడు 'ఏమనుకుంటాడో' అని ఆలోచించరు. ..నిరుద్యోగికి కోపం వస్తుంది. అయినా నిరుత్సాహపడడు. కోపం బయటపెట్టడు. లోపల ఎంత కోపం వున్నా బయట పెట్టడు. అదే నిరుద్యోగి లక్షణం అదే అతనికి రక్ష.

'అది కాదే, నిద్ర రాకపోతే ఏ ఆధ్యాత్మ రామాయణమో పాడరాదూ' అంటాడు కోపాన్ని అణచుకొంటూ


'మా తండ్రే! అట్టా దేవుణ్నన్నా తల్చుకో ఆ శ్రీరాముడు నీకో ఉద్యోగం వేయిస్తాడు తొందరగా'

వీళ్ల దుంపతెగ యీ ముసలాళ్ళతో వచ్చిన చిక్కే యిది ఎక్కడో అక్కడ అంటిస్తూనే వుంటారు ఉద్యోగం అంటూ. ఎట్లాగైతేనేం ఏ పిచ్చిమాటో అని అందుకుంటుంది పాట. నిరుద్యోగి ముందే, జాగ్రత్తపడ్తాడు పాటలో ఒక చరణం అవ్వంగానే

'ఒసే, బామ్మా! యిది విన్నావే సంపూర్ణరామాయణంలో రాముడు విశ్వరూపం చూపిస్తాట్ట' అంటాడు.

'రాముడు విశ్వరూపం ఏమిట్రా .. కురుక్షేత్రంలో కృష్ణుడు చూపిస్తాడుగానీ'

'అదికాదే ఏ దేవుడైనా చూపిస్తాడు విశ్వరూపం. పోనీ యీ సినిమాలో రాముడు చూపిస్తాట్ట: అబ్బ ఏం బాగుంటుందనీ..'



'నిజంగానట్రా...కనీసం అది చూసినా బాగుణ్ను పుణ్యం'

'అదేకాదుటేను ఏడుపు..నీకు చూపిద్దామనేగా.'

'సరే పదరా వెడదాం. ఆ రామయ్య తండ్రి దర్శనం చేసుకుందాం ఈ సంసారాల్లో పడి అసలు భక్తే పోతూంది. ఇవన్నీ వెంట వస్తయ్యా ఏమన్నానా ...'

వేదాంతం మొదలెడ్తోందని తెలుసుకుని, వేళైపోతూందని భయపడి అడ్డుకుంటాడు.

'ఏం లాభం. నా డబ్బుల్తో తీసుకెళ్తావంటే వెధవది ఏ ఉద్యోగం రాదయ్యె' అంటూ బోలెడు విచారిస్తాడు.

'ఒరేయ్, ఆమాత్రం అభిమానం వుంచు. యిప్పుడు గాదు, పెళ్ళాం వచ్చాక కూడా చూపించాలి'

'పెళ్ళాం అయితే మటుకు ఎక్కువేమిటీ నీ కంటే. నువ్వు మూలవిరాట్టువి అందుకేగా నీ మంచం మూలగా నా ప్రక్కగా వేయించాను'

'మా బాబే, పద నిన్నివాళ సినిమాకి తీసుకెడ్తాను' అంటూ వుహూ యిద్దె పోయి హాయం కట్టుకుని చెంగు నడుంకి చుట్టి వత్తుల పెట్టె దగ్గరికి పోతుంది.

నిరుద్యోగి సినిమా చూస్తాడు. నిద్రపోతాడు వచ్చి మర్నాడు మళ్లీ సూర్యుణ్ణి పది బారలు పైకిరానిచ్చి పడకవిమాంచి లేస్తాడు ఈ లోపల మబ్బుపట్టి సూర్యుడు కనుపించకపోయినా లేవడు..'

'పార్వతీ! అదీ కథ. నిరుద్యోగ కథలు యింకా చాలా వున్నయ్ తర్వాత చెప్తాను. యిక వెడదామా' అన్నాడు లేస్తూ శివుడు.

పార్వతి లేవలేదు. కూర్చునే దిగులుగా యిలా అంది, 'స్వామీ! మీరు సర్వరక్షకులు కదా యీ నిరుద్యోగులకు ఒకదారి చూపించరాదా'

'లాభంలేదు, దేవీ! యిపుడు మన చేతుల్లో ఏమీలేదు'

'అంతేనంటారా పోనీ బాధలు తగ్గించేందుకైనా ఉపాయంలేదా'? పరమేశ్వరుడు ఆలోచించాడు

'ఒకే ఒక ఉపాయం వుంది ప్రతి చదువుకున్న నరుడు యీ నిరుద్యోగి కథలు చదివి, పదిమందికి వినిపించిన ఎడల చదివిన వారికి విన్నవారికిని కీడు కొంచెం తగ్గవచ్చును. యిదొక్కటే మార్గం' పార్వతీ పరమేశ్వరులు కైలాసానికి వెళ్ళిపోయారు.

(ఇంకా వుంది)

సమాజంలో గ్రామసేవిక ఎదుర్కొనే సమస్యలు

తలమీద పైట చెంగు కప్పుకొని,, చేతిలో టూర్ డైరీతో ఎండలో ఆమె వచ్చింది ఆమె ముడిచిన గొడుగు లాగా వుంది ఆమె బాహిరంగా కాక ఆంతరంగా జీవిస్తుందనిపించింది దగ్గరుకొచ్చిం తర వాత, వెక్కిలి మీది నీరు తుడుచుకొంది అది చెమటో? కన్నీరో!!

పరిచయం అయ్యాక 'ఎండలో వస్తూ వున్నారు గొడుగు తీసుకుపోవలసింది' అంటే, 'పోయిన్నెలలో పెద్దగాలి తోలి గొడుగు విరిగిపోయింది' అని చెప్పింది ఒక ప్రాణికి, తమ్మాలంగా కొందరికి, గొడుగు కావలసిన కుమారి సుశీలకు గొడుగులేదు!

'నడిచే వస్తున్నారు?'

'తప్పదండి! ఈ 'రూట్'లో బస్ లేదు రైలు అసలే లేదు తప్పనిసరిగా నడిచి పోవాలి నడిచి రావాలి ' ఎనిమిది మైళ్ల దూరం ఉదయం వెళ్ళి, వస్తున్నాను'

ఒకేరోజు పదహారు మైళ్ళు నడవటం— ఈ రోజుల్లో బలవంతులకే కష్టం ఇక ఈమె అబల!

'ఎండదెబ్బ తగిలినట్టుంది నీరసంగా వున్నారు'

'ఎండ నడక చాలా బడలికగా వుం దండి పైగా ఉదయం ఎప్పుడో తిన్న అన్నం ఇంతవరకు ఏమీలేదు పల్లెలో కాఫీ తాగు దామంటే హోటల్ లేదు మంచినీళ్ళు అడి గితే మూతి ముడుచుకొనే ఆడవాళ్ళు 'కాఫీ ఇవ్వటమే?—అన్నం మాట దేవుడెరుగు!'

గ్రామసేవిక, స్త్రీ జనాభ్యుదయంకోసం పనిచేసే ఉద్యోగిని ఆమెకు పది గ్రామాలు వున్నాయి ఒక్కొక్క ఊరికి పన్నెండు, మైళ్ళదాకా దూరం! రైలుగానీ, బస్‌గానీ లేని కాలినడక తప్ప గత్యంతరం లేదు

'అంతదూరం నుంచి పురుగయినా మెద లని ఈ సమయంలో ఒంటరిగా వస్తు న్నారు భయం కలగదూ?'

'ఒంటరిగా రాకపోతే వెంట ఎవరుంటా రండి ఒక్కదాన్నే పోవాలి ఒక్కదాన్నే రావాలి ఎంతదూరం అయినా ఇంతే! ఆ కొండ మలుపు దగ్గర విపరీతంగా భయం వేస్తుంది దేవుడేదిక్కు'. కొండను చూపిస్తూ చెప్పింది. అప్పుడామె ముఖంలో భయం కనిపించింది.

'ఇప్పుడా కొండ మలుపు తిరిగే వస్తున్నాను'

ఆ కొండ ప్రాంతం ఒకప్పుడు దొంగ తనాలకూ, దోపిడీలకూ ఆటపట్టు సుశీల కంటే పూర్వం, ఆ సర్కిల్‌లో వున్న గ్రామ సేవిక, ఆ కొండ దగ్గరే తన శీలం కో ల్పోయి, ఉద్యోగం వదిలిపెట్టి, ఎక్కడికో వెళ్ళిపోయింది " విశాఖపట్టణం పిచ్చాసు పత్రిలో వుందని చెప్పుకొంటుంటారు

'ఇంతదూరం నడచిపోయి, ఇవాళే తిరిగి రాకపోతే, ఆ వూళ్ళోనే ఈ రాత్రికి వుంటే ఏమండి?'

ఆమె బాధగా నిట్టూర్చింది 'మీకు తెలియదండీ! ఉండవచ్చుననే అనిపిస్తుంది, మీకు, ఎక్కడుండాలి? రాత్రికి నిద్రపోవాలి కదా! రాత్రి అంటే నాకు భయం ఏ ఇంట్లో నిద్రపోవటం? రాత్రికి అన్నం, తినాలి కదా? స్నానం తప్పదుగా! దుప్పటి అయినా ఉండాలిగా! ఎవరు చూస్తారు ఇవన్నీ? ఎవరున్నారు నాకు? అమ్మా? నాన్నా?— బంధువులా? మంచిగా మాట్లాడి, మంచి నీళ్ళు అయినా ఇచ్చే మహాత్ములకే కృతజ్ఞ రాలిని అలాంటి కొందరయినా ఉండబట్టే ఆ గ్రామాలలోకి పగలయినా పోగలుగు తున్నాను.'

ఆమె ముఖంలో ఆవేదన, అసహాయత, కనిపించాయి. జాలి వేసింది

రెండు క్షణాలు నిశ్శబ్దంగా నిలిచి,'మా యింటి దగ్గర అమ్మ ఒక్కతే వుంటుంది. వెళదాం రండి' అంటూ ప్రాశ్నికుణ్ణి వెంట తీసుకుపోయింది

ఇల్లు చాలా చిన్నది రెండు గదులు చాలా చిన్నవి వున్నాయి. గాలీ వెలుతురూ సరిగా ఇంట్లోకి రావు. ఇంట్లోంచి ఏ ధ్వనీ బయటికి పోదు ఇంటిముందు పెద్ద గుంట వుంది పట్టణాలలో అంతస్తుల మీద అంతస్తులు పెరిగిపోతుంటే, పల్లెలలో గుంటల్లో గుంటలు పడుతున్నాయి! దేశం ఎటు నడుస్తూ వుందో!!

తల్లికి పరిచయం చేసింది ఆమె వృద్ధురాలు ఏ పనీ చేయలేదు అటూ ఇటూ తిరగటమే కష్టం! కుమారి సుశీలకు తండ్రి లేడు. అక్కాచెల్లెళ్ళు, అన్నా దమ్ములు లేరు. వాళ్లది ఆ ప్రాంతం కాదు. ఉద్యోగ రీత్యా ఆ వూరు వచ్చారు. ఆమె స్కూల్ ఫైనల్ చదువుకొనేటప్పుడు తండ్రి చనిపోయాడు. తల్లి ఏమీ చదువుకోలేదు. కుమారి సుశీల అన్‌ట్రెయిన్‌డ్ టీచర్‌గా కొంతకాలం పనిచేసింది ఎనిమిదేళ్ల నుంచి గ్రామసేవికగా వుంటూ వుంది జీతం వంద రూపాయలు కుటుంబం ఖర్చులు పోను, ఆమె కొద్దిగా మిగుల్చుకొంది

'మీరు పెళ్లెందుకు చేసుకోలేదూ?'

'నన్నడిగి ఏం ప్రయోజనమండీ? పెళ్లి కాని ముప్ఫయి అయిదేళ్ల పురుషుల్ని అడ గండి నన్నెవరు చేసుకొంటారండి? వయస్సా? దాటిపోయింది అందమా? లేదు డబ్బా? శూన్యం కుటుంబమా? గొప్పది కాదు ఇటువంటి నన్ను ఎవరు పెళ్ళాడు తారు? చేస్తున్న ఉద్యోగం ఎక్కువమంది శంకించటానికి వీలున్న ఉద్యోగం! ఎవరైనా పెళ్ళాడి నన్ను భరింపవచ్చు. మా అమ్మ ఎలా? మా అమ్మ లేకుండా నేనెలా వుంటాను?'


కుమారి సుశీల తెలివి కలిగిందే ననిపిం చింది అయినా బాధ కలిగింది ఆమె అటు పక్కకు తిరిగి కళ్ళు ఒత్తుకొని, మామూ లుగా తిరిగి, నవ్వటానికి ప్రయత్నించింది. ప్రాశ్నికుడికి అర్థంలేని జాలి మిగిలింది. స్త్రీ సంక్షేమంలో పనిచేసే స్త్రీకి సంక్షేమం లేదు

'పల్లెల్లో వుండే పామర స్త్రీజనాభ్యు దయం మీ విధికదా? అందుకు మీరేం చేస్తూ వుంటారో చెబుతారా?'

అందుకామె మహిళామండలి, బాలసభ, భజనమండలి, పొగలేని పొయ్యి అంటూ, ప్రారంభించి పెద్ద లిస్టు చెప్పింది

దేశ జనసంఖ్యలో సగంపైగా వున్న, స్త్రీలు, ఒకనాటి కంటే, మరొక నాటికి అన్నిరంగాలలో, అభివృద్ధి చెందాలంటే ఏం చేయాలో, అదంతా ఆమె చెప్పింది. ఆమె చెప్పిందంతా జరిగితే పల్లెలు బాగుపడతాయి. దేశం సుసంపన్నం అవుతుంది

కొన్నివందల మరమేకుల్లో గ్రామ సేవిక ఒకటి ఈ మరమేకులు పటిష్టంగా వుంటే చక్రం తిరుగుతుంది అప్పుడే యంత్రం అంతా పని చేస్తుంది దేశానికి


బలము మరియు శక్తి కోసం!
పాలు
కోకో
మాల్ట్
పంచదార
Cadburys
Bournvita
THE IDEAL FOOD DRINK FOR STRENGTH AND VIGOUR
బోర్న్‌విటా పోషకత్వమునకు సముచితమైనది.
కండరములు మరియు టిష్యూలను బలపరచుటకు ప్రోటీన్‌లు,
బలము మరియు శక్తి కోసం కార్బొహైడ్రేట్‌లు, ఎముకలను
దృఢముగా చేయుటకు ఖనిజ లవణములు మరియు ఆరోగ్యమునకు
అతి ముఖ్యమైన విటమిన్‌లు మీకు లభించును. బోర్న్‌విటా
తయారు చేసుకోవడం సులభం మరియు అది రుచిగా కూడా నుండును!
క్యాడ్‌బరీస్ బోర్న్‌విటా
BENSON

కళ్యాణం కలుగుతుంది. అయినా గ్రామస్థులు ఆ యంత్రాన్ని తిరుగనిస్తారనే నమ్మకం మాత్రం కలగటంలేదు.

కుమారి సుశీల కాఫీ తెచ్చి యిచ్చింది. తనూ తీసుకొంది. ఆమె ప్రాణం కుదుట బడినట్లు అయింది. బియ్యం కడిగి పొయ్యి మీద పెట్టి వచ్చింది పొగవస్తూ వుంది.

'పొగలేని పొయ్యి అన్నారే, మీరే ఆ పొయ్యి పెట్టకపోతే మీ మాట పల్లెలో ఆడవాళ్లు ఎలా వింటారు?'

ఆమె బలహీనంగా నవ్వి, చెప్పింది 'రేకు పొయ్యి మూలంగా ఇళ్లు కాలుతాయనే అభిప్రాయం వల్ల ఇల్లు గలాయన వద్దన్నారు. మట్టిపొయ్యి వేయాలనుకొంటున్నాను తీరికలేదు త్వరలో వేస్తాను. మీకు పొగవల్ల కష్టం కలిగించాను. క్షమించండి'

'ఫరవాలేదండి ఈనాడు పల్లెలు తగాదాలతో నిండి వున్నాయి కదా. స్త్రీలలోనూ తగాదాలుండవచ్చు. అలాంటివాళ్లో, మీ ఉద్యోగం ఎలా చేస్తుంటారు?'

'పురుషుల్లో కంటే స్త్రీలలో ఎక్కువండీ తగాదాలు ఒకావె ఇంటికి వెళితే రెండో ఆమె పలకదు అందరిళ్లకు పోవలసిన అవసరం మా ఉద్యోగానికి వుంది. వాళ్లలో కోపతాపాలు, ఉరుమురిమి, మంగలం మీద పడిందన్నట్టు మా మీదికి మళ్లుతాయి ఎలాగో సర్దుకు పోకతప్పదు

మహిళా మండలికి రమ్మంటే, పని లేకుండా ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పకొంటూ కూర్చుంటారుగాని, రామనీ, నీకు జీతం ఇస్తున్నారు కాబట్టి నువ్వు ఇంటింటికీ తిరుగుతావుగానీ, మాకేం కూలీ ఇస్తున్నారు మేం రావటానికి అంటారనీ. మా దగ్గర పన్నులు వసూలు చేసి, మీకు జీతాలు ఇచ్చి, మమ్మల్ని మురికి బట్టలో, మిమ్మల్ని మడతలు నలగని చీరెలిచ్చి తిప్పుతున్నారనీ, ఇంకా ఎన్నెన్నో అంటారని ఆమె చెప్పింది. ఇంకా మహిళామండలి అధ్యక్ష కార్యదర్శి పదవులకు రెండు ముఠాల నుంచి ఎన్నికయిన ఇద్దరు ఏ విధంగా ఆ మండలి పని చేయకుండా చేశారో స్పష్టంగా చెప్పింది ఏమనాలో తెలియలేదు.

'జనాభా పెరుగుదల దేశానికి ప్రమాదమని మీరు ఒప్పుకొంటా రనుకొంటాను. కుటుంబ నియంత్రణను గూర్చి మీరు ప్రచారం చేస్తారా?'

'చేస్తానండి'.

వనితాలోకం

ఆమె ఏ విధంగా చెప్పేది, ప్రజల్లో ఎటువంటి మార్పు వస్తూ వుందో, వివరించింది. దేశానికి మేలు జరిగే అవకాశం విశద పరచింది. అప్పుడే విచారంతోనూ చెప్పింది. పెళ్లయిన గ్రామసేవికలు కుటుంబ నియంత్రణను గూర్చి చెబితే 'నీ కెంత మంది పిల్లలూ?' అని అడుగుతారు. నలుగురో అయిదుగురో అని చెబితే, 'మరి నువ్వేంది చెప్పేది' అని చులకనగా మాట్లాడుతారు. పెళ్లికాని గ్రామసేవికలు సిగ్గుతో ప్రచారం చేస్తుంటే, పెళ్లి కాందానివి నువ్వేంది చెప్పేది పొమ్మంటారు. పెళ్లి అయిన వాళ్లో కానివాళ్లో చెప్పక, ఇంకే లోకంలోంచి, ఇంకో తరగతి జనం వస్తారో తెలియదు. గ్రామస్థులు తెలివి తక్కువ వాళ్లంకారు. ఈ రకమయిన తెలివి!

ఒకసారి, ఒక గృహిణితో కుటుంబ నియంత్రణ గూర్చి చెబుతూ వుంటే,ఎక్కణ్నుంచో గృహయజమాని వచ్చి, అంతా విని, హేళనగా నవ్వుతూ, తేలికగా మాట్లాడాడట, 'నీకు పెళ్లయితే ఏం చెబుతావు' అంటూ. ఆమె తలొంచుకొని వచ్చిందిట.

'మీకు పెళ్లి కాలేదని ఎవరూ సానుభూతి చూపరా?'

'పాపం' అనేవాళ్ళు. 'కర్మ' అనేవాళ్లు ఒకవిధంగా, జాలి తలచేవాళ్లే! స్త్రీలలో సాధారణంగా ముసలి వాళ్లు ఇలా సానుభూతి చూపుతారు. పెళ్లికాని గ్రామసేవికను గడప ఎక్కనీయని గృహిణులు చాలామందివున్నారు.


ఏంపాపం చేసిందో ఇలా అయింది అంటారు. ఎంత కర్మకాండ వుందో అంటూ అనుమానిస్తారు. స్త్రీలు సాధారణంగా పెళ్లికాని గ్రామసేవిక పట్ల ఆదరణ చూపరు. పైగా అసహ్యించుకొంటారు. మగవాళ్ల పాడు చూపులు, వెకిలి మాటలు మామూలే! సుశీల అన్నింటినీ భరిస్తూ వుంది. ఎవరి కోసం?

'హరిజనాభ్యుదయం చట్టరీత్యా జరిగినా, ఆచరణ రీత్యా అందుబాటులో లేదంటారు. అది నిజమేనాండీ!'

'చాలావరకు నిజమేనండీ. మేం చేయవలసిన పని హృదయపూర్వకంగా చేస్తున్నాము. అయినా అంటరాని తనం పల్లెల్లో పూర్తిగా పోలేదు. కొన్ని పల్లెల్లో అసలే పోలేదనీ చెప్పాలి. అంటరాని తనం హృదయానికి సంబంధించింది. హార్దిక పరిణామం వస్తే తప్ప మరే శాసనాలు పనికిరావు. అంతకంటే ముందు మేం అంటించి వాళ్లమనీ, మమ్మల్ని ఎవరూ తాకరాదనీ, అనుకొనే హరిజనుల అభిప్రాయాలలోనే మార్పు రావాలి' ఆమె చెప్పింది అంతా నిజమేననిపించింది.

మాటల సందర్భంలో సుశీల హరిజన స్త్రీ అని తెలిసింది. ఇప్పుడామె తన కులం ఎక్కడా చెప్పుకోవటంలేదు. చెబితే పల్లెల్లో ఏ పనీ చేయలేననీ, అందువల్లే కులం దాచుకొంటాననీ, చెప్పింది. ఎవరయినా అడిగితే హిందువుననే జవాబు చెబుతుందిట.

కుమారి సుశీల ఇంతకుమునుపు పని చేసిన బ్లాక్‌లో కులం కారణంగా చిక్కులొచ్చాయట, ఆమెను ఎవరూ ఇళ్లలోకి రాని



వనితాలోకం

స్తేవాళ్ళుకాదు ఏం చెప్పినా వినేవాళ్ళు కాదు చెప్పే అవకాశమే ఉండేది కాదుట. ఒక వూళ్ళో చెట్టుక్రింద నిలబడి, అక్కణ్ణుంచే తిరిగి రావలసి వచ్చిందిట హరిజన వాడలో కూడా ఆమెకు కష్టమే ఎదురయిందని చెప్పింది. ఒకసారి ఎండలో నడిచిపోతే మంచినీళ్ళు దొరకలేదట గ్లాసుతో ఎవళ్ళూ నీళ్ళివ్వలేదు దోసిట్లో పోయించుకు తాగటానికి అభిమానం అడ్డువచ్చి, చెరువులో నీళ్ళు తాగిందట ఆమె కళ్ళ నీళ్లతో చెప్పింది ఆమె ఆ బ్లాక్‌లో ఏ పనీ చేయలేకపోయిందిట ఉద్యోగం సరిగా చేయటంలేదని రిపోర్టు! అసమర్ధురాలని, ఆ జిల్లానుంచి, ఈ జిల్లాకి మార్చారు అప్పణ్ణుంచి ఆమె తన కులం చెప్పుకోదు అంతగా తప్పనిసరి అయితే తప్పు కులం. చెబుతుంది. ఇప్పుడు ఉద్యోగం బాగా చేయగలుగుతూ వుంది. ఉద్యోగిని, తన ధర్మం, తను నిర్వర్తించ డానికి, ఇరవయ్యో శతాబ్దంలో, కులం విషయంలో, భారతదేశంలో అబద్ధమాడే దురవస్థ వుంది.

ఆమె చెప్పిన ఒక హృదయవిదారక సంఘటన

బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, జీపులో ప్రక్క గ్రామానికి పోతుంటే, ఆమె బ్రతిమాలి, జీపులో ఎక్కింది జీపు పోతున్న డొంక గతుకులు గతుకులుగా వుంది. రెండెడ్ల బళ్ళు తప్ప, మరేమీ ఆ తోవన రావు, పోవు. ఒకచోట రోడ్డు కడ్డంగా వున్న బురదలో జీపు దిగబడి పోయింది. ఎవరైనా వచ్చిలాగితే తప్ప లక్కణ్ణుంచి జీపు కదలదు

ప్రక్కవూళ్ళో రెండు ముఠాలున్నాయి ఒక ముఠా సమితి ప్రసిడెంటుకు అనుకూలం రెండో ముఠా ప్రతికూలం. అనుకూలపు ముఠాకు ప్రసిడెంటు సిఫార్సుతో బి డి ఓ వ్యవసాయపు లప్పు ఇవ్వవలసి వచ్చింది రెండో ముఠా వాళ్లకు ఇవ్వలేక పోవలసి వచ్చింది

అనుకూలపు ముఠావాళ్ళు వచ్చి, జీపు బురదలోంచి వెలుపలికి లాగితే, ప్రతికూలపు ముఠావాళ్ళు వచ్చి జీపు బురదలోకి మళ్ళీ నెట్టారు. కొట్లాట జరిగింది.

రాత్రంతా జీపు బురదలోనే వుండిపోయింది. జీపులో వాళ్ళు జీపులోనే వుండిపోయారు. కొట్లాటలో తన కెక్కడ దెబ్బలు తగులుతాయోనని ఆమె వణికిపోయింది ఆ రాత్రంతా నిద్ర లేకుండా జీపులో పిచ్చి వూహలతో అల్లాడిపోయింది. గుండెలర చేత బెట్టుకొని కూర్చుంది. ముగిస్తూ చెప్పింది 'ఆ రోజు దేవుడే లేకపోతే నేనేమయి వుండేదాన్ని?'

'మీ ఉద్యోగంలో కష్టమెక్కువా, సుఖమెక్కువా?'

'భర్త వున్న, వయసు దాటిన స్త్రీకి ఈ ఉద్యోగంలో కష్టం తక్కువ. భర్త వున్నా, యౌవనవతికి కష్టమే! పెళ్ళికాని స్త్రీకి, యౌవనవతికి, కష్టం ఎక్కువే. పెళ్ళికాక, యౌవనం వుండి, హరిజన స్త్రీ అయితే నరకమే!'

ఆమె ప్రాశ్నికుడి కళ్ళలోకి చూస్తూ చెప్పింది కళ్ళు కిటికీలలోంచి గుండెల్లోకి చూస్తూ వుందేమో ననిపించింది. ఆమెకు సంతోషంలేదు విచారంలేదు నిరామయంగా వుంది. ఆమె చివరి తరగతి!

'మీరు టీచర్‌గా ఎందుకుండి పోలేదు?'

'ఉద్యోగంలో చేరుతూ గ్రామాభివృద్ధికి సేవ చేయగలననుకొన్నాను.'

'ఇప్పుడే మనుకొంటున్నారు?'

'ఏమీ అనుకోవటంలేదు. ఆశపూర్తిగా నాశనం కాలేదు''

ఆమె సమాధానం, ఆశ, నమ్మకం, తృప్తి కలిగించాయి.

ఆమెతో మాట్లాడుతున్నప్పుడు ఎవరో వచ్చి తొంగి చూచి వెళ్లిపోయారు

'ఎవరైనా మిమ్మల్ని ఏమయినా అడిగితే మీరు మాయింటికి ఎందుకు వచ్చారో స్పష్టంగా చెప్పండి. లేకపోతే ఏమయినా అనుకోగలరు ఆలా అనుకొంటే ఇక్కడ బ్రతుకే దుర్భరమయిపోతుంది. గుట్టుగా నా పరిధిలో నేను జీవిస్తున్నాను ఆ చెడ్డపేరు వస్తే, ఈ కష్టాలకు తోడు, జీవితం వచ్చినరక మవుతుంది' ఆమె కచ్చితంగా చెప్పింది. ఆమె తెలివితేటలకు, అంతకంటే జాగ్రత్తకు సంతోషమే కలిగింది.

పొయ్యి మీద అన్నం దించి వచ్చింది. తిరుగు బస్సు ఎనిమిదింటికి చీకటి పడింది.


'పల్లెలెలా అభివృద్ధి అవుతాయో చెప్పండి. టైం అయింది, వెళ్ళాలి'

'వాళ్ళు బాగుపడాలను కోకపోతే, ఎవరూ బాగు చేయలేరు వాళ్లకు ఏం తెలియకపోయినా, చెప్పేది ఆలోచించి ఆచరిస్తే చాలు! అంతా తమకే తెలుసుననే మూర్ఖత్వం పోవాలి మొదట!— ఆ తరవాతే అభివృద్ధి!'

ప్రాశ్నికుడు లేచి వస్తుంటే, ఆమె పలికిన మాటలు నిజంగా ప్రాశ్నికుడే అని వుండవలసింది. గ్రామసేవిక కుమారి సుశీల మాటలు.

'పల్లెలు మీరనుకొనేటంత సాఫీగా లేవు. తోవ పొడుగునా ఎత్తు పల్లాలు, ఎగుడు దిగుళ్ళాను జాగ్రత్తగా చూచి ముందుకు వెళ్ళండి. అసలే చీకటి.'

—రవి



సీరియల్ :

ముద్దమందార

గంగాధర



జరిగిన కథ

గోపాలపురం బదిలీ అయిన వాసు జీవితంలో సింహాచలం ప్రవేశించి కొంతకాలం తర్వాత విధి తమ కలయికను బయటపెట్టబోతుందని తెల్సుకుని వాసుని వూరువదలివెళ్లి పోమ్మంటుంది. తనకు ఉన్న ఒకేకోరికగా తన కొడుకును డాక్టర్ చదివించాల్సిందిగా కోరతుంది భాస్కరానికి వివాహం అయి కొన్ని సంవత్సరాలు గడుస్తాయి. భాస్కరం సహాయంతో తన పెద్దకొడుకైన రమణను చూస్తాడు వాసు సుశీల సింహాచలాన్ని గుర్తుకు తెస్తూంటూంది. ఆమె నెలాగైనా తన దాన్నిగా చేసుకోవాలన్న తలంపుతో తనవద్దకు పిలిపిస్తాడు వాసు ఆమె పుట్టినరోజు సందర్భంగా కొత్త పార్కర్ పెన్నూ, వందగూపాయలు బహుమానంగా యివ్వబోతాడు వాసు

9

"క్షమించండి" అందామె.

నా శరీరం చల్లబడిపోయింది. ఇక ఆలస్యం చేస్తే, రేపటినుంచీ అసలు పనికి రావడమే మానెయ్యొచ్చు, అందుకని, "ఆవేశ పడకండి. మీతో ఒక విషయం చెప్పాలి. వినేముందు శాంతంగా కూర్చోండి" అన్నాను. ఆమె యాంత్రికంగా కూర్చుంది. నేనూ కూర్చుని, ప్రారంభించాను.

"నేను మిమ్మల్ని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. మీ అభిప్రాయం తెలుసుకోవాలని వారంరోజుల నుంచీ అనుకుంటున్నాను మీరేదో కూటికి లేక మాపంచకి చేరారని, మీ మీద దౌర్జన్యం చేస్తున్నానని అనుకోకండి. చాలా పవిత్రమైన ఆలోచనతో యీ నిర్ణయానికి వచ్చాను. నాకు మొదటి భార్య పోయి నాలుగేళ్లవుతోంది రామం నాకొడుకు. ఆ సంగతి మీకూ తెలుసు. మీ నిర్ణయాన్ని యిప్పటికిప్పుడే చెప్పక్కరలేదు. సావకాశంగా ఆలోచించుకునే నిర్ణయానికి రండి. మీరు వప్పుకుంటే నాన్నగారితో చెప్తాను. మీరు సమ్మతించాలనే దేవుణ్ణి ప్రార్థిస్తాను," అని, "మరొక్క విషయం. ఇలా అడిగాననీ, దౌర్జన్యం చేశాననీ అనుకోవద్దు. నా మనస్సులో కోర్కెను వెల్లడి చేశాను మీ కిష్టం లేకపోతే క్షమించండి. దానికోసం పనం మానుకోనక్కరలేదు." అన్నాను. గుండె దడదడలాడింది.

సుశీల లేచి నిలబడింది.

టేబులు మీది అద్దం మీద రెండు కన్నీటి చుక్కలు టపటప రాలాయి నీళ్ళు నిండిన కళ్లతో ఆమె నా వంక వక్కసారి చూసి, వెళ్లిపోయింది.

మళ్లీ నా జీవితానికి సమస్యలు ఏర్పడ్డాయి. నా మనస్సులోకి వివాహ వాంఛ మళ్లీ చొప్పించారు ఇప్పుడు సుశీలని చేసుకుంటానని నాన్నగారికి చెప్పగలనా—చెప్పి వొప్పించగలనా సుశీల అసలు నన్ను చేసకోడానికి సమ్మతిస్తుందా? అన్నీ సమస్యలే.

సాయంత్రం అయ్యేసరికి ఒక నిశ్చయానికి వచ్చాను. ఏది ఏమైనా సరే సుశీల నా సొత్తు. నాన్నగారితో యీ విషయం ధైర్యంగా చెప్పి తీరాలి. సుశీలని బతిమాలయినా సరే వొ[illegible]చాలి—నాలో ఆరాటం ఎక్కువయ్యింది రాత్రి నాన్నగారి గదికి వెళ్లాను. "కూర్చో" అన్నారు. కూర్చున్నాను.

నాన్నగారు సిగరెట్టు వెలిగించి, "నీ వివాహ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చివుంటావనుకుంటాను. ఎవరిని చేసుకున్నా నా కభ్యంతరంలేదు కానీ, నువ్వు వివాహం వీలైనంత త్వరలో చేసుకోవాలి" అన్నారు.

"ఓ వారంలోగా చెప్తా"నని వచ్చేశాను.

రెండురోజులు గడిచాయి సుశీల పాఠానికి రాలేదు

అంటే ఆమెకు ఇష్టం లేదన్నమాట నాలో నిద్రపోతున్న అహం పైకి తన్నింది. నా వంటి లక్షాధికారి అడిగితే తిరస్కరిస్తుందా ఎంత అహంకారం? అనిపించింది వెంటనే నర్సమ్మగారిని పిలిచి, "సుశీల పాఠానికి రావడంలేదు. ఆవిడ ట్యూషను మానుకుంటుందో, లేక వస్తుందో కనుక్కొని రండి కారణం చెప్పకుండా నాగాలు పెట్టే కుదరదు అని చెప్పండి. బాబుని ఎత్తుకుని వెళ్ళి, కనుక్కురండి" అన్నాను

"అలాగే బాబూ" అని ఆవిడ వెళ్ళిపోయింది

నేను కుర్చీలో కూర్చుని, రెండు చేతుల మధ్యా బుర్ర పెట్టుకుని, నా ఖర్మను గురించి ఆలోచింపసాగాను కాసేపటికి "నమస్తే" అంటూ సుశీల వచ్చింది. నాలో కోపం పదిరెట్లయ్యింది కూర్చోండి అని కూడా అనకుండా, "మీకు పాపం మా వాడికి పాఠం చెప్పడానికి తీరుబడి లేదనుకుంటాను అంతగా కుదరకపోతే మానెయ్యొచ్చు మీకు మొన్నటివరకూ రావాల్సినది లెక్కచూసి పారేస్తాము. మాకు మేష్టర్లు దొరక్కపోరు, మీకు చెప్పించుకునే వాళ్ళు దొరక్కపోరు" అంటూ డ్రాయరులోంచి డబ్బుతీసి, "ఇదిగో మీకు రావాల్సింది" అని మూడు పది రూపాయల కాగితాలు టేబులు మీద పెట్టి, "తీసుకుని మీరు వెళ్ళొచ్చు" అన్నాను

గదంతా నిశ్శబ్దం.

నా నిశ్వాస, ఆమె శ్వాసబ్దాలు తప్ప మరే శబ్దమూ లేదు ఆమెకేసి చూశాను తలవంచుకుని, టేబులు మీద చూపుడు వేలుతో సున్నాలుగా చుడుతోంది నాకు కోపం పైకెగిపోయింది "ఇహ మీరు వెళ్ళొచ్చు" అన్నాను ఆమె తలఎత్తి నాకేసి చూసింది కళ్ళనిండా నిండిన నీరు సభ్యతను చూసుకుని, అక్కడే నిలిచింది సుశీల కన్నీళ్ళను కుడిచేతి మధ్యవేలుతో తుడుచుకుంటూ, "క్షమించండి మీ మనస్సు కష్టపెట్టాను" అంది

"క్షమించడానికి నేనెవర్ని? తెలివి తక్కువగా ప్రవర్తించి, మీ ముందు చులకనయ్యాను వెధవనయ్యాను. సరేలెండి. అయ్యిందేదో అయిపోయింది వెళ్ళండి" అంటూ నుదుట పట్టిన చెమట తుడుచుకున్నాను. సుశీల తన ముక్కుమీద పైపెదిమి పైభాగంలోనూ పట్టిన చెమట తుడుచుకుంటూ, "ఒక్కమాట చెప్పి, వెళ్తాను" అంది

"ఏవిటది" అన్నాను అరిచినంత గట్టిగా

"మీరు చెప్పిన విషయం ఆలోచించుకోడానికి మీరే టయిమిచ్చారు. రెండు రోజులు పాఠానికి రాలేదని యింత ఆగ్రహంగా మాట్లాడుతున్నారు" అంది.

నేను గతుక్కుమని, తమాయించుకుని "అంటే పాఠానికికూడా రావద్దని చెప్పానా," అన్నాను

"తప్పే" అందామె.

"కూర్చోండి" అంటూ నేనూ కూర్చున్నాను ఒక్క క్షణం నిశబ్బంగా గడిచాక "ఆలోచించుకున్నమీదట అసమ్మతి తెలియజేయడానికివచ్చారు అవునా, అన్నాను

"లేదు" అందామె.

నా హృదయం పరవళ్ళు తొక్కింది

"అంటే" అన్నాను

అంటే ఏవిటో చెప్పడానికి సుశీల సిగ్గుపడింది ఆమె ముఖంలో వింత కళ వచ్చింది నా ముఖంలోకి చూసి, గమ్మున తలదించుకుంటూ, "నిజంగా నేను చాలా అదృష్టవంతురాలిని" అంది నా శరీరం గగుర్పొడిచింది

"నిజంగానా" అన్నాను

"నిజం" అందామె

"వెరీగుడ్, కంగ్రాట్యులేషన్స్" అన్నాను. అన్నాక, "మీరు తప్పనిసరిగా ఒప్పుకోలేదు కదూ?" అన్నాను. సుశీల నాకేసి ఆశ్చర్యంగా చూసింది

"లేదు త్రికరణశుద్ధిగానే ఒప్పుకున్నాను. ఇంతకన్నా ఒక ఆడపిల్లకు కావాల్సిన అదృష్టం ప్రపంచంలో లేదు మా అమ్మకూడా మొదట్లో నమ్మలేదు నాకు పిచ్చి పట్టిందనుకుంది తరువాత నా అంత అదృష్టవంతురాలు లేదని మురిసిపోయింది" అంది సుశీల

నేను నేనే అదృష్టవంతుణ్ణి.

* *

నెలతిరక్కుండానే వివాహం అయిపోయింది.

సుశీల యింట్లో అడుగు పెట్టిన వేళ విశేషం అన్నారు మా వ్యాపారం విజృంభించింది సుశీల మా యింటికి వచ్చిన నెల తిరగకుండానే నాన్నగారు పాతకారు మార్చేసి కొత్తకారు కొన్నారు

నేనూ నాన్నగారూ కలిసి, విసుగూ విరామం లేకుండా పని చేసేవాళ్ళం ఓ సంవత్సరం తిరిగేసరికి లాభాలు విపరీతమయిపోయాయి! బెజవాడలో రెండు మేడలు కొన్నాము. ఒకటి సుశీల పేర, ఒకటి రామం పేరా పెట్టారు నాన్నగారు

కాలం అలిహాయిగా సాగుతూ, తనని చూసి తనే అసూయపడింది ఆగి, వెనక్కి తిరిగి చూసుకుని దిష్టికొట్టింది.

విపరీతంగా పని చేయడంవల్ల, విశ్రాంతి తీసుకోపోడం వల్లా నాన్నగారి ఆరోగ్యం బహుముఖంగా పాడయ్యింది. బ్లడ్‌ప్రెషర్ వంటి వన్నీ ఆయన్ని చుట్టుముట్టాయి. డాక్టర్లు నాన్నగారికి విశ్రాంతి అవసరమని చెప్తే, "ఏదో ఒకటి చెప్పకపోతే వాళ్ళ వసరం మన కేముంటుంది? అందుకని ఏవో ఒకటి చెప్తానేవుంటారు వాళ్ళు" అనే వారు నాన్నగారు

నాలుగునెలలు నలభై నెలలుగా నడిచాయి నాన్నగారు మంచం దిగని స్థితికి వచ్చి, తన స్థితిని గ్రహించి, "నా పని అయిపోయింది ఇక నాకే బెంగాలేదు. నువ్వు మనిషివి అయ్యావు వ్యాపారం మెలకువతో చూసుకుంటే అదెన్నడూ మనని మోసం చేయదు జీవితంతో పోరాడడం నేర్చుకో. భయపడి పారిపోయే వాళ్ళకు జీవితం ఏమీ యివ్వదు. ఇది నేను నీకు చెప్పే పాఠం.. రామాన్ని జాగ్రత్తగా చూసుకో వాడిని డాక్టరు చేయించు సుశీలని ప్రాణంగా, చూసుకో" అన్నారు

"అలాగే నండి" అన్నాను

రామాన్ని డాక్టరు చదివించాలన్నది నాన్నగారి కోర్కె

తన కొడుకును డాక్టరు చేయించాలన్నది సింహాచలం కోర్కె

కర్తవ్యాలను మననం చేసుకునేలోగా నాన్నగారు పోయారు ఇల్లంతా బావురుమంది ఎక్కడ చూసినా, నాన్నగారిని గుర్తుచేసే వస్తువులే రాత్రిపూట సుశీల పలవరించేది "భయంగా వుందండి" అనేది.

ఇల్లు మారాము.

మళ్ళీ నాకు మనశ్శాంతి పోయింది.

సింహాచలాన్ని నే పెట్టిన వుసురు పిశాచై నన్ను తరిమి తరిమి కొడుతున్నట్టనిపించింది మళ్ళీ నా జీవితం యాంత్రికమయ్యింది రామాన్ని చూసినపుడల్లా, సింహాచలం కొడుకు గుర్తుకు వచ్చేవాడు. సింహాచలం కొడుకును నా బిడ్డడని సంబోధించుకుందామని చాలాసార్లు ప్రయత్నించి విఫలుణ్నయ్యాను నాలో మార్పు సుశీలను కలవర పెట్టింది. "ఏవిటీ మధ్య అదోలా

వుంటున్నారు?" అంది సుశీల ఒకనాడు. ఏమని చెప్పగలను "రాధక్కయ్య గుర్తొం చ్చిందా" అంది తనే "అవును సుశీలా" అన్నాను. నేనెంత కిరాతుణ్ని! రాధ పేరు మర్చిపోయాను

సుశీలని సంతోష పెట్టడానికి నేను నా ప్రవర్తన మార్చుకోవాలని నిర్ణయించు కున్నాను. మాచవరంలో పెద్ద మేడ కట్టించి అందులోకి మారాము సుశీలకి ఒకకారు కొన్నాను. సుశీలని, రాధాన్ని, చూసుకుంటూ మనస్సును బండ చేసుకో డానికి ప్రయత్నించాను

సుశీల తోటంతా మందార వనంగా మార్చింది "మందార చూస్తే నాకు ప్రాణం" అంది సుశీల. ఆమె గొంతులో ఏదో ఆవేదన కనుపించింది. "ఏం?" అన్నాను తోటలో గడ్డి మీద కూర్చుంటూ. సుశీల కూడా నా పక్కనే కూర్చుని, "దాని వెనుక బలమైన కథ కథ కాదు, చరిత్ర వుంది.

నా వీపు మీద ఎవరో చరిచి నట్టు య్యింది.

"చెప్పనా" అంది సుశీల చెప్పమన్నాను. సుశీల గడ్డిపువ్వును కోసి, దానికేసి చూస్తూ ప్రారంభించింది

"—అవి నేను నాలుగోఫారం చదివే రోజులు మా క్లాసులో ఒకమ్మాయుండేది ఆమ్మాయి ఎవ్వరితోనూ మాట్లాడేది

ముద్దమందార

కాదు అలాటేది ఒకనాడున్నట్టుండి నన్ను పలకరించి, "మీ యింట్లో మందార, చెట్టుందా! నాకో పువ్వు తెచ్చిపెట్టవా" అంది. నాకు బలే గర్వం వచ్చింది "ఆ" అన్నాను. 'మీ యింటికి రానా' అనడిగింది. నేను తలూపాను ఆరోజు నుంచి ఆమె రోజూ మాయింటికి వచ్చి రోజుకో పువ్వు కోసుకునేది. ఇద్దరం యస్సెల్సీలోకి వచ్చాం. ఆ సంవత్సరం దీపావళికి ఆమె మాయింటికి వచ్చి బోలెడు మందారపువ్వులు కోసుకుంది. "అన్నెందుకు హేమా" అన్నాను. కావా లంది రాత్రి మా యింట్లో భోజనం చేశాము భోజనాలయ్యాక పెరట్లో కూర్చు న్నాము. హేమ అటూ యిటూ చూసి, "నాకు పెళ్లి నిశ్చయమయ్యింది. మా మేన మావ పెళ్లాం చచ్చిపోయింది అతనికి బాగా డబ్బుంది యాభయ్యేళ్లుంటాయను కుంటాను. నలుగురు పిల్లలున్నారు సుశీలా, యీ పెళ్లి నయమా చావునయమా" అంది. నేను ఆవేశంతో చావే నయం అన్నాను. ఆమె నవ్వేసి, "తీరా నేను చచ్చిపోతే మందారపువ్వు చూసినపుడన్నా గుర్తుకు తెచ్చుకుంటావా" అంది. "ఛ. అవేం, మాటలు!" అన్నాను మరి కాసేపటికి వెళ్లి పోయింది. తెల్లారి ఆమె శవం నూతి లోంచి తీశారు. ఆనాటి నుంచీ హేమ స్నేహానికి నాకీ మందారపువ్వు ఆనవాలు" అంది సుశీల ఆమె కళ్లవెంట నీరు కారు తోంది. నేను నిట్టూర్చాను. ప్రతిమనిషి జీవితంలోనూ ఓ విషాద సంఘటన వుంటుం దేమోననిపించింది

"నాకూ మందారంటే యిష్టం. కానీ ఎందు కిష్టమంటే మాత్రం చెప్పలేను" అన్నాను.

* * *

పున్నమి చంద్రుడు నవ్వాడు

నా జీవితంలో మరోసారి ఆనందించ బోయాను అంతలోనే విధి వెక్కిరించింది.

రాధ ప్రసవించి చనిపోయింది.

సుశీల కొన్ను పోయింది।

నా పాపానికిది మరో ఫలం

* * *

సుశీల మనస్సు నిమ్మదించడానికి పుణ్య క్షేత్రాలన్ని చూద్దాంపద అని బయల్దేర తీశాను ఒకనెల్లాళ్లు తిరగవలసిన పవిత్ర దేశాలనన్నీ తిరిగి, యింటికి చేరాము సుశీ లకి కొంత మనస్సు కుదుటపడింది. నాకు కుదుట పడడానికి వీల్లేదు కనుక పడలేదు.

* * *


ఒకరోజు రాత్రి పడుకోబోయే ముందు "మిమ్మల్ని ఒక ప్రశ్నడుగుతాను కానీ, ఏమను కోరు గదా" అంది "అడుగు" అన్నాను అడిగే విషయం వూహించలేక

"మీ ఆల్బమ్‌లో రాధక్కయ్య ఫోటోలు అవి అయ్యాక నో పల్లెటూ రమ్మాయి ఫోటోలున్నాయి ఏవరండీ ఆ అమ్మాయి? ఎంత అందంగా వుందో—మీరు తీసినవే ఆ ఫోటోలు" అంది నా పైప్రాణం పైనే పోయింది

"మిమ్మల్నే, ఏమిటా పరధ్యాన్నం?" అంది నేను సుశీల ముఖంలోకి చూడడానికి సాహసించలేకపోయాను మళ్లీ ఎలాటి మలుపు తిరుగుతుందో నా జీవితం అని శరీరం భయంతో కుంచించుకుపోయి, మొండి ధైర్యం వచ్చింది ఏమైనాసరే, చెప్పేతీరాలి ఏం జరిగినా ఎదుర్కొం టాను చేసిన పాపం చెపితే పోతుందం టారు కానీ అది నిజమయితే బోలెడు పాపాలు చెయ్యొచ్చు

నేను నా మనస్సులో ఏదో ఆరాట పడు తున్నట్టు గ్రహించింది సుశీల తను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పడం నా కిష్టం లేనట్టు వూహించి టేబులు మీది పుస్తకాలు సర్ద నారంభించింది. నేను విశ్రయించుకున్నాను.

చెప్పే తీరాలి.



"సుశీలా మందారపువ్వు వెనుక నాకో కథ వుంది. అదప్పుడు చెప్పలేనన్నాను. ఇప్పుడు చెప్తాను కూర్చో" అంటూ సుశీలను నా పక్కన కూర్చోపెట్టుకుని ప్రారంభించాను. చెప్పినంతసేపూ సుశీల బొమ్మలా కూర్చుని వింది. ఆమె వంక చూడకుండా చరిత్ర ముగించి, సుశీల ముఖంలోకి చూడడానికి ధైర్యంలేక తలగడ మీదున్న కుందేలు బొమ్మ కేసి చూపులు మరల్చుకున్నాను..

సుశీల కన్నీరు తడుచుకుంది.

"ఇది సుశీలా. రాధకి యీ గాథ చెప్పినపుడు ఆమె గర్భవతి. ఆమె మనస్సు గాయపడింది. నన్ను క్షమించ లేకపోయింది. మానసికంగానూ, శారీరకంగానూ కృంగి, కృశించిపోయింది. చివరికి పసికందును నా కోసం వదిలి, కడసారి చూసుకునే అదృష్టం కూడా లేకుండా యీ లోకాన్ని వదలిపోయింది చెప్పు సుశీలా. నువ్వు నన్ను క్షమిస్తావా" అన్నాను. ఆమె చేతులు నెమ్మదిగా నాభుజాన్ని తాకాయి. చూపులను భయంగా ఆమె కేసి తిప్పుకున్నాను. సుశీల నా కన్నీరు తుడుస్తూ "మీరింత బాధ పడవలసిన విషయమేమీ లేదు. దీనికా మీకింత మనోవ్యథ?" అంది

నే నాశ్చర్యపోయి, "ఏమిటి నువ్వనేది? నిజమా" అన్నాను.

"అవును. మానవు డెప్పుడూ దేముడవలేడు మానవుడిలో మంచితనం ఎప్పుడూ పరిస్థితుల మీదే ఆధారపడుతుంది మీరు ఇంత బాధ పడనవసరంలేదు కానీ "అంది

"కానీ" అన్నాను ఆత్రంగా

"ఆవిడ—సింహాచలం కొడుకు మీ కొడుకు కాదా! మీ సుఖం కోసం తన జీవితం అర్పించిన త్యాగమూర్తి. మనం ఆవూరు వెళ్ళి, ఆమెను కలుసుకుని, వాళ్ళిద్దరనూ తీసుకురావాలి. వాళ్ళూ మనతోపాటే వుండాలి రామానికి ఎంత హక్కుందో, అంత హక్కూ ఆమె కొడుక్కీ కూడా వుండాలి మనం వెళ్ళివద్దాము" అంది

"లేదు సుశీలా, నీకా అదృష్టంలేదు ఆమె ఆచూకీ ఆ వూళ్ళో తెలియలేదు పోయిన సంవత్సరం వ్యాపారం పని మీద వైజాగ్ వెళ్ళి, అక్కడ నుంచి వెళ్ళాను వాళ్ళెవరూ లేరు ఇక సింహాచలాన్నీ వాళ్ళనీ చూడడం యీ జన్మకి జరగదు" అంటూ నేను గోపాలపురానికి వెళ్ళి సింహాచలం కోసం చూసిన సంగతి చెప్పాను

కాన్పు పోవడంతో సుశీల ఆరోగ్యం, పూర్తిగా దెబ్బతింది. అనేకరకాల అనా

రోగ్యాలు సుశీలని చుట్టుముట్టాయి. దగ్గు ఆయాసం విపరీతంగా వచ్చేది డాక్టర్లు పరీక్ష చేయకుండా వుబ్బసం, అన్నారు. చేసి అవునన్నారు కానీ వుబ్బసం పెద్దరకం వ్యాధికాదని, నూటికి నలాటొక్క మందికి అ వ్యాధి వుంటుందనీ డాక్టర్లు వచ్చుచెప్పారు. సుశీల కూడా నాతో ఆదే అంది.

కానీ నా పాపం నన్ను చివరికంటా వెంటాడుతుంటుందనే భయం నాకుండనే వుంది.

రోజులు గడిచి, నెలలను చేసిన కొద్దీ సుశీల ఆరోగ్యం క్షీణించ సాగింది సుశీల బ్రతకదని నాకు తెలుసు నా పాపానికి యింత ఘాతుకంగా శిక్ష పడుతుందని నే నెన్నడూ అనుకోలేదు నాలో ఆవేశం పుట్టి దైవదూషణకు దారితీసింది. దేముణ్ణి కసితీరా దూషించాను సుశీల కన్నీటితో వారించింది "నా మాట వినండి దైవదూషణ మానవునికి శ్రేయస్కరంకాదు" అంది సుశీల ఆ రాత్రి సుశీల నిద్రపో యాక, దేముడి పటం దగ్గరకు వెళ్లి నిల బడ్డాను నాకు దైవం మీద విన్నలేని కసి పుట్టింది

"నా పాపానికి నీ కిష్టమొచ్చిన శిక్ష విధించు నేను అన్నిటికి సిద్ధంగా వున్నాను. సర్వనాశనానికయినా సిద్ధమే! యీ పం దెంలో నువ్వు వోడిపోతావో, నే నోడిపోతానో.. నేను శూన్యుణ్ణయ్యాను. నా అన్న వాళ్లం దర్ని తీసుకుపోయావు. సుశీలనీ తీసుకుపో.. రామాన్ని తీసుకుపో. నన్ను బికారిని చెయ్యి... కాలూ, కన్నూ తీసెయ్యి అన్నిటికీ సిద్ధమే" అని మండే గుండెతో అరిచాను

నెల తిరగలేదు దేముడు నా సవాలు విన్నాడు



అనాడు మామిడి తోటలు చౌకగా వచ్చాయంటే మేనేజరుతో బయలుదేరి వెళ్లాను. నూజివీడులో రెండ్రోజులుండి, బేరం పూర్తి చేసుకుని, యింటికి వచ్చేసరికి "సుశీల పోయింది" అని తెలిసింది.

నా గుండె పిడచ కట్టుకుపోయింది.

సుశీల నిద్రపోతున్నట్టు మంచం మీద నిర్జీవంగా వుంది. నేను యాంత్రికంగా వెళ్లి, ఆమె తలదిక్కున కూర్చున్నాను. సుశీల ముఖంలోకి చూశాను

"నా కోసం, నా ఆరోగ్యం కోసం దేవు డికి దండం పెట్టండి" అనే సుశీల నాకిక లేదు దేముడికి దండం పెట్టమని నాకు బోధించడానికి ఎవ్వరు వుండ కూడదనే దేవుడు సుశీలని తీసుకుపోయాడు నే నిక ఏకాకిని ఒక్క రామం వున్నాడు.


"రామం ఏడి?" అనడిగాను చచ్చి పోయాడని గనుక చెప్తే వినడానికి సిద్ధ పడుతూ నరసమ్మగారు రాధ తల్లి యింటికి తీసుకు వెళ్లినట్టు పనివాడు చెప్పాడు

సుశీల నుదుట ముంగుర్లు సరిచేశాను.

తలలో నుంచి పేలు బయటికి వస్తు న్నాయి ఇన్నాళ్లూ మనిషితో వుండి, రక్తాన్ని పీల్చడానికి స్థావరం ఏర్పాటు చేసుకున్నవాటికీ ఆనాటితో మనిషితో సంబంధం తీరిపో తుంది మృతకళేబరం మీద అవి క్షణం వుండవు

మిగతా కార్యక్రమం అంతా అయ్యింది. రామాన్ని తనే పెంచుతానని సుభద్రమ్మగారు ప్రాధేయపడింది "మీదగ్గరే వుంచండి. నా దగ్గరయితే వాడూ దక్కకపోవచ్చు", అని చెప్పాను మకాం విజయవాడ నుంచి నూజివీడు మార్చేశాను.

(సశేషం)



ఒకనాడు తైమూరు ఒక గాడిద పిల్లను చూశాడు. పట్టుతివాసీలాంటి తెల్లని బొచ్చుతో అది చాలాఅందంగా ఉంది.

"ఆ గాడిదపిల్ల బాగుందికదూ!" అన్నాడు తైమూరు, చుట్టూఉన్న ఆశ్రితులతో.

రాజుగారి మెప్పుకోసం అక్కడ చేరిన వారంతా దానిని తెగ పొగడడం మొదలు పెట్టేరు.

"ఓహో ఏమి అందం!...... ఆ తోక ఉందే...... ఈ రంగు చాలా అరుదు....చెవులు ఇల్లా నిటారుగా ఉంటేనే మంచిది......"

వాళ్లమధ్యనున్న మౌల్వీ నసీరుద్దీన్ ఊరుకుంటే బాగుండదని తన అభిప్రాయం ఇల్లా చెప్పేడు.

"ఈ గాడిద అందచందాలను అందరూ మెచ్చుకున్నారు సరేకాని, ఒక్క సంగతి మాత్రం ఎవరూ గమనించినట్లులేదు. దీనికి అసమానమైన తెలివి తేటలు ఉన్నట్లు నుదుటిమీది ఈ సుడిచూస్తే తెలుస్తోంది. నా బోటి గురువు చేతిలో పడిందంటే ఇది పుస్తకాలు చదవడం కూడా నేర్చుకోగలదు!"

మౌల్వీ మాటలకు ఆశ్చర్యపడ్డారు.

"ఆ పని నువ్వు నిజంగా చెయ్యగలవా?" అని అడిగేడు తైమూరు.

మౌల్వీ వినయంగా శిరస్సువంచేడు.

"కాని కాస్త ఖర్చుతో పని..."

"ఏపాటి అవుతుందేం?"

"ఎంతోనా? రోజు కొక బంగారు దీనారం. ఈ గాడిదకి అఖండమైన ప్రజ్ఞ ఉంది. నాకున్న బోధనానుభవంతో ఆరు నెలలలో పుస్తకంచూచి చదవడం నేర్పగలను. అందులో సందేహమేమీలేదు. ప్రభువుల సెలవైతే ఈ రోజునుంచే......"

తైమూరు అంగీకరించాడు. ఆరు నెలలకీ అయే ఖర్చు ముందుగానే మౌల్వీకి అందజేశాడు.


మౌల్వీ ఆ గాడిదపిల్లను ఇంటికి తీసుకువెళ్లి చదువు చెప్పడం ప్రారంభించాడు.

ఆరు నెలలు గడిచాయి. అనుకున్న రోజు రానే వచ్చింది. ఆరోజుమధ్యాహ్నం చదువ నేర్చిన గాడిదను రాజభవనానికి తీసుకు వచ్చాడు మౌల్వీ. ఆ వింత చూడడానికి జనం విరగబడ్డారు.

గజం ఎత్తు బల్లమీద ఒక వ్యాసపీఠం, దానిమీద ఒక తోలు పుస్తకాన్ని ఉంచాడు మౌల్వీ. ఆ పుస్తకాన్ని చూడగానే గాడిద సంతోషంగా ఓండ్ర

మౌల్వీనసిరుద్దీన్ - కథలు

శ్రీమహీధర నళినీ మోహన్



పెట్టి పరుగు పరుగున దగ్గరకు వచ్చింది. ముందరికాళ్ళు రెండూ బల్ల మీద ఆనించి నిలుచుని, నాలుకతో ఆ పుస్తకంలోని మొదటి పుటను తిప్పింది. కళ్ళు కాగితంమీద చక చక తిరిగేయి. రెండవ పుట తిప్పింది. దృష్టి పుస్తకం మీద నుంచి తప్పించి,

బాలసాహితి

దూరంగా నిలుచున్న గురువుకేసి ఏదో గూఢభావంతో చూచి, వింతగా అరిచింది. మళ్ళీ తలవంచి మూడోపుట తిప్పింది. జాగ్రత్తగా పరిశీలించింది. కళ్ళతోనే చదువుకుని ఒకచోట ఆగి, కఠినమైన భావాన్ని అర్థం చేసుకుంటున్నట్లు శ్రమపడింది. తరువాత మరో పుట...... ఈవిధంగా రెండు మూడు పుటల కొకసారి గురువుకేసిచిత్రంగా చూడడం, అరవడం, మళ్ళీ చదవడం పుటలు నాలుకతో తిప్పడం....ఇల్లాగ పుస్తకం పూర్తిచేసి, దీర్ఘంగా వోండ్ర పెట్టి, మౌల్వీ దగ్గరకు వచ్చి నిలువబడింది.

"సెభాష్!" అన్నాడు రాజు.

చూడవచ్చిన జనం చెవులు దిబ్బళ్ళు వేసేలా "వహ్వా"అని అరిచేరు. చప్పట్లు కొట్టేరు.

మౌల్వీ అందరికీ వినయంగా వంగి సలాములు చేశాడు.

తరువాత రాజు మౌల్వీని రహస్యంగా పిలిపించాడు. గాడిదకు చదువు నేర్పిన పద్ధతి చెప్పమని ప్రతిమాలినంత పని చేశాడు.

"దేవర చిరకాలం వర్ధిల్లాలి!" అని మౌల్వీ తన రహస్యం విన్నవించుకున్నాడు.

"తోలు పుస్తకంలో పుటలమధ్యని పదేసి బార్లీ గింజల చొప్పున అద్ది, వ్యాసపీఠంమీద పెట్టేను. వరుసగా రెండు రోజులపాటు గాడిదకు ఏమీ పెట్టకుండా పొట్టమాడ్చి, మూడో రోజున ఆ పుస్తకంముందు వదిలి పెట్టేను. ఇక దాని ఆకలే దానికి చదువంతా నేర్పేసింది .. ఇదిగో ఈ వేళకి అప్పుడే రెండు రోజులనుంచి అది ఉపవాసం చేస్తోంది. ఈరోజున పరీక్ష. ఇది అంతా రెండు రోజుల ఉపవాస దీక్షా ఫలితం!"

"మరి అప్పుడప్పుడు నీకేసిచిత్రంగా చూచి అరిచేదికదా అదేమిటీ?" అని అడిగేడు తైమూరు.

"అక్కడక్కడ పుటల మధ్య బార్లీ గింజ ఒక్కటి కూడా లేకుండా కాళీ వదిలేశాను. ఆశగా వెతుక్కుని, ఏమీ దొరకక కోపంతో నాకేసి చూచి అరిచేది. అంతకన్న మరేమీలేదు"

రాజు మౌల్వీని మెచ్చుకున్నాడుకాని, రహస్యం తెలియనపుడు కలిగిన సంతోషంమాత్రం మిగులలేదు. ●





బాధ అనేది మాకు ఒక సమస్య...చూడండి మేము మీకు ఏవిధంగా సహాయపడతామో!

పరిశోధన: 'ఆస్ప్రో' యొక్క పరిశోధనా సంస్థలోని ఒక పరిశోధనా దళానికి నేను ఉపదేశకుడను బాధను అపుజేయడానికి మంచి పద్ధతులను కనిపెట్టుట మా పని. ఈ విషయమును గురించి ఏకాగ్రతతో ప్రపంచమంతటా పరిశోధనలు జరుపుతున్న అగ్రగణ్యమైన పరిశోధనా సంస్థలలో మేము ఒకరము. నొప్పిని నివారించుటకు నేడు శ్రేష్ఠమైన క్రొత్త మార్గము 'ఆస్ప్రో' ఫార్ములా అని మేము తెలుసుకొన్నాము.

ఇటీవల అమెరికా ప్రభుత్వమువారి అధ్వర్యమున జరిగిన పరిశోధనలు 'ఆస్ప్రో' బాధను త్వరితముగను, ఖచ్చితముగను పోగొట్టుటకు చురుకైన పాళ్లుకల్గిన బాధానివారిణిగ తేటతెల్లము చేయుచున్నవి. అందుచేతనే ప్రపంచమంతటా డాక్టర్లచేతను, ఆసుపత్రులలోను ఇది వాడబడుతోంది.

బాధ అంటే ఏమిటి? మెటాబొలిక్ ఉత్పత్తులు, దేహము వాటిని తీసు కొని పోగలిగే కంటె హెచ్చు వేగములో, స్నాయువులలో కూడుకొని చేరి పోవడంవల్ల మరుగుపడిన వాపు కలుగుతుంది దానితో నరములకు ఒత్తిడి కలిగి బాధ కలుగుతుంది.

'ఆస్ప్రో' ఎలా పనిచేస్తుంది: 'ఆస్ప్రో' దేహములో వెంటనే యిమిడి, వాపును, నరముల మీద వత్తిడిని తగ్గించి నొప్పిని వెడలగొడుతుంది.

'ఆస్ప్రో'ను ఈ వ్యాధులకు వాడండి: నొప్పి • తలనొప్పి • ఒంటి నొప్పి • పంటి నొప్పి • కీళ్లనొప్పి • జ్వరముతో కూడిన జలుబు • ఫ్లూ • కీళ్ల నొప్పులతో గూడిన జ్వరము.



మోతాదు:
పెద్దవారికి: రెండు బిళ్లలు. అవసరమైతే తిరిగి వేసుకొనండి
పిల్లలకు: ఒక బిళ్ల లేక మీ డాక్టరు సలహా ప్రకారము వాడండి.

A.G 3 66 TEL

'ఆస్ప్రో' నొప్పిని వెడలగొడుతుంది!

లావుపాటావిడ వచ్చింది. సెంటిమీటరు ఖాళీ లేకుండా నగలతో నిండిపోయుంది ఆవిడ మెడ. వేళ్లతో లెక్కపెట్టగలిగినన్ని వెంట్రుకలు దిగలాగి చట్రంం ముడి అమర్చు కుంది ఆవిడ. పాప చాప తెచ్చి వెయ్యగానే మోసుకొచ్చి పడేసిన బియ్యంబస్తా లాగ ధబుక్కున చతికిలబడింది. అక్కణ్ణుంచీ మొదలెట్టింది. లేచిందగ్గర్నుంచీ పడుకునే వరకూ ఇంట్లో ఉన్న ఎంతమంది పని వాళ్లని అదుపాజ్ఞల్లో ఉంచలేక తన బాధపడాలో, తను ఇలా ఒక్కగంట బయల్దే రినా ఆ సమయంలో ఇల్లెంత గుల్ల అయి పోతుందో ఆ ఊర్లో తమకున్న పలుకుబడీ వరసగా ఆవిడ చెప్పేస్తుంటే వినలేక సీత చెవులు హోరెత్తిపోయాయి. పాప ఆవిడికి పని మనిషిచేత డ్రింకు తెప్పించి ఇచ్చింది. ఎండాకాలంలో ఆవిడ ఎక్కడికి బయల్దే రినా డ్రింకులుతప్ప మరోటి పుచుకోదుట. వక్కపొడి పొట్లం ఇస్తే నోట్లో వేసు కుంది ఆవిచ గుమ్మం దిగుతుండగానే సీత అంది "అమ్మయ్య! ఎవరుబాబూ ఈ సోదె మనిషి?"

పాప తన చేత్తో సీత నోరుమూసింది "వూరుకో! బావుండ దావిడ వింటే" అంది. ఆవిడ మొగుడు ఆ ఊర్లో నాలుగు బియ్యం మిల్లులు నడుపుతున్నాడు. రాబడి ఇంతా అని అనుకోలేము ఆ సంగతలా వుంచితే, ఆవిడకి పాప కొడుక్కి ఈడయ్యే కూతురు

నన్ను నమ్మవా?


ఒకర్తివుంది పాలూ, పాదరసంతోతయారు చేసినట్టుంటుందా పిల్ల. ఈ పిల్లతల్లి మగపిల్లలకి ఆమధ్య వివాహాలు చేసినపుడు ఆ ఐశ్వర్యం ఆ హడావుడీచూసి పాపకి కళ్లు తిరిగిపోయేయని చెప్పింది. అంతా చెప్పి 'ఇలాంటివాళ్లతో వియ్యం పొందడం ఎంత అదృష్టం!' అంది.

వింటూనే సీతకి మొహం తిరిగినట్టయింది చిన్నప్పుడు ఎవరో అనుకోగా విన్న వో సంఘటన జ్ఞప్తికొచ్చింది. వాళ్లూ తమలాగే ఇద్దరు స్నేహితులు. ప్రాణానికి మరో ప్రాణంలా ఉండేవాళ్లు. తేడా ఒక్కటే వాళ్లిద్దరిదీ ఒకటే కులం కావటాన ఆ స్నేహం మరింత సన్నిహితమయింది. నీకు కొడుకు పుడితే నా కూతురికి నీకుకూతురు పుడితే నా కొడుక్కి చేసుకుందామని పెళ్లిళ్ల లోనే వాగ్దానాలు చేసుకున్నారు. వొట్లు వేసుకున్నారు. అలాగే పుట్టడం అయింది పుట్టిన పిల్లలు పెరగ కేమవుతారు? పెళ్లీడుకి వచ్చేరు. కూతుర్నికన్న ఆవిడ ఆకొడుకుని కన్న ఆవిడ ఇంటికి వెళ్లింది ఇహ నిశ్చయం తాంబూలా లిచ్చేసుకుందామని. స్నేహితురాళ్లిద్దరినీ ఒకటేవూరు. ఎదురెదు రిళ్లు పిల్లలిద్దరిదీ ఒకటే స్కూలు. ఒకటే క్లాసు. పిల్లలిద్దరూ చిన్నప్పటినుంచీ ఒకేచోట పెరిగినవాళ్లు కావటంచేత వాళ్ల మనసుల్లో ఒకరిమీద మరొకరికి అభిమానాలు అనురాగాలు గాఢంగా ఏర్పడ్డాయి. వయసులు వచ్చేసరికి ఆ అనురాగానికి 'ప్రేమ' అని పేరు మార్చుకున్నారు. పరిస్థితులు పరిసరాలు వాళ్ల వూహాలికి, కోర్కెలకి దోహదం ఇచ్చినందువల్ల పెద్దవాళ్ల ప్రమేయం తమకి అవసరమనిపించని ఒకానొక ఆవేశంలో క ణికోద్రేకానికి దాసులయిపోయేరు. చేసిన తప్పు కాస్తా బయట పడింది. ఆడపిల్లగల ఆవిడ లబో దిబో మంటూ స్నేహితురాలి దగ్గరికివెళ్లి తమ పిల్లల్ని స్వేచ్ఛగా వదిలినందుకు చెయ్యగల్గింది వాళ్ల వివాహం గుట్టుగా జరిపించెయ్యడమే అని చెప్పింది. మగపిల్లవాడితల్లి అంతా విని వూరుకుంది. ఆవిడ వూరుకున్నా ఈవిడ ఊరుకోలేక గట్టిగా సతాయిస్తే "మా వాడికి మరో అమ్మాయితో పెళ్లి నిశ్చయం చేసేసుకున్నాం. అయినా కాకపోయినా మీ పిల్లని వూరిమీద ఎవరు వదిలేయమన్నారు? ఆడపిల్లని కన్నదానివి. అదుపులో ఉంచుకోవడం తెలీవద్దూ?" అని ఎగిరిపడిం దావిడ. ఇంకా మా ల్లడితే "ఇదో గుణపాఠం అనుకుని వూరుకుని వుండు రభసచేస్తే నష్టం ఎవరికి? నీకే" అని దడిపించింది.

పాప ఆ ఇల్లాలికి ఏం తీసిపోనట్టే కనిపిస్తోంది. మీదు మిక్కిలి అటూ, ఇటూ పెద్ద రగడ కూడా జరుగుతుంది పాలలాటి తమ స్నేహంలో గరళం పోస్తున్నారీ పిల్లలు. వీళ్ళు పుట్టి చేసే ఉపకారం ఇది! అను కుంది సీత. తలెత్తి పాపవేపు చూడాలంటే ఏదో వెరపు అడ్డువస్తోందిప్పుడు కళ్ల ముందున్న సర్వమూ జుగుప్సామయంగా తోచేయి సీతకి బొట్టుపెట్టి సాగనంపుతున్న పాపతో "వెళ్తాను" అని కూడా అనలేకపోయింది.

దారి పొడుగునా కూతురిమీద అంతు లేని కోపం వచ్చింది ఇంటికి వెళ్లగానే దాని పీక పిసిగేద్దునా? అనుకుంది కసితో. ఇంటికి వెళ్లగానే ప్రభాకర్ అడిగాడు "ఏమిటి కథ? ఎంతవరకు వచ్చింది?"

మనసంతా చీకాగ్గావున్న సీత "ఇప్పుడు నన్నేమీ ఆడక్కండి" అంది వారం, పది రోజులుగడిచినా సీత ఏంచెప్పకపోవటంవల్ల ప్రభాకర్‌కి భార్య తనని నిర్లక్ష్యం చేస్తోందనిపించింది. అనుమానం కూతురిమీదకి



పోయి కోపంతో నిగ్గదీశాడు. నిజంగానిదేనా తప్పు జరిగివుంటే తల్లీ కూతుళ్లిద్దర్నీ పోయి ఎందుకోనేనా పడమన్నాడు. అంతే గాని ఏడమొహం పెడమొహంతో, తననిలా ఇద్దరూ చేరి మాటిన బాధ పెట్టి చంప వద్దన్నాడు. ఆరోజే పాప దగ్గర్నుంచీఉత్తరం వచ్చింది.

"ప్రియ స్నేహితురాలు సీతకి, పాప వ్రాయునది.

మా అబ్బాయికి దైవానుగ్రహమువలన వే ననుకున్న ఆ లక్ష్మాధికార్ల సంబంధమే కుదిరింది. కట్నం విషయం వ్రాయడం దోషం కనక వ్రాయడంలేదు. పాపకి ఉన్న ట్నుండి ఈ లక్షాధికార్ల స్నేహాలేమిటి? దాని మనసులో ఈ అంతులేని ఆశలేమిటి? ఎందుకిలా మారిపోయింది మా పాప? అని అనుకుంటావు. నీ దురభిప్రాయాలు వదల గొట్టకపోతే మన స్నేహం చెడుతుంది. కను కనే రాస్తున్నా. విను.

ఆరోజు మనింటికి వచ్చినావిడతో నాకున్న స్నేహం కొత్తగా తెచ్చిపెట్టుకున్నదికాదు. మేమీ వూరు వచ్చిందగ్గర్నుంచీ వాళ్ళు మాకు తెలుసు ఆయన ఉద్యోగరీత్యానూ, నేను సంసార రీత్యానూ వాళ్లవలన ఇప్పటికి అనేక ఉపకారాలు పొందేము. అవి ఫలానా అని విడమర్చి చెప్పుకోలేనివి. ఆర్థికంగా ఒక మెట్టు దిగువున వున్నవాళ్లకి నిత్య జీవితా వసరాలు వెళ్ళాలంటే ఎన్ని తిప్పలు పడాలో నీకు నేను వేరే చెప్పక్కర్లేదు ఎందు కంటే మా కుటుంబాన్ని నీవు మొదటి నుంచీ ఎరుగుదువు కనుక.

ప్రతి మనిషి ఏదో స్వలాభంకోరి వుండక పోతేగాని అవతలవాడికి ఉపకారం చెయ్యడు. ఇది మనిషి లక్షణం అంతే, ఆ స్వలాభం తెచ్చిపెట్టే ఇబ్బందులు ఘోరమైనవయితే అవతలవాళ్ళు చాలా బాధ పడాల్సివస్తుంది మా కాబోయే కోడ పిల్ల అతి అంద మైనది, చురుకైనది తెలివైనదేగాని భగ వంతుడు ఆ అమ్మాయికి ఒక్కలోపం పెట్టేడు. ఆలోపం పెళ్ళిచూపులనాడు నేను ఆ పిల్లని నీ పేరేమిటమ్మా అని-అడిగితే నావేపు జాలిగా చూసి వినిపించదన్నప్పుడు తెలిసింది. అప్పటికి వాళ్ళు మాకు ఎంత దగ్గరికి వచ్చేశారో గ్రహించుకుని వొనిట్టూ ర్పు విడవటం మినహా ఏం చెయ్యలేకపోయేము మాలాంటి బీద కుటుంబాలకి దేవుడుపెట్టే అగ్నిపరీక్ష ఇది సీతా! ఇంత మనో వ్యాకు లంలోనూ ఒక్క సంతోషకరమైన విషయం మేమిటంటే, మావాడు నాముందు ఆయనముందు వంచిన తల ఎత్తవల్సినవాడు కాకపోవటం! ఇంతవరకూ వచ్చేక ఇప్పుడు ఆ లక్షాధికార్లతో విరోధం ఎలా పెట్టు కుంటాము? కోడలికి వున్నది ఈమాత్రం లోపమేకదా—అనుకుని మేమూ వాడూ సరి పెట్టుకున్నాము.

త్వరలోనే శుభలేఖ వస్తుంది. పాపమీద దురభిప్రాయాన్ని చెరిపేసుకుని పెళ్లికి వస్తావుకదూ? పెడమొహం పెట్టుకుని నువు వెళ్తుంటే నాకు మనసు కష్టమని పించింది. నీకోపం బహుశా నీ కూతుర్ని నేను సతాయించేనని అయివుంటుంది. నేను నీ కూతుర్ని ఏడ్వవలసినంత ఎక్కువగా నొప్పించలేదు. నిర్మల గురించీ నా కొడుకు గురించీ కాలేజిలో పుకారు పుట్టింది చెడుగా కనుక ఇద్దరూ కలిసి తిరగటం మంచిది కాదన్నాను. చెడ్డపేరు వచ్చినంత సులభంగా మాసిపోదు. మొక్కని పట్టిన చీడని మొద టిలోనే తుంచెయ్యకపోతే అది ఎదిగిఆకులూ పువ్వులూ కాయదు నిర్మల స్వతహా పౌరుష వంతురాలుఅని నాకు తెలుసు గనుక ఒక్క దులుపు దులిపే అది పౌరుషంపడి వూరు కుంటుందని—

ఇందువలన నాకు నిష్ఠూరం వచ్చినా నిర్మ లకి దానివలన నీకూ చెడ్డపేరురాదని అలా చేశాను. ఈ సంగతే నిర్మలకి చెప్పు. పెళ్లికి దాన్నికూడా వెంటపెట్టుకురా. బావగారిని అడిగేనని చెప్పవలెను. ఉంటాను—


నీ పాప.

ఉత్తరం చదవడం పూర్తవగానే సీత మనసులో గాలీ వానా వెలిసినప్పటి ప్రశాం తత నిల్చింది. తల్లికి తెలీకుండా వెనకనుంచి ఒంగి చదివిన నిర్మల వెంటనే "ఇప్పుడైనా నన్ను నమ్ముతావా, నమ్మవా అమ్మా?" అంది. సీత నవ్వింది.

"ఎందుకు నమ్మనూ, ఇంకా? నువు నా కూతురువని నాకు తెలియదా?" అంటూనే నిర్మలని దగ్గరికి లాక్కుని ఆప్యాయంగా బుగ్గలు నిమిరింది.

"అయితే పెళ్లికి నావెంటవస్తావా?" అని సీత అడిగితే నిర్మల "ఊహూ" అంటూ తల అడ్డంగాతిప్పి తల్లి చేతుల్లోంచి తప్పిం చుకుందికి ప్రయత్నించింది. నిర్మల కళ్లలో చిప్పిల్లిన నీరు సీత చూడకపోలేదు. దానికి పెళ్లికి వెళ్లడం ఇష్టం ఉండదని తెలిసీ అలా అడిగినందుకు సీత లోలోపల నొచ్చు కుంది

వాళ్లిద్దరూ ఆ ఉత్తరం చదివాక కూడా, ఎందుకలా ఉన్నారో అర్థంకాక ప్రభా కర్ తెల్లమొహం వేశాడు. ●



కొత్త నటుడు కృష్ణంరాజు పరిచయం

"రండి, రండి!" అంటూ ఆహ్వానించాడు ఆజాను బాహుడైన ఓ యువకుడు ఆతని గొంతులోని మాధుర్యం, వినయం, నెమ్మదీ నన్ను ఆకర్షించినవి

ఆరడుగుల పొడవు, చక్కని శరీర సౌష్టవం, ఆకర్షణీయంగా వుండే కన్నులూ గల యీ అబ్బాయి పేరు ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు శ్రీ కె ప్రత్యగాత్మ దర్శకత్వాన తయారయి యిటీవలే విడుదలయిన "చిలకా గోరింకా" చిత్రంలో శతాధిక చిత్ర సుందరి కృష్ణకుమారి ప్రక్కన కథానాయకుడిగా నటించాడు నటించి, ఇటు పరిశ్రమలోను, అటు ప్రేక్షకుల్లోను చక్కని నటుడనే పేరు తెచ్చుకున్నాడు సహనటులు 'బేష్' అని భుజం తట్టారు


నాకు తెలిసిన ఒక దర్శక మిత్రుడు "అతను నటించ లేదండీ, ఆ పాత్రలో జీవించారు" అన్నారు ఇలాంటి పలుకులే ఇద్దరు ముగ్గురు నిర్మాతలు అంటూండగా నేను విన్నాను తొలి చిత్రంతోనే అందరి మెప్పులూ బడయగల సమర్థత కృష్ణంరాజు సంపాయించగలిగాడంటే అందుకు తెరవెనుక అతని కృషి ఎంతో ఉన్నదనే చెప్పవలసి ఉంటుంది

నటన అనేది ఒక కళ ఒక వరం అది ప్రత్యేకమయిన ఒక తపస్సు లాంటిది ఎంతో సాధన చేస్తేకాని సిద్ధించదు సాధించాలనుకున్నా అందరికీ లభ్యంకాదు ఏ కొద్దిమందికో లభిస్తుంది ఆ కొందరిలోనూ కృష్ణంరాజు కూడ ఉన్నాడు

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, తాలూకాలోని మొగల్తూరు గ్రామంలో 1940 జనవరి 20న సాంప్రదాయబద్ధమైన సంపన్న కుటుంబంలో జన్మించాడు కృష్ణంరాజు తండ్రి శ్రీ సత్యనారాయణ రాజు, తల్లి శ్రీమతి లక్ష్మీనరసాయమ్మ తమ బిడ్డ కళాకారుడవుతాడని ఆనాటి ఆ పసివాణ్ణి చూసి అనుకోలేదు బాల్యంలోనూ స్కూల్లో చదివే రోజుల్లోను చెప్పుకోదగిన సంగతులేమీ లేవు సినిమాల్లో నటించాలనే ఉత్సాహంకాని, స్టేజి మీద వేషం వెయ్యాలనే ఆసక్తికాని లేవు అప్పట్లో ఆతనిలో

స్కూలుఫైనలు పూర్తి చేసిన తర్వాత నరసాపూర్ కాలేజీలో ప్రీయూనివర్శిటీ కోర్సులో చేరాడు కృష్ణంరాజు ఆ రోజుల్లో అతను కుటుంబపు వ్యవహారం గురించి ఒకసారి హైదరాబాద్ వెళ్లవలసి వచ్చింది ఆ నగర వాతావరణం, పరిసరాలు అతన్ని అమితంగా ఆకర్షించినవి అక్కడే వుండి తన చదువు కొనసాగించాలనుకున్నాడు

1961 లో హైదరాబాదుకు వచ్చాడు బద్రుకా కాలేజీ ఆఫ్ కామర్స్‌లో చేరాడు. రిపబ్లిక్ దినోత్సవాన అతని పినతండ్రి శ్రీ పిహెచ్ పి మూర్తిరాజు ఎం ఎల్ ఏ ఆరంభించిన "ఆంధ్రరత్న" దినపత్రిక



'చిలకా—గోరింకా'లో కృష్ణకుమారి, కృష్ణంరాజు

మోహన్ కుమార్

నిర్వహణ కార్యకలాపాలు చూస్తూ ఉండేవాడు. ఆంధ్రరత్న ప్రచురణ ఏడెనిమిది మాసాలపాటు సాగి, నిలచిపోయింది. మూర్తి రాజుగారికి అప్పట్లో హైదరాబాద్‌లో సినీ సౌండ్ స్టూడియో వుండేది. కృష్ణంరాజు దాని నిర్వహణ పట్ల శ్రద్ధ చూపాడు కొన్నాళ్ళు. క్రమేణా సినిమాలు చూసే అలవాటు పెంపొందింది. నటించాలనే కోరిక అతనిలో మొలకెత్తింది బావమరదళ్ళు చిత్రం తీసిన శ్రీ పద్మనాభరావు ప్రోత్సాహంతో 1963 లో మద్రాసు వచ్చాడు. కొన్ని కాలానికి ఒక మిత్రుని ద్వారా దర్శకుడు శ్రీ ప్రత్యగాత్మతో పరిచయమేర్పడింది. కృష్ణంరాజు ముఖవర్చస్సూ, విగ్రహమూ ఆయనను ముగ్ధుణ్ణి గావించినవి. 'నీ హైట్ నీకు మంచి ఎసెట్' అని భుజం తట్టారు. స్క్రీన్ టెస్ట్ చేయించారు ఆయన ఆశించిన ఫలితాలు వచ్చినవి. తను తీయబోయే కొత్త చిత్రంలో తప్పకుండా అవకాశం కల్పిస్తానన్నారు ప్రత్యగాత్మ. సినిమా నటుడు కాబోయే వ్యక్తికి నాటకరంగానుభవం ఉండడం అవసరమని తలచి ప్రత్యగాత్మ యీలోగా నాటకాలలో నటిస్తూండమని సూచించారు.

ఆయన సూచనను పాటించి మద్రాసు త్యాగరాయనగర్‌లోని కృష్ణగాన సభహాలులో ప్రదర్శించబడిన "నాగమల్లి" జానపద నాటకంలో ముఖ్యభూమిక పోషించాడు. ఆటుపిమ్మట "పరివర్తన" నాటకంలో కూడ పాల్గొన్నాడు. ఆ నాటకాన్ని శ్రీ ప్రత్యగాత్మ చూసి కృష్ణంరాజు నటనను అభినందించారు. అతని కృషిని మెచ్చుకున్నారు. దానితో తానూ నటించగలననే ధీమా ఆత్మవిశ్వాసం కృష్ణంరాజులో నెలకొన్నవి.

"మంచి మనిషి" చిత్రం షూటింగ్ జరిగేప్పుడు రోజూ ఆ చిత్రం సెట్స్‌కు వెళ్ళేవాడు అక్కడ దర్శకుని మేధస్సూ, నటీనటుల భంగిమలనూ, హావభావాలను ప్రకటించే విధానాన్నీ జాగ్రత్తగా పరిశీలించేవాడు నటనలోని మెళుకువలు నేర్పుతో గ్రహించాడు.

1965 లో బహుశా ఆగస్టు 6న అనుకుంటాను, ప్రత్యగాత్మగారు కృష్ణంరాజుకిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారు ఆయన స్వంత చిత్రం "చిలకా గోరింకా" చిత్రం షూటింగ్ ప్రారంభించిన రోజు అది.. ఆ చిత్రంలో నటించేప్పుడు దర్శకుడు ప్రత్యగాత్మగారితో పాటు, కృష్ణకుమారి,



ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు

యస్ వి రంగారావు వంటి నటీనటుల సహకార ప్రోత్సాహాలు అతనికి మరింత ఉత్సాహాన్ని కలిగించేవి. వారికెప్పుడూ కృతజ్ఞుడిని అంటూ వుంటాడు కృష్ణంరాజు.

ఒక సినిమా విడుదలయితే అందులో నటించిన తారలపై పలువురు పలురకాలుగా విమర్శిస్తూండటం జరుగుతుంది సాధారణంగా. కాని, చిలకా గోరింకా విడుదలానంతరం కృష్ణంరాజు గురించి నాకు తెలిసినంతవరకు అలాంటి పలువిధాలయిన అభిప్రాయాలేర్పడలేదు అందరికీ ఒకటే అభిప్రాయం ఏర్పడింది. కొత్తవాడయినా చక్కగా నటించాడనేది ఆ అభిప్రాయ సారాంశం

కృష్ణంరాజుకు నటుడిగా ఉజ్వలమయిన భవిష్యత్తు ఉన్నది. నటనలో అభివృద్ధి సాధించాలని కొత్త సంగతులు తెలుసుకోవాలని అతని అభిలాష ఆకాంక్ష. తన అభివృద్ధికి తోడ్పడిన పినతండ్రి మూర్తిరాజుగారికీ తన నటజీవితానికి పునాది వేసిన ప్రత్యగాత్మగారికి ఎంతో ఋణపడి వున్నానంటాడు. భాను పిక్చర్స్ అనే నూతన చిత్ర నిర్మాణసంస్థ నిర్మించబోయే చిత్రంలో మళ్లీ కృష్ణకుమారి ప్రక్కన హీరోగా నటించబోతున్నాడు. ఈ చిత్రం కూడా ప్రత్యగాత్మగారి దర్శకత్వంలో తయారవుతుంది కృష్ణంరాజు గణనీయమైన నటుడిగా రూపొందుతాడనడంలో అత్యుక్తి లేదు. ●

చిత్రలహరి

శ్రీ వి. మధుసూదనరావు ప్రతిభావంతుడయిన దర్శకుడు. కథను దృష్టిలో పెట్టుకొని, సన్నివేశాన్ని మననం చేసుకుంటూ చిత్రీకరణ పట్ల ఎంతో శ్రద్ధ కనబర్చుతారు. అందుకే ఆయన దర్శకత్వం వహించిన చిత్రాలు విజయవంతమవుతూ వచ్చినవి. ఈ యేడాది "అంతస్తులు" కేంద్ర, రాష్ట్రప్రభుత్వ బహుమతులనేగాక, ఫిలింఫేర్ ఎవార్డు కూడ గెలుచుకున్నది. ఆ చిత్రానికి ఉత్తమదర్శకుడుగా యెంచి రాష్ట్రప్రభుత్వం శ్రీ మధుసూదనరావుకు నాలుగువేల రూపాయలు బహూకరించింది. 'కొత్తదనం గల చక్కని కథ వ్రాసి పంపిన వారికి ఆ బహుమతి మొత్తాన్ని యివ్వగల'మని మధుసూదనరావుగారు ఒక ప్రకటన చేశారు.

ఇటీవల నేను ఆయన్ని కలుసుకున్నప్పుడు ఈ విషయం ప్రస్తావించాను. మీకు నచ్చిన కథ ఏదయినా వచ్చిందా? అని. అందుకాయన నవ్వుతూ "రోజూ ఏవో వస్తూనే వున్నాయి. వాటిని నేను పరిశీలించలేదు ఈ ఉత్తమ కథ ఎన్నికకు ఒక కమిటీని ఏర్పరచే ప్రయత్నం జరుగుతోంది. నాతోపాటు ఒక నిర్మాత, ఒక నటుడు, ఒక రచయిత యీ కమిటీలో సభ్యులుగా ఉంటారు. కమిటీ సభ్యులంతా యీ కథలు చదివి, వాటిలో ఉత్తమమయిన దానికి ఆ బహుమతి మొత్తాన్ని యివ్వడం జరుగుతుంది. అయితే దానికి యింకా కొంత టైము పడుతుంది. ప్రస్తుతం నేను షూటింగుల హడావిడిలో వున్నాను తీరిక చిక్కగానే ఉత్తమ కథా ఎన్నిక కార్యక్రమం ప్రారంభమవుతుంది." అన్నారు.

మధుసూదనరావుగారి లాంటి విజ్ఞులైన దర్శకులెందరో మనకి వున్నారు వారు కూడా పూనుకొని ఆయనలా కథా రచయితలను ప్రోత్సహిస్తే కావలసినన్ని కొత్త కథల్ని ఉన్నత ప్రమాణాల్లో మనవాళ్ళు సృష్టించడానికి అవకాశం ఉంటుంది.

రవీంద్ర ఆర్ట్ ప్రొడక్షన్స్

రవీంద్రా ఆర్ట్ ప్రొడక్షన్స్‌వారి సొం

చిత్రలహరి



నటి భాంతి ఫోటో ప్రభాకర్

ఫీక చిత్రం పన్నెండు రీళ్ళు పూర్తి అయి నది ఇందులో యన్ టి రామారావు, అంజలీదేవి, కాంచన, పద్మనాభం, రమణా రెడ్డి, మల్లాది సత్యనారాయణ, సి హెచ్ కృష్ణమూర్తి బేబీ పద్మిని, మాస్టర్ ఆది నారాయణ,రేలంగి(లలిత)పాల్గొంటున్నారు సంభాషణలు ఆత్రేయ, గీతాలు ఆత్రేయ, సి నారాయణరెడ్డి, కొసరాజు, ఆరుద్ర, దేవులపల్లి కృష్ణశాస్త్రి, సంగీతం కె వి మహదేవన్, నృత్యాలు హీరాలాల్, కళ ఎస్ కృష్ణారావు, కెమెరా సి నాగేశ్వర రావు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వి మధు సూదనరావు నిర్మాత డి వి రెడ్డి, తర్వాత షెడ్యూలు జూలై నుంచి ఆరంభమవు తుంది

సతీ అరుంధతి

పదరవ్ మూవిటోన్ హైదరాబాద్ వారి 'సతీ అరుంధతి' చిత్రం ఇంతవరకూ అయిదు రీళ్ళు పూర్తి అయింది జమున, అంజలీదేవి, గుమ్మడి, కాంతారావు, నాగయ్య, ఉదయకుమార్, గీతాంజలి మొదలయిన వారు నటిస్తున్నారు సంభాషణలు మహా రథి, గీతాలు సి నారాయణరెడ్డి, దాశరథి, సదాశివబ్రహ్మం, సంగీతం అశ్వత్థామ కూర్పు వాసు, కెమెరా జయరామరెడ్డి, దర్శకత్వం సి యస్ రావు, నిర్మాత జి కృష్ణారెడ్డి సెప్టెంబరు మాసానికి పూర్తిచేసి విడుదల చెయ్యాలనుకుంటు న్నట్టు చెప్పారు నిర్మాత

కాంభోజరాజు కథ

అనంతలక్ష్మి ప్రొడక్షన్స్ వారి 'కాంభోజరాజు కథ' చిత్రానికి గత నెల20వ తేదీన వాహినీలోని అయిదవ ఫ్లోర్‌లో మధ్యా హ్నం మూడు నాలుగు గంటల మధ్య ప్రారం భం జరిగింది ప్రారంభానికి చలనచిత్ర పత్రికలకు చెందిన అనేకమంది నిర్మాతలు, దర్శకులు, సంగీత దర్శకులు హాజరయి నారు నవజ్యోతి వారి షూటింగ్ నుంచి యన్ టి ఆర్ వచ్చి దర్శకుడు తిలక్‌నూ, నిర్మాతలనూ అభినందించి వెళ్ళారు పూజ ముగిసిన పిదప రామకృష్ణరావు(భరణి) కె శ్రీనివాసరావు(నవయుగ), విఠలాచార్య వరుసగా వెంకటేశ్వరస్వామికి టెంకాయలు కొట్టారు అనంతరం శ్రీ కొసరాజు రాఘ వయ్యచౌదరి శ్రీయుతులు కె వి రెడ్డి, రామకృష్ణప్రసాద్ (సారథి స్టూడియో అధిపతి) గార్లను పుష్పమాలాలంకృతులను చేశారు కె వి క్లాప్ చేయగా రామకృష్ణ ప్రసాద్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు

గుమ్మడి, శోభన్‌బాబు, రమణారెడ్డి, చదలవాడ, ధూళిపాళ, అంజలీదేవి, రాజశ్రీ, ఎల్ విజయలక్ష్మి వాణిశ్రీ, సూర్యకాంతం మొదలయిన వారు నటిస్తున్న యీ చిత్రా నికి సంభాషణలు ఏ పిచ్చేశ్వరరావు సమ కూర్చారు గీతాలు కొసరాజు, ఎ నారా యణరెడ్డి సంగీతం టి వి రాజు, కళ: వి వి రాజేంద్రకుమార్ బి ఏ, కూర్పు: సత్యం, ప్రొడక్షన్ కంట్రోలర్ చెంచు రామయ్య, కెమెరా యస్ వెంకటరత్నం దర్శకత్వం తిలక్, నిర్మాతలు భాస్కరరావు, కొసరాజు భానుప్రసాద్ ఎం ఏ బి.యల్.

సతీ సుమతి


చిన్ని బదర్స్ వారు నిర్మిస్తున్న "సతీ సుమతి" చిత్రం యింతవరకు నాలుగు రీళ్ళు పూర్తి అయింది ప్రస్తుతం వీనస్ స్టూడియోలో మోహనాంగి యింటి సెట్టు పైన పని జరుగుతున్నది ఇందులో అంజలీదేవి, కాంచన, ఎల్ విజయలక్ష్మి, గిరిజ వాసంతి, సూర్యకాంతం, కాంతారావు, యస్ వి రంగారావు, రేలంగి, హరనాథ్, ధూళిపాళ నాగరాజు పాల్గొంటున్నారు గతనెల 19,20 తేదీల్లో పి సుశీల పాడిన "దోరవయసు" అనే గీతాన్ని మోహ నాంగి కాంచన పై చిత్రీకరించారు దర్శ కులు వేదాంతం రాఘవయ్య, రచన సము ద్రాల రాఘవాచార్య, సంగీతం ఆదినారాయణ రావు కళ వాలి, కాస్ట్యూమ్స్ నారాయణ మూర్తి, నృత్యాలు వెంపటి సత్యం, ప్రొడ క్షన్ ఎగ్జిక్యూటివ్ కె ఫకీర్‌రావు బి నాగేంద్రరావు, కెమెరా కమల్‌ఘోష్, కూర్పు ఎన్ ఎస్ ప్రకాశం, నిర్మాత పి చిన్నారావు

రక్తసింధూరం

చిత్తూరు జిల్లాలోని బాలమాకులం, సల్లెలోని బంగారుపాలెం జమీందారు గారి గుంటతోపు — వంద యకరాల మామిడి తోటలో రిపబ్లిక్ ప్రొడక్షన్స్ వారి "రక్త సింధూరం" చిత్రానికిగాను యింటి సెట్టు వేసి యిటీవల పదిరోజులపాటు షూటింగ్ జరిపి వచ్చారు



టైప్‌రైటర్ సహాయంతో రూపొందించిన స్త్రీ చిత్రం.
(చిత్రం: జె. గోపాలస్వామి, అంబాజీపేట)


సీతారామాంజనేయ పిక్చర్స్ వారి
సంగీతలక్ష్మి
గిడుతూరి సూర్యం · పి. నరసింగరావు · అమరా రామసుబ్బారావు
సంగీతం యస్. రాజేశ్వరరావు
రచన/ఆత్రేయ/కెమెరా/అన్నయ్య/కళ/రాజేంద్రకుమార్...
నృత్యం/K.S. రెడ్డి/కూర్పు/M.S.N. మూర్తి

చిత్రలహరి

శోభన్‌బాబు బాలయ్య, రామకృష్ణ, ప్రభాకరరెడ్డి, నాగయ్య (గెస్టు) ప్రసాద్, అశోక్‌కుమార్, (కొత్తనటుడు) రాజశ్రీ, గీతాంజలి, విజయశ్రీ, సూర్యకళ, పండరీబాయి మున్నగువారు నటిస్తున్న యీచిత్రం యింతవరకు సగానికి పైగా రీళ్ళు పూర్తయిందనీ, జూలై మధ్యభాగానికి చిత్రనిర్మాణం పూర్తి కాగలదనీ నిర్మాత సీతారామ్ తెలియజేశారు. సముద్రాల ద్వయం, శ్రీ శ్రీ, ఆరుద్ర వ్రాసిన గీతాలకు రాజేశ్వరరావు సంగీతం సమకూర్చుతున్నారు. కళ ఘోడ్ గాంకర్, కెమెరా దత్తు, రచన, దర్శకత్వం, నిర్మాణం పి సీతారామ్

సంగీతలక్ష్మి

సీతారామాంజనేయ పిక్చర్స్‌వారి సంగీత రస ప్రధాన సాంఘిక చిత్రం "సంగీతలక్ష్మి" నిర్మాణం పూర్తి చేసుకుని విడుదలకు ముస్తాబులు సంతరించుకుంటున్నది. ఇందులో యన్ టి రామారావు, యస్ వి రంగారావు, నాగభూషణం, రమణారెడ్డి, రాజ్‌బాబు, ప్రసాద్, ఏడిద నాగేశ్వరరావు, పేరుమాళ్ళు, సత్యం, నరసింగరావు, జమున, ఎల్ విజయలక్ష్మి, సూర్యకాంతం, నిర్మల, మొదలయిన వారు నటించారు. సంభాషణలు ఆత్రేయ, గీతాలు ఆత్రేయ, సి నారాయణరెడ్డి, దాశరథి, శ్రీ శ్రీ, సంగీతం ఎస్ రాజేశ్వరరావు, నృత్యాలు కె. యస్



ఇందిరా రమణావారి తొలిచిత్రంలో వాణిశ్రీ



ఇటీవల మచిలీపట్నం లేడీస్ రిక్రియేషన్ క్లబ్ వార్షికోత్సవంలో నృత్యంచేసిన 'ఆంధ్ర సోదరీమణులు' (కుమారి విజయ, సారూతి), అక్కినేని నాగేశ్వరరావు.

రెడ్డి, కళ వి. వి. రాజేంద్రకుమార్ బి. ఏ, కెమెరా అన్నయ్య, ఎడిటింగ్ ఎం. ఎస్. ఎన్. మూర్తి, నిర్వహణ: అమరా రామసుబ్బారావు, నిర్మాత: పి. నరసింగరావు, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: గిడుతూరి సూర్యం. ఆంధ్రలో యిది రాయల్‌ఫిలిమ్స్ ద్వారా విడుదల అవుతుంది.



'కన్నెమనసులు'లో సుకన్య

మోహినీ భస్మాసుర

బి ఏ యస్ ప్రొడక్షన్స్‌వారి "మోహినీ భస్మాసుర" చిత్రం సగానికి పైగా పూర్తయింది. యస్ వి రంగారావు, కాంతారావు, బాలయ్య, రామకృష్ణ, ధూళిపాళ, రఘురామయ్య, పద్మిని, అనరాధ, కళ్యాణి, ముఖ్యభూమికలు పోషిస్తున్నారు. కథ, మాటలు గబ్బిట వెంకటరావు, పాటలు: ఆరుద్ర, సంగీతం యస్ రాజేశ్వరరావు, నృత్యాలు రాజు, జయరాం, కళ వాలి, ప్రొడక్షన్ ఇన్‌ఛార్జి యస్ సత్తిరాజు, కెమెరా దత్తు, రెహమాన్, ఎడిటింగ్ మార్తాండ్, నిర్మాత, దర్శకుడు బి ఏ సుబ్బారావు జెమినీ స్టూడియోలో నిర్మించబడుతున్న యీ చిత్రం ఆంధ్రలో నవయుగ ఫిలిమ్స్ ద్వారా విడుదల అవుతుంది

తెలుగులో 'సిత్తి'

తమిళ దేశమంటటా విజయవంతంగా సాగిన "సిత్తి" పిన్ని చిత్రాన్ని శ్రీకాంత్ ప్రొడక్షన్స్ అనే నూతన చిత్ర నిర్మాణ సంస్థ తెలుగులో పునర్నిర్మిస్తున్నది. ఇంతవరకు ఒకసెట్టు, (కథానాయకి యిల్లు) పై పని జరిగింది. రేలంగి, దేవిక, శోభన్‌బాబు, బాలయ్య, అల్లు రామలింగయ్య, విజయనిర్మల, చలం ప్రభృతులు నటిస్తున్న యీ చిత్రానికి సంభాషణలు పినిసెట్టి వ్రాశారు. గీతాలు ఆరుద్ర, సంగీతం టి వి రాజు, కళ అన్నామలై, ఎడిటింగ్ శ్రీరాములు, కెమెరా ఎల్లప్ప, దర్శకత్వం బి ఏ సుబ్బారావు, నిర్మాత: నాండప్పచెట్టియార్. షూటింగ్ పెద్యూలు తిరిగి జూలై 15 నుంచి ఆరంభమవుతుంది

భక్తపోతన

భారత్ ఫిలిమ్స్ వారి "భక్తపోతన" చిత్రం సెన్సారు అయింది. రీ రికార్డింగ్ జరుగుతున్నది. యస్ వి రంగారావు, గుమ్మడి, అంజలీదేవి, పద్మిని, వసంతి, శారద, జయశ్రీ, హరనాథ్, చలం, ప్రభాకరరెడ్డి, బాలయ్య, నాగయ్య, రావుగోపాలరావు, నటించారు. సావిత్రి, కె ఆర్ విజయ, శోభన్‌బాబు, కామినేని ఈశ్వరరావు అతిథినటులుగా పాల్గొన్నారు. రచన: సముద్రాల రాఘవాచార్య, దాసం గోపాలకృష్ణ, సంగీతం రాజేశ్వరరావు, కెమెరా: పి నాగేశ్వరరావు, ట్రిక్స్ రవికాంత్, కళ: వి వి రజేంద్రకుమార్ బి ఏ, కూర్పు



కీర్తిశేషులు చిపుళ్ల ధర్మారావు

హనుమంతరావు, దర్శకుడు జి రామినీడు, అసోసియేట్ మాణిక్యరావు, నిర్మాత, టి విశ్వేశ్వరరావు

ఆలీబాబా 40 దొంగలు

భాగ్యలక్ష్మి ప్రొడక్షన్స్ వారు "ఆలీబాబా 40 దొంగలు" చిత్రం నిర్మించే సన్నాహాలలో వున్నారు కాంతారావును, యింతవరకు ఎన్నుకున్నారు రచన: సదాశివబ్రహ్మం చేస్తున్నారు 'ఇంటిగుట్టు', 'మామకు తగ్గ అల్లుడు' చిత్రాల ద్వారా మధురమైన బాణీలు అందించిన శ్రీ ఎం ఎస్ ప్రకాష్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తారు కళ ఘోడ్ గాంకర్, దర్శకత్వం వేదాంతం రాఘవయ్య మిగిలిన నటీనటులను కూడా ఎన్నుకుని త్వరలో సెట్స్ పైకి వెళ్లనున్నారు

విజయలక్ష్మి పిక్చర్స్

సాహసోపేత కృత్యాలతో సరికొత్త కథాసంవిధానంతో నిర్మించబడుతున్న విజయలక్ష్మి పిక్చర్స్ వారి స్పై థ్రిల్లర్ యింతవరకు సదిరీళ్లు పూర్తి అయింది చిత్రీకరించిన ఆరుపాటల్లోనూ మూడు ఊటీలో తీశారు మరొకటి రంగూల్లో, చిత్రీకరణ జరిపారు జయలలిత, కృష్ణ (తేనె మనసులు) రేలంగి, రమణారెడ్డి, గీతాంజలి, ముక్కామల రాజ్‌బాబు, శోభన్‌బాబు (గెస్ట్) నటిస్తున్నారు సంభాషణలు ఆరుద్ర, గీతాలు సి నారాయణరెడ్డి ఆరుద్ర, సంగీతం టి చలపతిరావు నృత్యాలు చిన్ని, సంపత్, కళ యస్ కృష్ణారావు, ఎడిటింగ్ యన్ యస్ ప్రకాశం, కెమేరా రవికాంత్, దర్శకత్వం ఎం మల్లికార్జున రావు, నిర్మాతలు సుందర్‌లాల్ నహతా, డూండి

చాముండేశ్వరి ప్రొడక్షన్స్

చాముండేశ్వరి ప్రొడక్షన్స్‌వారు తెలుగులో తొలిసారిగా ఒక పౌరాణిక చిత్రం నిర్మిస్తున్నారు ఇటీవల మహాబలిపురం అవుట్‌డోర్స్‌లో ఆరుద్ర వ్రాసిన రెండుగీతాలు — కాంతారావు కృష్ణకుమారి, వలంలతో చిత్రీకరించిన బడినవి మాటలు రాజశ్రీ పాటలు ఆరుద్ర, రాజశ్రీ, సంగీతం కోదండపాణి, కెమెరా అన్నయ్య, కథ, దర్శకత్వం బి బంగార్రాజు

—మోహన్ కుమార్ ●

కథకులకి పనికివచ్చే చిట్కా!

ప్రముఖ జాతీయ నాయకునిగా పేరొందిన బిపిన్‌చంద్రపాల్ కుమారుడు నిరంజన్‌పాల్ చిత్రపరిశ్రమలో విదేశాల్లో రాణించిన మొట్టమొదటి భారతీయుడు నిరంజన్‌పాల్ 1925 లో 'ది లైట్ ఆఫ్ యేషియా' అనే మహత్తర చిత్రాన్ని ఆయన ఇంగ్లండులో నిర్మించారు 1932 లో ఇంగ్లండులో చిత్రీకరింపబడిన 'కర్మ' చిత్ర నిర్మాణంలో హిమాంశురాయికి తన సహకారాన్నందించి సహాయపడ్డారు

హిమాంశురాయి స్థాపించిన బొంబే టాకీసుకు నిరంజన్‌పాల్ స్క్రిప్టు రాస్తున్న సమయంలో కొంతమంది నిర్మాతల గ్రంథచౌర్యం నుంచి రచయిత తన్ను తానెలా కాపాడుకోవాలన్న విషయంలో సలహా అడగటానికి నేను ఆయనవద్ద కెళ్లాను

అప్పుడు "మీకు నే నిచ్చే చిన్న సలహా ఏమంటే నిర్మాతకు మీరిచ్చే కథ కాపీ నొకదాన్ని రిజిస్టర్ పోస్టులో మీ అడ్రసుకు పోస్ట్ చేయండి తర్వాత అది మీకు చేరగానే తెరవకుండా దాన్ని జాగ్రత్తగా దాచిపెట్టాలి ఆ నిర్మాత గ్రంథచౌర్యానికి పాల్పడ్డ పక్షంలో ఆ కవరును కోర్టువారికి ఇవ్వండి మీరే దాని అసలు రచయిత అన్న నిజానికి అదే దృఢమైన ఆధారం" అన్నారు నిరంజన్‌పాల్

—వి. ఎస్. సుక్తాంకర్. ●



దర్శకుడు హేమాంబరధరరావు

నాటకమాడి సినిమాల్లో చేరాను!

1920 ప్రాంతాల్లో 'దేవదాసి' పద్ధతిని నిర్మూలించాలనే ఉద్యమం దేశమంతటా వ్యాపించింది 1928 లో ఒక మరాటీ స్త్రీల మాసపత్రిక ఈ విషయమంపై ఒక ప్రత్యేక సంచిక వెలువరించింది ఈ సంచికకి 100 పేజీలు వేశారు ఇందులో 40 పేజీలని నా నవల కొకదానికి కేటాయించారు ఈ కథని అందరూ పొగడటంతో దానిని సినిమాకి ఎందుకు వాడరాదనే వూహ నాలో కలిగింది 1929 కి నా కాలేజి విద్య ముగిసింది వెంటనే ఈ నవలని సినిమాకి తగినట్లుగా దిద్దటం ప్రారంభించాను కాని, మూడు నెలలుగా ప్రయత్నించినా ఏ సినిమా ప్రభృతుడూ దానిని తీసుకోలేదు ఇక లాభం లేదనుకుని నా సినిమా వ్యాసంగొన్ని వదులుకుని చిన్న పిల్లల పుస్తకాలు రాయటానికి పూనుకున్నాను ఒక ప్రచురణకర్తతో ఏర్పాట్లు చేసుకున్నాను

ఇలా ఉండగా, ఒకనాడు అనుకోకుండా నా పాత స్నేహితుడూ, తోటి విద్యార్థి అయిన మాధవకాళెని కలుసుకోవటం జరిగింది ఇతను చలాకీ మనిషి విలన పురుషుడు, సినిమా నటుడు కావాలని ప్రయత్నిస్తున్నాడు

"సుఖ్తంకర్, నీ కథని 'ఓరియంట్ పిక్చర్ కార్పొరేషన్' వాళ్లకి ఎందుకు చూపించకూడదు?" అని అడిగాడు నా కథ వంతా విని, నాకు సహాయం చెయ్యబోయి విఫలుడయిన తర్వాత

అతని ప్రశ్నకి నవ్వుకున్నాను ఓరియంట్ పిక్చర్ కార్పొరేషన్'ని కొందరు పార్శీ పారిశ్రామికవేత్తలు స్థాపించారు వీరు మంచి సంస్కృతి, నాగరికతకి పేరుపొందినవారు తాము తీసె బొమ్మలని విదేశాలకి ఎగుమతి చెయ్యాలని అనుకునేవారు టాగూర్ రాసిన 'శాక్రిఫయిస్' అనే కథని సినిమాగా తీశారు ఇటువంటివాళ్లా నాకథని— ఎందరో నిర్మాతలు తోసి వేసిన నా కథని! తీసుకుంటారు? నవ్వుల పాలవటం ఇష్టం లేదని కాళె సూచనని అంగీకరించలేదు

ఒకపక్షం రోజులతర్వాత మాధవ్‌కాళె మళ్లీ కనిపించాడు నా గదిలోకివస్తూనే, "మూశావా! నువ్వెంత బుద్ధితక్కువవాడివో!! నీ కథని ఓరియంట్‌వాళ్లకి ఇవ్వనన్నావు— కాని మనతో చదువుకునే బూలే ఉన్నాడు చూశావూ, వట్టి మొద్దబ్బాయి, ఇంటర్మీడియట్‌లో కూడా మూడుసార్లు తప్పాడు, ఆ బూలేకథనే ఓరియంట్ కంపెనీ కొంది స్టేషన్‌లో కనిపించి అంతా చెప్పాడు అవసరంగా వెళ్లిపోతున్నా అన్ని వివరాలూ చెప్పాడు! సెకండ్ క్లాస్‌లో కూడా వెళ్లాడు వెధవ!" అన్నాడు అంతటితో వూరుకోకుండా, "ఈ బూలే చదువులో దద్దమ్మ అయినా తెలివిగలవాడని నాకు మొదట్నించీ తెలుసు నాకు వాడంటే ఎప్పుడూ ఇష్టమే" అని కూడా అన్నాడు గంభీరంగా

నాలో నిజంగానె సంచలనం కలిగింది ఏమిటీ! ఇంటర్మీడియట్‌లో మూడుసార్లు దండయాత్ర చలికిన బూలే సెకండ్ క్లాస్ ప్రయాణమా! సినిమాకి కథని అమ్మటమా! నేనేమో బస్సులో తిరగలేక ట్రాములో వెళ్లటమా! ఇక వూరుకుని లాభంలేదు!

మర్నాడే ఓరియంట్ పిక్చర్స్ కార్పొరేషన్ వారి ఆఫీసుకి వెళ్లాను ఆ సంస్థ అధిపతి శ్రీ పి ఎస్ తల్యార్‌ఖాన్, సినిమా దర్శకుడు శ్రీ నవాల్‌గాంధి ఇదరూ నన్ను సగౌరవంగా ఆహ్వానించారు నా కథని విన్నారు

రెండు రోజుల తర్వాత నేను తిరిగి వాళ్ల ఆఫీసుకి వెళ్లాను శ్రీ తల్యార్ నన్ను అభినందిస్తూ, నా కథని స్వీకరించినట్లు చెప్పాడు వాళ్ల మొదటి చిత్రం టాగూర్ కథని ఆధారంగా చేసుకుని తీసింది, రెండోది వి ఎస్ సుఖ్తంకర్ కథని ఆధారంగా తీసుకున్నది!

ఒప్పందాలన్నీ చేసుకున్నాము నాకుముంది ఎడ్వాన్సు ఇచ్చారు అందరికీ కృతజ్ఞతలు తెలుపుకుని, బయటపడేముందు ఈ విజయంతో వచ్చిన ధైర్యాన్ని కూడగట్టుకుని బూలే కథని గురించి అడిగాను

"బూలె కథకన్నా ముందు నాది వాడుకుంటారా?" అని

శ్రీ గాంధి, "బూలే ఎవరు? కథేమిటి?" అని అడిగాడు

కొంచెం సిగ్గుపడినా కాళె చెప్పిన కథవే వారికి చెప్పాను వాళ్లు విరగబడినవ్వారు కొద్దిగా చిన్నబుచ్చుకుని బయటపడ్డాను గదికి వచ్చేసినతర్వాత కాళె కనిపించినప్పుడు జరిగినదంతా చెప్పాను

కాళెకి నవ్వూ, కోపమూ రెండూవచ్చాయి "నాతోనే ఇంత అబద్ధ మాడుతాడా వీడు! వాడిపని పడ్తాను చూడు!" అని ఎగిరాడు

1930లో ఓరియంట్ పిక్చర్స్‌వారి చిత్రం "దేవదాసి" విడుదల అయింది అందరి మన్ననలనీ పొందింది ఆతర్వాత టాగూర్ 'శాక్రిఫయిస్' తో బాటు లండన్‌లో ప్రదర్శించారు ఈ చిత్రాన్ని— అది మూకీ మాత్రమే, టాకీకాదు

బూలే పేరు మళ్లీ సినిమా వర్గాలలో కాని, సారస్వతవర్గాలలోకాని నేను వినలేదు అయినా, అతని అబద్ధమే నన్ను సినిమా పరిశ్రమలోకి దింపింది

బూలేకి ఎప్పటికీ కృతజ్ఞుడనే!

వి. ఎస్. సుఖాంకర్



ఇందిర రమణవారి తొలి చిత్రంలో రత్న, శోభనబాబు


Jayadev

పుస్తకాలయం

అవన్నీ నీకళ్ళేనా?

(నాల్గు నాటికల సంపుటి రచయిత శ్రీ తాపీ ధర్మారావు. ప్రచురణ తాపీవారి ప్రచురణలు విజయవాడ—2 ప్రతులకు: 1. విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ—4, 2 చందా నారాయణశ్రేష్ఠి. హైదరాబాద్. పేజీలు: 95 వెల రూ. 1—75)

శృంగారం, తద్విరహం, తనూ్మల జనిత వ్యధ, తృప్తి, ఇత్యాది, ఆదిమధ్యాంత రహితమై, తెనుగు నాట ఏ ప్రక్రియలోనూ సాధారణంగా రచనలు రావటంలేదు ఈ పుస్తకం అందుకు భిన్నంగా వుంది దీనిలో ఆకలి ప్రధానం శృంగారం లేకుండా ఏ ప్రాణి అయినా వుండవచ్చు అన్నం లేకుండా ఏ ప్రాణి వుండదు అందుచేత ఈ సంపుటి విలక్షణంగా వుంది మనిషికి అత్యవసరమైన ఆకలిని గురించి రచనలు ఎందుకు రావటంలేదు? అందరికి తిండి సమృద్ధిగా వుందా? లేదు! మరి? ఆకలిని గూర్చి వ్రాయవచ్చునో వ్రాయకూడదో, వ్రాస్తే ఏమవుతుందో అని, గుడ్డెద్దు చేలో పడ్డట్లు నలుగురు నడిచిన తోవలో నాజూకుగా నాలుగుమాటలు శృంగారమంటూ గిలికితే, అది ఏదో రూపంలో రచన అయిపోతున్న ఈ రోజుల్లో, శృంగారపు ఎడారిలో ఒయాసిస్సులాంటిదీ నాటికల సంపుటి. ఆకలి తీర్చుకోవటానికి తిండి అంటే డబ్బు ముఖ్యం. కలవాడి దగ్గర్నుంచి రావలిసిన ఉన్నవాడు, లేనివాడు అని రెండు వర్గాలు.

ఆర్థిక స్వాతంత్ర్యంలేని సమాజంలో రచయితలు పొందిన వ్యధకు ఈ నాటికలు ఉదాహరణప్రాయాలు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోతే సాంఘిక స్వాతంత్ర్యం అడుగంటుతుంది నైతికమైన విలువలు దిగజారి పోతాయి డబ్బు లేక కడుపుమంటతో వుండే మహా పండితుడూ, ఆకలితో అలమటించిపోతూ, తన సర్వసంపద రెండుకాసులు (కాణీలు) 'గాలివాన భిక్ష' కిచ్చే హృదయవాదీ, యజమాని 'ధర్మప్రభువు' కాంక్షకు, కొడుకు నిండు ప్రాణం బలి అయినా చలించని జీతగాడూ; ఆకలితో ఉన్నందువల్లనే దొంగతనం పైనబడి పిచ్చివాడయిన పనివాడూ, ఒక వర్గానికి చెందుతారు. విరోధిని అణచివేయటానికి డబ్బు వెచ్చించే ధనికుడూ, మహోపన్యాసకుడై ఆకలి ఆలోచింపని ఘనజనమూ, బీదవాడి ఆకలి బాధ తీర్చటానికి, అప్పివ్వరాని వారాలు సాకు చూపే కుబేరుడూ, తన తెలివితక్కువ తనం కప్పిపుచ్చటానికి పేదవాడి హింసకోరే మహాత్ముడూ, మరొక వర్గానికి చెందినవారు. ఈ వర్గ పోరాటం అనాదినుంచీ ఉన్నదే! ఇంకా ఎంతకాలం వుంటుందో తెలియదు. ఇది ఉండరానిది ఆర్థిక సాంఘిక స్వాతంత్ర్యంతో సంఘం పురోగమించాలని రచయిత ఆకాంక్ష.

రెండు నాటికలలో కోదండరాయల ప్రధాన పాత్ర 'కోదండం అంటే విల్లు అంటే ధర్మం' ఇది రచయిత అభిప్రాయం ధర్మం అంటే రచయిత. రచయిత శ్రీ తాపీధర్మారావు రచయిత జీవితం, భావాలు నాటికలలో స్పష్టంగా ప్రతిబింబించాయి. రచయిత జీవితం మాత్రమే కాకుండా ఒక సమాజ జీవితం కనిపిస్తూ వుంది ఈ సమాజం పూర్తిగా ప్రస్తుతానిది కాదు ఇరవై సంవత్సరాలకి పైగా పూర్వంది ఈ నాటికలలో ప్రతిపాత్రా సజీవంగా వుంది కారణం? అవి ఒకనాడు జీవించిన పాత్రలు భవిష్యత్తులో జీవించగల పాత్రలు కోదండరాయలు ఆదర్శవాది ఎదురుదెబ్బలు తిన్నవ్యక్తి ప్రతికే నేర్పు, ధర్మమార్గంలో కోరుకుంటున్న వ్యక్తి ఉమ తెలుగు ఇల్లాలు వెంకడు, కామరాజు యజమాని విధేయులు శేషగిరి, పరమేశం—ఆ పాత్రా, ఈ పాత్రా అనే నవి లేదు ప్రతిపాత్ర కళ్ళ ఎదుట కనిపిస్తుంది ప్రతి పాత్రలోనూ ఆంధ్రత్వం వుంది భాషలో తెలుగు దనం వుంది ఇవి ఆంగ్లభాష మరి ఏ ఇతర భాష తోనూ పొత్తు లేకుండా, ఏ ప్రభావం కనిపించకుండా వెలువడిన అచ్చయిన తెనుగు నాటకలు అటు పూర్తిగా పట్టణంగానీ, ఇటు పూర్తిగా పల్లెగానీ, కాని ఒకరకం బస్తీ ఈ నాటికల రంగస్థలం. జీవితాన్ని స్పష్టంగా చూపబోయిన సంపుటి విజయవంతమే కానీ, ప్రయోగ స్థితి కోల్పోయింది. నాటికలో నాటకీయత వుందికానీ, ప్రదర్శనానుకూలత లేదు ఏమాత్రం లేదు ప్రసారానుగుణంగా వున్నాయి రెండు నాటికలు ప్రసారమయ్యాయి. రెండు 'కాగడా' పత్రికలో ప్రచురితమయ్యాయి. ఏ నాటికకు ప్రయోగానుకూల్యం లేదు అన్ని నాటికలలో ప్రసారశిల్పంవుంది ఆశిల్పానికిమచ్చుతునకలు.

రచనలో సహజత వుంది అందుక్కారణం భాష. ఆ భాష సజీవమయింది తన ప్రాంతం ప్రజలు ఏవిధంగా మాట్లాడుతాం దాదాపు ఆ విధంగా వుంది. రచయిత ప్రయోగించిన భాష కొన్నిచోట్ల కోదండరాయలు మాటల్లో కవిత్వధోరణి కనిపిస్తుంది

క్రమక్రమంగా గతిస్తున్న, ఒకతరం ఆంధ్ర దేశ జీవిత విధానాన్ని ఈ నాటికలు దిక్ప్రదర్శన లాగా చూపుతున్నాయి ఈ సంపుటి చదవదగింది పలు పర్యాయాలు ప్రసారం చేయదగింది. ఆంధ్రసాహిత్య పరిణామ పరిశీలనార్థం భవిష్యత్తు తరం కోసం ఈనాటికల సంపుటి గ్రంథాలయాలల్లో భద్రపరువ దగింది.

—రవి

Edited Printed and Published by S. Radhakrishna at the AndhraPatrika Press, 6&7 Thambu chetty Street Madras-1. Phones Editorial, 21747; Other depts: 29766. Chief Editor, S Sambhu Prasad.

